

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nalgonda, Nellore, Tadepalligudem, Srikakulam

27-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 177 పేజీలు: 8+16 వెల: 6.50




స్క్వాష్ వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌గా అనాహత్ సింగ్

7లో



కామన్వెల్త్ గేమ్స్‌లో మీరాబాయి చానుకు గోల్డ్ రిషికాంతకు రజతం

'ఆట'లో





విద్యా మంత్రి బాధ్యతలు స్వీకరించిన ప్రహ్లాద్ జోషి

తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్న మంత్రి

5లో

# పరీక్షా సంస్కరణలు ఆరంభం

### నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్

### సభ్యులుగా ఎస్. సోమనాథ్, తపన్ దేకా, వి.శ్యామకోటి, అనితా కర్వాల్, అమృత్‌లాల్ మీనా

### పోటీ పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత

### విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కఠిన చర్యలు

### విడియో సందేశంలో వెల్లడించిన ప్రధాని మోడీ



విడియో సందేశం విడుదల చేసిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,జులై 26:** దేశంలోని పరీక్షా వ్యవస్థను మరింత విశ్వసనీయంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ఈ టాస్క్‌ఫోర్స్ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించనుండగా, దాని ఆధారంగా భవిష్యత్ పరీక్షల విశ్వసనీయతను పెంపొందించే చర్యలు చేపడతామని తెలిపారు. ఎక్స్ విడియో వేదికగా విడుదల చేసిన వీడియో సందేశంలో ప్రధాని మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం కేంద్ర ప్రభుత్వం నిరంతరం కీలక చర్యలు తీసుకుంటోందన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారు ప్రస్తుతం జైళ్లలో ఉన్నారని పేర్కొన్నారు. పరీక్షలలో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేశామని, అలాగే కఠినమైన శిక్షా నిబంధనలతో కొత్త చట్టాన్ని తీసుకురావడానికి పార్లమెంట్‌లో చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇటీవల జరిగిన ప్రశ్నపత్రాల లీకేజీలపై నిరసనలు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అనంతరం ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. భవిష్యత్‌లో పరీక్షా వ్యవస్థ పూర్తిగా పారదర్శకంగా ఉండాలని, సాంకేతికతను అత్యధికంగా వినియోగించేలా రూపొందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రపంచ ప్రఖ్యాత సాంకేతిక నిపుణుడు నందన్ నీలేకని నాయకత్వంలో హైపవర్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కమిటీ పరీక్షా వ్యవస్థలో సాంకేతికత వినియోగాన్ని పెంపొందించడంతో పాటు, నిర్మాణాత్మక సంస్కరణలపైకూడా దృష్టి సారించనుంది. వివిధ రంగాలకుచెందిన నిపుణులు >>2

## నేడు లోక్‌సభకు పరీక్షల సవరణ బిల్లు

**న్యూఢిల్లీ,జులై 26:** దేశంలో పేపర్ లీకేజీలకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయడానికి కేంద్ర ప్రభుత్వం సరికొత్త వ్యూహంతో సిద్ధమైంది. ప్రభుత్వ ఉద్యోగాలు, ఉన్నత విద్యా ప్రవేశ పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారికి ముచ్చెమటలు పట్టించేలా కఠిన శిక్షలు విధించడానికి రూపొందించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు 2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్ట >>2

# జై యువ

### జై జవాన్, జైకిసాన్‌తోపాటు నినాదంలో ఇక జై యువ

### 21 యేళ్లకే పోటీ చేసేలా బిల్లు తేవాలి

### డీలిమిటేషన్, మహిళా బిల్లుతో దీనిని ప్రవేశపెట్టాలి

### ఆగస్టులో అసెంబ్లీ తీర్మానం చేసి పంపుతాం

### జాతీయ మీడియా ప్రతినిధులతో సిఎం రేవంత్



ఆదివారం హైదరాబాద్‌లో జాతీయ మీడియానుద్దేశించి మాట్లాడుతున్న సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై26:** "జై జవాన్-జై కిసాన్-జై యువ" అనే నూతన నినాదాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. జై జవాన్, జై కిసాన్‌తో పాటు ఇకపై జై యువ, దేశ భవిష్యత్తు నిర్మాణంలో యువతను మరింత భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శాసనసభలు, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితిని 25 యేళ్ల నుంచి 21 యేళ్లకు తగ్గించేలా రాజ్యాంగ సవరణ చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జాతీయ మీడియా ప్రతినిధులతో జరిగిన సమావేశంలో సిఎం పలు కీలక వ్యాఖ్యలు చేశారు. యువశక్తే దేశ భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో నాయకత్వ సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్న యువతకు, అదే స్థాయిలో రాజకీయ వ్యవస్థలోనూ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఇటీవల నిర్వహించిన సిబిఎస్ఇ, నీట్, నెట్ తదితర జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణలో తలెత్తిన సమస్యలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు, వారి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆందోళనల సందర్భంగా నమోదైన కేసులను సమీక్షించడంతో పాటు నష్టపోయిన కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నేటి యువత 21 యేళ్ల వయస్సులోనే ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా సేవలందిస్తోందని, స్థానిక సంస్థల్లో ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వహిస్తోందని, ప్రపంచస్థాయి సంస్థలకు నాయకత్వం వహిస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సాంకేతిక, పరిపాలనా, వ్యాపార రంగాల్లో తమ ప్రతిభను చాటుతున్న యువతకు చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 యేళ్లకు తగ్గించిన విషయాన్ని, పివి నరసింహారావు ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు 73వ, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 21 యేళ్లకు సవరించిన విషయాన్ని సిఎం ప్రస్తావించారు. అదే స్ఫూర్తితో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 25 నుంచి 21 యేళ్లకు, శాసనమండలి, రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయస్సును 30 నుంచి 25 యేళ్లకు తగ్గించాలని ప్రతిపాదించారు. >>2

# తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు

### రైలు పట్టాలు అభివృద్ధి బాటలు

### 20 రెట్లు పెరిగిన రైల్వే బడ్జెట్

### మోడీ పాలనలో రైల్వేలో నూతన శకం

### కొమురవెల్లి రైల్వేస్టేషన్ ప్రారంభంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్



ఆదివారం కొమురవెల్లి రైల్వే స్టేషన్‌లో రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ఎంపిలు, ఎమ్మెల్యే తదితరులు

**కొమురవెల్లి, జులై 26, ప్రభాతవార్త :** మోడీ పాలనలో భారతీయ రైల్వేల్లో నూతన శకం ఆరంభమైందని...ఈబడ్జెట్‌లోనే తెలంగాణ రైల్వేలకు రూ.5,454 కోట్లు కేటాయించినట్లు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌లు అన్నారు. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో రూ.6 కోట్లతో నిర్మించిన శ్రీ కొమురవెల్లి మల్లికార్జునస్వామి పుణ్యక్షేత్రంలో రైల్వే స్టేషన్‌ను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లు ఎంపిలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రఘునందన్ రావు, డా॥లక్ష్మణ్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ,జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ గతంతో పోలిస్తే 20 రెట్లు రైల్వే బడ్జెట్ పెరిగిందన్నారు. గత 12 యేండ్లలో తెలంగాణలో రైల్వేల కోసం రూ.36 వేల 286 >>2



# ఆదిలాబాద్ ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

### డిసెంబరు 31లోగా భూసేకరణ, మౌలిక వసతుల పనులు పూర్తి: మంత్రి కోమటిరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై26:** ఉత్తర తెలంగాణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదిలాబాద్‌లో ప్రతిష్ఠాత్మక జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఏర్పాటుకు రూ.2,278.14 కోట్ల పరిపాలనా అనుమతి మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రాజెక్టు కోసం మొత్తం 2,009.23 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,609.23 ఎకరాలు భారత వైమానిక దళం (ఐఎఎఫ్) అవసరాల కోసం, 400 ఎకరాలు సివిల్ ఏవియేషన్ ఎన్‌క్లేవ్, ఎంఆర్‌ఓ, కార్గో టెర్మినల్, హ్యాంగర్లు, భవిష్యత్ విస్తరణ అవసరాల కోసం కేటాయించనున్నట్లు తెలిపారు. భూసేకరణతో పాటు ఇప్పటికే ఉన్న రహదారుల మళ్లింపు, 765 కెవి హైటెన్షన్ విద్యుత్ లైన్ల తరలింపు, వాగుల మళ్లింపు, మిషన్ భగీరథ తాగునీటి పైప్ లైన్ల మార్పు, విద్యుత్‌స్తంభాల తొలగింపు వంటి అన్ని అనుబంధ పనులకు అవస >>2

# వాయుగుండంగా బలపడిన అల్పపీడనం

### పలు ప్రాంతాలకు వర్ష సూచన

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త** వాయువ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న ఉత్తర ఒడిశా పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై నిన్న ఏర్పడిన అల్పపీడనం కాస్తా ఇవాళ వాయుగుండంగా బలపడింది. ఇది ఆదివారం సుమారు 20.6 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 88.4 డిగ్రీల తూర్పు రేఖాంశం వద్ద కేంద్రీకృతమై ఉంది. ఇది వాయువ్య దిశగా కదులుతూ, రాబోయే 24 గంటల్లో మరింత బలపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది ఈ నెల 27వ తేదీ ఉదయం లేదా మధ్యాహ్నానికి పారాదీప్-సాగర్ ద్వీపాల మధ్య ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాలను దాటే అవకాశం ఉందన్నారు.

దీని ప్రభావంతో గంటకు 55 నుండి 65 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మరోపక్క సముద్ర మట్టం వద్ద ఉన్న ద్రోణి ప్రస్తుతం పశ్చిమ రాజస్థాన, పరిసర ప్రాంతాల్లోని అల్పపీడన కేంద్రం, ఒరై, సిధి, రాంచి, వాయువ్య బంగాళాఖాతం, ఉత్తర ఒడిశా-పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాలపై ఉన్న వాయుగుండం కేంద్రంగా వెళ్లి, అక్కడి నుండి ఆగ్నేయదిశగా ఈశాన్య బంగాళా >>2

# జూరాలకు వరద షురూ

### నారాయణపూర్ డ్యాం పది గేట్లు ఎత్తివేత



నారాయణ్‌పూర్ డ్యాంనుంచి దిగువకు నీరు విడుదలచేస్తున్న దృశ్యం

**మహబూబ్ నగర్ బ్యూరో, జులై 26, ప్రభాతవార్త:** జూరాలకు ఎగువన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఆల్మట్టి నారాయణ పోల్ డ్యామ్‌లు గరిష్ఠ స్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో దిగువకు నీటి విడుదల ప్రారంభం అయింది. నారాయణపూర్ డ్యాం పది గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడంతో జూరాల ఆశలు చిగురుస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి, ప్రజలకు శుభవార్త అందింది. పాలమూరు వరప్రదాయని ప్రియదర్శిని జూరాల డ్యామ్‌కు వరద ప్రారంభం అయింది. ఆదివారం తెల్లవారుజామున 6 గంటలకు 3227 క్యూసెక్కుల వరద ప్రారంభం కాగా, సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం మేరకు 22,600 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు అయింది. జూరాల పూర్తిస్థాయి సామర్థ్యం 9.657 టిఎంసిలకు ప్రస్తుతం జూరాలలో 5.897 టిఎంసిల నీటిమట్టం ఉన్నది. 33 క్యూసెక్కుల అవుట్ ఫ్లో నమోదు అయింది. నిండుకుండల్లా ఆల్మట్టి, నారాయణపూర్, మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా ఆల్మట్టి డ్యామ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యామ్ నీటి మట్టం గరిష్ట స్థాయికి చేరువలో ఉంది. కర్ణాటక >>2

# ట్రైనీ ఐపిఎస్ అధికారి కృష్ణారెడ్డి పరార్!

### లైంగిక వేధింపుల కేసు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై26:** మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్‌కృష్ణారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత మహిళా ట్రైనీ ఐపిఎస్ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు నమోదు అనంతరం ఉదయ్‌కృష్ణారెడ్డి పరారీలో ఉన్నట్లు సమాచారం. గత రెండు రోజులుగా ఆయనకు నోటీసులు అందజేయడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నప్పటికీ, హైదరాబాద్‌లో ఆయన పేర్కొన్న రెండు చిరునామాల్లోనూ ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తుండగా, ఉదయ్‌కృష్ణారెడ్డి ఆచూకీ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# చిప్ డిజైన్, జిసిసిలకు ప్రధాన కేంద్రం హైదరాబాద్

### సెమి కండక్టర్ మిషన్-2లో తెలంగాణకు ప్రాధాన్యమివ్వాలి: మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై26:** భారత్‌ను ప్రపంచ సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇండియా సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎం)-2.0లో తెలంగాణాకు ప్రాధాన్యతనివ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. దేశంలోనే అగ్రగామి సెమీకండక్టర్ చిప్ డిజైన్ కేంద్రంగా, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు (జిసిసిలు) ప్రధాన నిలయంగా హైదరాబాద్ ఎదిగిందని ఆయన వెల్లడించారు. మలి దశ సెమీకండక్టర్ తయారీ పెట్టుబడులకు తెలంగాణాను సహజ ఎంపికగా గుర్తించాలని ఆయన అన్నారు. ఆదివారం బెంగళూరులో ఒక జాతీయ ఛానల్ నిర్వహించిన "రైజింగ్ భారత్ సమ్మిట్ సౌత్ ఎడిషన్" చర్చాగోష్టిలో రాష్ట్రం ఒక ఆకర్షణీయమైన పెట్టుబడుల కేంద్రంగా అభివృద్ధి చెందిన తీరును వివరించారు. దక్షిణ భారత్‌లో ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, సాంకేతికాభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై చర్చించేందుకు రాజకీయ నాయకులు, విధాన రూపకర్తలు, పారిశ్రామిక నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రపంచస్థాయి మౌలిక వసతులు, సమృద్ధిగా లభించే నిపుణులైన మానవ వనరులు, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు, అత్యుత్తమ వ్యాపార సౌలభ్యం కారణంగానే హైదరాబాద్ జిసిసిలకు ప్రాధాన్యగమ్యస్థానంగా మారిందని >>2

# జోరుగా 'సర్'

### ఎన్యూమరేషన్ ఫారం తిరిగి ఇవ్వకుంటే ఓటు పోయినట్లే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై26:** తెలంగాణలో ఓటర్ జాబితా స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్) డిజిటలైజేషన్ ప్రక్రియ జోరుగా జరుగుతోంది. ఇంటింటికి పంపిణీ చేసిన ఎన్యూమరేషన్ పత్రాలను తిరిగి సేకరించేందుకు పలుచోట్ల బీఎల్‌ఓలు అవస్థలు పడుతున్నారు. బూత్‌ల వారీగా ఉన్నఓటర్లు, ఫామ్‌లను లెక్కల్లోకి తీసుకుని అన్నింటిని డిజిటలైజ్ చేయాల్సి ఉండగా, కొన్నిచోట్ల ఓటర్లనుంచి స్పందన కరవైంది. ఆగస్టు 3తో గడువు తేదీ ముగిస్తుండటంతో అధికార యంత్రాంగం పూర్తిగా సర్ ప్రక్రియపైనే దృష్టి పెట్టింది. రాష్ట్రంలో పలుచోట్ల బూత్‌ల వారీగా పార్టీల ప్రతినిధుల సహాకారంతో బీఎల్‌ఓ (బూత్ లెవల్ ఆఫీసర్లు) ఓటర్లకు సంబంధించిన వివరాలను డిజిటలైజ్ చేస్తున్నారు. అందుబాటులో లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన, మృతిచెందిన వారి వివరాలను పొందుపర్చి, తొలగింపు జాబితాలో ఎంటర్ చేయాల్సి ఉంటుంది. అయితే కొంతమంది ఓటర్లు ఫారాలను తిరిగి సమర్పించకపోవడంతో గందరగోళం నెలకొంది. ఇలాంటి వారి కారణంగా నమోదుశాతం పడిపోయే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సర్ ఎన్యూమరేషన్ పత్రం తిరిగివ్వనివారు, ఇప్పటి వరకు తీసుకోని ఓటర్లు ఉన్నట్లయితే ఒక్కో ఇంటికి మూడు సార్లు వెళ్లాలని ఇసి (ఎన్నికల సంఘం) అధికారులకు నిర్దేశించింది.

ఈ మేరకు ఓటర్ల నుంచి ఫారాలు తీసుకోవడం, నింపిన పత్రాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులు ఆదేశిస్తున్నారు. దీనివల్ల బీఎల్‌వోలు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వని వారి ఇంటి వద్దకు వెళ్లి మాట్లాడుతున్నారు. గ్రామాల్లో డప్పుద్వారా చాటింపు చేస్తున్నారు. అందుబాటులో లేని ఇంటి ఓనర్లను ఫోన్‌లో సంప్రదిస్తున్నారు. కొంతమంది సమయం ఉందికదా! అని దాటవేస్తుండగా, మరికొందరి ఫోన్లు పని చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. >>2



ఆదివారం విజయవాడలో కనకదుర్గమ్మను దర్శించిన తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎపి స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డి.స్పీకర్ రఘురామకృష్ణరాజు, మురళీమోహన్ తదితరులు

# ప్రధాన కేంద్రం హైదరాబాద్

>> శ్రీధర్‌బాబు చెప్పారు. వేగంగా విస్తరిస్తున్న జీసీసీ వ్యవస్థ, అత్యున్నత సాంకేతిక పరిశ్రమలు, అధునాతన తయారీ రంగాలకు ఆతిథ్యం ఇవ్వగల సామర్థ్యాన్ని తెలంగాణ ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ప్రపంచంలోని ప్రముఖ సెమీకండక్టర్ డిజైన్ సంస్థలకు హైదరాబాద్ కేంద్రంగా మారిందని, దేశంలోనే అత్యంత బలమైన చిప్ డిజైన్ ఎకోసిస్టం తెలంగాణలో ఏర్పడిందని మంత్రి వివరించారు. సెమీకండక్టర్ డిజైన్, కృత్రిమ మేధ (ఏఐ), సైబర్ భద్రత, అధునాతన ఎలక్ట్రానిక్స్ రంగాల్లో వేలాది మంది అత్యున్నత నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు పనిచేస్తుండటంతో ప్రపంచ స్థాయి సెమీకండక్టర్ తయారీ కేంద్రంగా ఎదగడానికి అవసరమైన బలమైన పునాది రాష్ట్రంలో ఇప్పటికే ఏర్పడిందన్నారు."చిప్ డిజైన్ రంగంలో తెలంగాణ ఇప్పటికే ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమకు దిశానిర్దేశం చేస్తోంది. ఈ బలాన్ని గుర్తించి సెమీకండక్టర్ మిషన్-2.0లో తెలంగాణకు తగిన ప్రాధాన్యం ఇచ్చి చిప్ తయారీ పెట్టుబడులను ఆకర్షించేలా కేంద్రం చర్యలు తీసుకోవాలి" అని శ్రీధర్‌బాబు కోరారు. సాంకేతిక రంగంలో ఇప్పటికే తన సామర్థ్యాన్ని నిరూపించుకున్న రాష్ట్రాలకు సముచిత ప్రోత్సాహం అందిస్తే కేంద్ర ప్రభుత్వ సెమీకండక్టర్ కార్యక్రమం మరింత విజయవంతమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణకు ప్రాధాన్యం కల్పించడం ద్వారా ప్రపంచ సెమీకండక్టర్ తయారీ రంగంలో భారత్ అగ్రస్థానానికి చేరాలన్న లక్ష్యం మరింత వేగంగా నెరవేరుతుందని చెప్పారు. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం కారణంగా హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న జిసిసి కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం సాఫ్ట్‌వేర్, ఏరోస్పేస్, రక్షణ, ఔషధ పరిశ్రమలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు (బిఎఫ్ఎస్ఐ), హాస్పిటాలిటీ, బ్యూటీ టెక్నాలజీ తదితర రంగాలకు చెందిన అనేక బహుళజాతి సంస్థలు తమ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయని చెప్పారు. ఇది తెలంగాణ ఆవిష్కరణల పర్యావరణ వ్యవస్థపై అంతర్జాతీయ సంస్థలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలను జిసిసిలు, కృత్రిమ మేధ ఆధారిత పరిశ్రమలు, అధునాతన తయారీ యూనిట్లకు కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మంత్రి తెలిపారు. ఇందుకోసం కొత్త ప్రోత్సాహకాలు, అత్యుత్తమ మౌలిక వసతులు, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన నైపుణ్య మానవ వనరులను సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. సెమీకండక్టర్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, ఆవిష్కరణల రంగాల్లో తెలంగాణ ఇప్పటికే సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకొని ఇండియా సెమీకండక్టర్ మిషన్-2.0లో రాష్ట్రానికి ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి శ్రీధర్‌బాబు మరోసారి విజ్ఞప్తి చేశారు.

# జోరుగా 'సర్'

>> దీంతో పక్కింటి వారితో మాట్లాడి స్థానికంగా ఉండటం లేదని వివరాలు నమోదు చేసుకుంటున్నట్లుగా సమాచారం. నగరంలో నివసిస్తున్న వారిలో కొంతమందికి గ్రామాల్లోనూ ఓట్లున్నాయి. అక్కడే ఉంచుకోవాలా? ఇక్కడ కొనసాగించాలా? అనే మీమాంసలో ఉన్నారు. గ్రామాల్లో భూములున్నవారు అక్కడి జాబితాల్లోనే పేర్లు ఉంచేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. వీరందరికీ నగరంలో ఎన్యూమరేషన్ ఫారాలు అందించగా తిరిగి అప్పగించాలని కోరుతున్నప్పటికీ పట్టించుకోవట్లేదు. సంబంధిత బీఎల్‌ఓలకు (బూత్ లెవల్ ఆఫీసర్లు) అప్పగించి ఎక్కడ నమోదు చేసుకున్నారో చెబితే ఆ విషయాన్ని 'సర్'లో నమోదు చేస్తామని పేర్కొంటున్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లు ఇచ్చిన ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాలు నింపేందుకు ఏవైనా సమస్యలున్నట్లయితే కేవలం మూడో కాలమ్‌లో పేరు, ప్రస్తుత అడ్రస్‌ను రాసి ఇవ్వాలని అధికారులు కోరుతున్నారు. తర్వాత ఏదైనా ఐడీ కార్డుతో నోటీసుకు బదులివ్వడం ద్వారా ఓటు హక్కును ఇక్కడే ఉంచుకునే అవకాశం ఉంటుందని సూచిస్తున్నారు. వివరాలను నింపలేక ఎన్యూమరేషన్ ఫారాన్ని ఇంట్లోనే ఉంచుకుంటే మాత్రం ఓటు కచ్చితంగా రద్దవుతుందనే విషయాన్ని బిఎల్ఓలు గుర్తుచేస్తున్నారు.

# పనిమనుషుల నియామకంలో నిర్లక్ష్యం తగదు

## నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** ఇళ్లు, ఆఫీసులు, దుకాణాల్లో బంగారం, నగదు, అత్యంత విలువైన వస్తువులను నిర్లక్ష్యంగా బయట పడేసి వెళ్లడాన్ని గమనిస్తున్న కొందరు పనిమనుషులు సమయం చూసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. యజమానులు చూసే ఈ చిన్నపాటి ఆలసత్వమే నేరగాళ్లకు వరంగా మారుతోందని పోలీసులు విశ్లేషిస్తున్నారు. అయితే దొంగతనం జరిగిన తర్వాత దర్యాప్తు చేసి పట్టుకోవడం కంటే, అసలు నేరమే జరగకుండా ఆపడమే అత్యంత ముఖ్యమని భావిస్తున్నారు. ఇందులో భాగంగా స్వయంగా కాలనీలు, అపార్ట్మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆఫీస్లు, దుకాణాలకు వెళ్లి యజమానులను నేరుగా కలిసి అవగాహన కల్పిస్తున్నారు. గత రెండేళ్లలో నగరంలో నమోదైన 565 పనిమనుషుల దొంగతనం కేసులను (65 గ్రేవ్ కేసులు, 500 నాన్ గ్రేవ్ కేసులు) విశ్లేషించిన పోలీసులు... ప్రతి యజమాని తక్షణమే భద్రతా నియమాలు పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జోన్ల వారీగా పరిణామాలు పరిశీలిస్తే ఐటీ సంస్థలు, వ్యాపార వర్గాలు, ఉన్నత నివాస ప్రాంగణాలు, ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ఆఫీసుల్లో, దుకాణాల్లో, ఇళ్లలో యజమానులు బిజీ జీవనశైలి కారణంగా తగిన ముందస్తు తనిఖీలు లేకుండా పనిమనుషులను చేర్చుకుంటున్నట్లు తేలింది. మొత్తం 565 కేసుల్లో.. జూబ్లీహిల్స్ జోన్లో అత్యధికంగా 173 కేసులు నమోదు కాగా, సికింద్రాబాద్ జోన్లో 88, ఖైరతాబాద్ జోన్లో 77, గొల్కొండ జోన్లో 70, రాజేంద్రనగర్ జోన్లో 63,శంషాబాద్ జోన్లో 49, చార్మినార్ జోన్లో 45 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా ఇటీవల ఇతర దేశాలు, రాష్ట్రాల మూలాలున్న ముఠాలు పనిమనుషుల అవతారంలో ఇళ్లలోకి ప్రవేశించి పథకం ప్రకారం దొంగతనాలకు, నేరాలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో తగిన గుర్తింపు, పోలీస్ వెరిఫికేషన్ పత్రాలు లేని అపరిచిత వ్యక్తులను పనిలో చేర్చుకోవద్దని పోలీసు యంత్రాంగం స్పష్టంగా సూచిస్తోంది. నమ్మకంగా పనిలో చేరిన కొత్తలో యజమానుల అలవాట్లు, తాళాలు ఉంచే ప్రదేశాలు, సిసి కెమెరాల కదలికలు, నగదు నగల వివరాలను గమనించి నేరాలకు పాల్పడుతున్నందున, పూర్వాపరాలు తెలియని వారిని ఇళ్లు, ఆఫీసులు, దుకాణాలకు రానివ్వకపోవడమే శ్రేయస్కరమని స్పష్టం చేస్తున్నారు. ఇళ్లు, ఆఫీస్, దుకాణాల్లోని లోపలి సమాచారం సురక్షితంగా ఉన్నంత వరకు నేరాలకు తావుండదనే ప్రాథమిక సూత్రాన్ని ప్రతి నగరవాసి గుర్తించి అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు ప్రజాభద్రతను పటిష్టం చేసే క్రమంలో సిటీ పోలీస్ యంత్రాంగం పలు ముఖ్యమైన సూచనలను ప్రజల ముందుకు తెచ్చింది. ఎవరికైనా ఇంట్లో, ఆఫీసుల్లో, దుకాణాల్లో పనికి కుదుర్చుకునే ముందే వారి ఆధార్ కార్డు లేదా చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు నకలు, తాజా ఫోటో, శాశ్వత చిరు నామా, స్వగ్రామం వివరాలు, ఫోన్‌నంబర్లు సేకరించాలని సూచిస్తోంది. ప్రైవేట్ ఏజెన్సీలు లేదా మధ్యవర్తుల ద్వారా నియామకాలు చేసుకునేటప్పుడు, సదరు ఏజెన్సీకి ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో సరిచూసుకోవాలని, గతంలో వారు ఎక్కడ పనిచేశారో ఆ యజమానులను సంప్రదించి వివరాలు ధ్రువీకరించుకోవాలని పేర్కొంటోంది.నియామకానికి ముందే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉచితంగా లభించే 'పోలీస్ వెరిఫికేషన్' చేయించుకోవడం భద్రతా పరంగా శ్రేయస్కరమని, పనిచేసే వ్యక్తులు తమ వెంట గుర్తింపు కార్డు లేదా వెరిఫికేషన్ పత్రాన్ని ఉంచుకునేలా యజమానులే చొరవ తీసుకోవాలని కోరుతోంది.

# శ్రీరాంసాగర్ జలాశయంలో ఈతకు దిగి ముగ్గురి మృతి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై26:** నిజామాబాద్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. శ్రీరాంసాగర్ జలాశయం(ఎస్ఆర్ఎస్‌పి)లో ఈతకు దిగి ముగ్గురు మృతి చెందారు. ముప్కాల్ వద్ద ఎస్ఆర్ఎస్‌పి బ్యాక్ వాటర్‌లో ఈతకు దిగిన నలుగురిలో ముగ్గురు చనిపోగా,ఒకరు గల్లంతయ్యారు. మృతులను షేక్ అలీలం(24),నజావత్(24),ఫర్హాన్(17)గా గుర్తించారు. గల్లంతైన అజీం కోసం గాలింపు కొనసాగుతోంది. మృతుల్లో షేక్ ఖలీం,నజావత్ నిజామాబాద్‌లోని ఆటోనగర్‌కు చెందినవారు, ఫర్హాన్‌ను మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన బాలుడిగా గుర్తించారు. ఘటనా స్థలాన్ని సిపి సాయి చైతన్య, ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్ సిఐ జాన్‌రెడ్డి పరిశీలించారు.

# జై యువ

>> ఆగస్టు నెల ఎంతో ప్రాముఖ్యమైందని, దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది ఈనెలలోనే అని, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ట వయో పరిమితిని 25 యేళ్ల నుంచి 21 యేళ్లకు తగ్గించే అంశంపై సమగ్ర చర్చ నిర్వహించేందుకు ఆగస్టు నెలలో తెలంగాణ శాసనసభ, శాసనమండలి సంయుక్త సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పక్షాల అభిప్రాయాలు స్వీకరించిన అనంతరం పోటీ వయోపరిమితి తగ్గింపును కోరుతూ అధికారిక తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఇదే సమయంలో శాసనమండలి,రాజ్యసభకు యువత పోటీ చేసేందుకు వయోపరిమితిని 30 నుంచి 25 యేళ్లకు తగ్గించాలని కేంద్రాన్ని కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), పార్లమెంట్ సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వంటి అంశాలను చర్చించేందుకు సన్నద్ధమైనందున వీటితో పాటు ఎన్నికల్లో పోటీ చేసే కనిష్ఠ వయోపరిమితి తగ్గింపు అంశాన్ని కూడా కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో యువత పాత్రను మరింత విస్తరించడం దేశ భవిష్యత్తుకు అవసరమని తెలిపారు. 21 యేళ్లకే ఐఎఎస్, ఐపిఎస్ అధికారులుగా, జిల్లా పంచాయతీ చైర్‌పర్సన్‌లుగా నియమిస్తున్నాం. అలాంటప్పుడు అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి ఎందుకు అనుమతించకూడదు? దేశ జనాభాలో దాదాపు 30 శాతం ఉన్న జెన్‌జీ తరం గొంతుక చట్టసభల్లో వినిపించాలి. వారికి ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, మంత్రులుగా పనిచేసే అవకాశాలు రావాలి అని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రతిపక్షాలు చెప్పింది వినడం అలవాటు చేసుకోవాలి: పిఎంకు సిఎం రేవంత్ సూచన**

దేశంలో ప్రధాని నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా పోరాటం మొదలైందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశం మారుతోంది.. ప్రతిపక్షాలు చెప్పింది వినడం కూడా అలవాటు చేసుకోవాలని ప్రధాని మోడీకి ఆయన హితవు పలికారు. ఢిల్లీలో యువత నిరసన ముందు నరేంద్ర మోడీ, భారత ప్రభుత్వం ఓడిపోయిందని చెప్పారు. ప్రధాని మోడీకి ఈ ఓటమి మొదటిది కాదని.. రెండోదని గుర్తు చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్‌కు తాకట్టుపెట్టే నల్ల చట్టాలు తెచ్చే ప్రయత్నం మోడీ చేశారని విమర్శించారు.ఈ చట్టాలు వాపస్ తీసుకుని రైతులకు క్షమాపణ చెప్పాలని గతంలో రాహుల్ గాంధీ డిమాండ్ చేశారని అన్నారు. రైతుల పోరాటంతో ఆ నల్ల చట్టాలను వెనక్కి తీసుకుని రైతులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పారని గుర్తు చేశారు. ఇలా ప్రధాని మోడీని రైతులు మొదటిసారి ఓడించారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ కొంచెమైనా గుణపాఠం నేర్చుకుని ఉంటారని తామంతా భావించామని అన్నారు. తద్వారా పార్లమెంట్‌లో చర్చకు ప్రతిపక్షాలకు అవకాశం ఇస్తారని అనుకున్నామన్నారు. సిబిఎస్ఇ, నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్రం విఫలమైందని తెలంగాణ సిఎం విమర్శించారు. ఈ అంశంలో విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని.. పేపర్ లీక్ దోషులను జైలుకు పంపాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కోరితే వినలేదని తెలిపారు. దీనిపై ప్రశ్నిస్తే సిబిఐ, ఇడి చేత బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ దేశ యువత తమ సత్తా చూపించారని హర్షం వ్యక్తం చేశారు. దీంతో ప్రధాని మోడీని వారు ఓడించారని వివరించారు.

యువ శక్తి దెబ్బకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారని పేర్కొన్నారు. దీంతో ఆయన రాజీనామా డిమాండ్ నెరవేరిందని తెలిపారు. కానీ మూడు డిమాండ్లు ఇంకా మిగిలే ఉన్నాయని గుర్తు చేశారు. యువత లేకుండా మీరు చెప్పే సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ సాధ్యం కాదని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో యువకుల ప్రాధాన్యం ఎందుకు లేదని ఈ సందర్భంగా ప్రధాని మోదీని ఆయన ప్రశ్నించారు. యువకులు సడక్ వదిలి, సంసద్ (పార్లమెంట్)కు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. యువకులు 21 యేళ్లకే చట్టసభలకు వచ్చేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని ఆయనకు సీఎం రేవంత్ సూచించారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత వయస్సు 21 ఏళ్లకు తగ్గించాలని ప్రధాని మోడీకి సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# పరీక్షా సంస్కరణలు ఆరంభం

>> ఇందులో సభ్యులుగా ఉన్నారు. టాస్క్‌ఫోర్స్‌లో మాజీ ఇస్రో చైర్మన్ ఎస్. సోమనాథ్, మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, మాజీ విద్యాశాఖ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్ నిపుణుడు అమృత్ లాల్ మీనా సభ్యులుగా ఉన్నారు. నందన్ నీలేకని ఈ గవర్నెన్స్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకుడిగా పట్టణ పాలనలో సాంకేతికత వినియోగాన్ని విస్తరించడంలో కీలక పాత్ర పోషించారు.

పట్టణ స్థానిక సంస్థలకు మెరుగైన సేవలు అందించే డిజిటల్ వేదికలను అభివృద్ధి చేయడంలో ఆయన విశేష కృషి చేశారు. భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ యుఐడిఎఐతొలి చైర్మన్‌గా ఆధార్ వ్యవస్థ రూపకల్పనలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. మరోవైపు, ఆయన సహ వ్యవస్థాపకుడిగా ఉన్న ఎక్‌స్టెప్ ఫౌండేషన్ ద్వారా దేశవ్యాప్తంగా కోట్లాది మంది చిన్నారుల్లో ప్రాథమిక అక్షరాస్యత, గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు డిజిటల్ వేదికలను అభివృద్ధి చేస్తున్నారు.ఐఐటీ బాంబే నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసిన నందన్ నీలేకని, దేశానికి చేసిన సేవలకు గాను పద్మభూషణ్‌పాటు అంతర్జాతీయ స్థాయిలో జోసెఫ్ షుంపీటర్ ప్రైజ్ సహా పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్నారు.

# అమర జవానుల త్యాగాలను స్మరించుకున్న సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై 26:** భారత సాయుధ దళాల ధైర్య, పరాక్రమాలకు ప్రతీకగా జరుపుకునే కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అమర జవానుల త్యాగాలను స్మరించుకున్నారు. వీర సైనికుల త్యాగం, వారు ప్రదర్శించిన శౌర్యం దేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఘనంగా నివాళులర్పించారు.

## జూరాలకు వరద షురూ

>> రాష్ట్రంలోని ఆల్మట్టి నారాయణపూర్ డ్యాములు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి సామర్థం 123.081 టిఎంసిలు కాగా ప్రస్తుతం 91.837 టిఎంసిల నీరు నిల్వ ఉన్నది. ఆల్మట్టి జలాశయానికి 75305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 35000 అవుట్ ఫ్లో నమోదు అయింది. నారాయణపూర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 492.25మీటర్లు, 33.313 టిఎంసిలు కాక, ప్రస్తుతం 17.98 టిఎంసిల నీరు నిల్వ ఉన్నది. నారాయణపూర్ జలాశయానికి 35వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు కాగా, 10 గేట్లు ఎత్తి 35 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు.

# బలపడిన అల్పపీడనం

>> ఖాతం వైపు విస్తరించిందని తెలిపింది. ఈ ద్రోణి సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకూ కొనసాగుతోందని వివరించింది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో ఆరు రోజుల పాటు ఈ నెల 27 నుండి ఆగస్టు 1వ తేదీ వరకూ తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. కాగా రాష్ట్రంలో ఆదివారం చిరుజల్లులతో పాటు, చెదురుమదురు వర్షాలు పడ్డాయి. గడచిన 24 గంటల్లో సగటున 2.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలోని సిరిసిల్లా జిల్లాలో 11.4 మిల్లీమీటర్లు, కామారెడ్డిలో 8.6 మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో 7.8 మిల్లీమీటర్లు, మెదక్‌లో 5.9 మిల్లీమీటర్లు, పెద్దపల్లిలో 4.3 మిల్లీమీటర్లు, నిజామాబాద్ జిల్లాలో 6.3 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.

## వారం - వర్జ్యం

27-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
త్రయోదశి సా.4.14, మూల ఉ.10.27
వర్జ్యం: ఉ.8.40-ఉ.10.27,2)రా.9.08-రా.10.55
దు.మ.12.39-మ.1.31, 2) మ.3.14-సా.4.06
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలు విజయవంతంగా పూర్తిచేస్తారు. ఎదుటి వారికి మీ సహాయాన్ని అందిస్తారు.

**వృషభం:** వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించడం చెప్పదగినది. కోపతాపాలకు దూరంగా వుండండి.

**మిథునం:** సంతానరీత్యా సంతృప్తిని పొందుతారు. జీవితభాగస్వామి నుండి ఆస్తిలాభం పొందుతారు.సోదరులకలయిక.

**కర్కాటకం:** పలుకుబడి కలిగిన వ్యక్తుల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. మీ మాటకు విలువ పెరుగుతుంది.

**సింహం:** ఉద్యోగులు అదనపు బాధ్యతలు మోయాల్సి ఉంటుంది. ఆకస్మిక ప్రయాణాలు లాభిస్తాయి.

**కన్య :** స్త్రీలతో వివాదాలు ఏర్పడకుండా జాగ్రత్తలు పాటించండి. ఆరోగ్యం, వాహనాల విషయంలో జాగ్రత్త అవసరం.

**తుల:** పెద్దల సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారంచుడతారు. శుభవార్తలు అందుకుంటారు.

**వృశ్చికం:** భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుతాయి.

**ధనుస్సు:** ప్రతి చిన్న విషయాన్ని స్వయంగా పరిశీలించి నిర్ధారణ చేసుకోవడం చెప్పదగినది. ఇంటర్వ్యూలలో పాల్గొంటారు.

**మకరం:** అప్పు చేయడం, అప్పు ఇవ్వడం రెండూ చేయకండి. సేవా కార్యక్రమాలు నిర్విఘ్నంగా పూర్తిచేస్తారు.

**కుంభం:** అవకాశాలు అంచులవరకూ వచ్చి చేజారిపోకుండా జాగ్రత్తలు పాటించండి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**మీనం:** దైవ సంబంధిత కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఓర్పు, నేర్పు, నైపుణ్యం అవసరమవుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆదివారం వారణాసిలోని విశ్వనాథ్ ధామ్ వద్ద నివాళులర్పిస్తున్న ప్రజలు

# పరీక్షల సవరణ బిల్లు

>> నుంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు సైతం పూర్తయ్యాయి. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఈ సవరణ బిల్లును లోక్‌సభ ముందుకు తీసుకురానున్నారు. ఈ మేరకు ఈ బిల్లు ముసాయిదాను ఎంపీలకు కూడా పంపిణీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేసిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామాలు చోటు చేసుకున్నాయి. 2024 నాటి చట్టాన్ని మరింత బలోపేతం చేస్తూ ఈ నూతన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా ఇటీవల వెలుగుచూసిన వివిధ పోటీ పరీక్షల పేపర్ లీకేజీ ఉదంతాల నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ సారథ్యంలో లక్షలాదిమంది విద్యార్థులు ఢిల్లీ జంతర్ మంతర్ లో నిరసనలు చేపట్టడం, వారి డిమాండ్లకు అనుగుణంగా ఈ సవరణలు అవసరమని ప్రభుత్వం భావించింది. ఈ చర్యలను వేగవంతం చేసింది. ఈ సవరణ బిల్లు ప్రకారం పరీక్షల్లో అక్రమాలకు లేదా మాల్ ప్రాక్టీస్ లకు పాల్పడే వ్యక్తులకు విధించే జైలు శిక్షను అయిదు నుంచి పదేళ్లకు పెంచాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న చట్టం ప్రకారం ఈ శిక్ష మూడేళ్ల నుంచి అయిదేళ్లుగా మాత్రమే. దీంతో పాటు వ్యక్తిగతంగా విధించే గరిష్ఠ జరిమానా పరిమితిని కూడా రూ. 10 లక్షల నుండి ఏకంగా రూ. 50 లక్షల వరకు పెంచడం ద్వారా పరీక్షల మాఫియాపై ఉక్కుపాదం మోపనున్నారు. పరీక్షలను నిర్వహించే సర్వీస్ ప్రొవైడర్ల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా కూడా కఠిన చర్యలు ప్రతిపాదించింది కేంద్రం. పరీక్షలను సక్రమంగా నిర్వహణలో విఫలమైతే విధించే గరిష్ఠ జరిమానాను రూ. కోటి నుంచి అయిదు కోట్ల రూపాయలకు పెంచింది. పరీక్షల నిర్వహణ నుండి సంబంధిత ప్రైవేటు ఏజెన్సీలు లేదా అనుబంధ సంస్థలను నిషేధించే బ్లాక్‌లిస్ట్ కాలాన్ని నాలుగు నుండి ఎనిమిది సంవత్సరాలకు రెట్టింపు చేసింది. ఈ సంస్థలకు చెందిన డైరెక్టర్ల స్థాయి వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా తప్పులకు పాల్పడితే వారికి కనీస జైలు శిక్షను మూడేళ్ల నుంచి అయిదేళ్లకు పెంచారు. వీరికి విధించే వ్యక్తిగత జరిమానాను కూడా రూ. కోటి నుండి అయిదు కోట్ల రూపాయల వరకు పెంచుతున్నారు. ముఖ్యంగా వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ముఠాలకు కనీస శిక్షను ఏడేళ్లకు పెంచడం, జరిమానాను రూ. 10 కోట్లుగాకొనసాగించాలని ప్రతిపాదించారు.

# ఎయిర్‌ఫీల్డ్‌కు గ్రీన్ సిగ్నల్

>> రమైన నిధులను కూడా ఈ పరిపాలనా అనుమతిలో భాగంగా కేటాయించినట్లు మంత్రి వివరించారు. ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ రాష్ట్రానికి వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన ప్రాజెక్టు అని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. భారత వైమానిక దళం, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా అభివృద్ధి చేయనున్న ఈ ఎయిర్‌ఫీల్డ్ వల్ల ఉత్తర తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులు, కార్గో రవాణా, పర్యాటకం, రక్షణ రంగాలకు విశేష ఊతం లభించడంతో పాటు వేలాది మంది యువతకు ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో నిరంతర సమన్వయం ఫలితంగానే ఈ ప్రాజెక్టు వేగంగా ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ వ్యయంతో పాటు అన్ని అడ్డంకుల తొలగింపు ఖర్చును కూడా భరిస్తోందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూసేకరణతో పాటు రహదారులు, విద్యుత్ లైన్లు, ఇతర మౌలిక వసతుల మార్పిడి పనులను 2026 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. ప్రాంతీయ సమతుల అభివృద్ధే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని, ఆదిలాబాద్ జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ ఉత్తర తెలంగాణ అభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా నిలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో భిన్న వర్షపాతం

## 31 జిల్లాల్లో లోటు నమోదు

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త :** నైరుతి రుతుపవనాల కాలంలో తెలంగాణలో వివిధ ప్రాంతాల్లో వైరుధ్యాలు చోటుచేసుకున్నాయి. రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో వర్షపాతం లోటు కొనసాగుతుండగా, మిగిలిన సీజన్‌లో పొరుగు జిల్లాల్లో చాలా భిన్నమైన వర్షపాతం నమోదవుతుందని వాతావరణ అంచనాలు సూచిస్తున్నాయి. తెలంగాణలో జూన్ నెలలో వర్షపాత లోటు కేవలం తొమ్మిది శాతంగా ఉండగా, ఈ నెల మూడో వారం చివరి నాటికి ఆ లోటు 47 శాతానికి పెరిగింది. దక్షిణ తెలంగాణలోని అనేక మండలాల్లో జూలై నెలలో 50 మిల్లీమీటర్ల కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.

అంతేకాకుండా, రెండు వారాలకు పైగా ఒక్క రోజు కూడా 10 మిల్లీమీటర్ల వర్షం కురవకపోవడంతో, లోతు తక్కువగా ఉన్న నేలల్లో పండించే పంటలపై ప్రభావం పడింది. వాతావరణ అసెస్‌మెంట్ మూడు ప్రాధాన్యతా పర్యవేక్షణ బెల్ట్‌లను గుర్తిం చింది. రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్‌లను కవర్ చేసే నైరుతి పొడి ప్రాంతంగాను, సంగారెడ్డి,మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ లతో కూడిన పశ్చిమ, వాయువ్య బెల్ట్‌లోను, సిద్దిపేట, జనగాం, సిరిసిల్ల, కరీంనగర్‌లతో సహా సెంట్రల్ బెల్ట్‌గా విభజించడంతో పాటు, ఇక్కడ ఎల్ నినో కాలంలో కరువు పరిస్థితులు వ్యవసాయ పంటలను దెబ్బతీసే అవకాశం ఉన్నటున అంచనా వేస్తున్నారు.

భారత వాతావరణ శాఖ వాతావరణ పర్యవేక్షణ, అంచనా బృందం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఓపీ శ్రీజిత్ డేటా ప్రకారం, 1951 నుండి 2023 మధ్య తెలంగాణ 17 ఎల్ నినో సంవత్సరాలను చవిచూసినప్పటికీ, ప్రతిసారీ రుతుపవన వర్షపాతం చాలా భిన్నంగా నమోదైందనేది వెల్లడైంది. రాష్ట్రంలో 1972లో 39.3 శాతం, 2004లో 35.7 శాతం, మరియు 2002లో 28.3 శాతం లోటు నమోదైంది. అయితే, కొన్ని ఎల్ నినో సంవత్సరాలలో రాష్ట్రంలో అధిక వర్షపాతం కూడా నమోదైంది. 1953లో 24.3 శాతం, 1976లో 14 శాతం మరియు 2023లో 15.3 శాతం అదనపు వర్షపాతం నమోదైంది. కాలానుగుణ మొత్తం వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ, ఆ సీజన్‌లో వర్షపాతం క్రమంగా అసమానంగా మారింది, ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో నెలవారీగా తీవ్రమైన హెచ్చుతగ్గులు కనిపించాయి. ఈ యేడాది కూడా అదే ధోరణి కనిపిస్తోంది.

ఈ నెలలోని మూడు వారాల నాటికి ఐఎండీ గణాంకాల ప్రకారం, తెలంగాణలోని 33 జిల్లాల్లో 31 జిల్లాల్లో వర్షపాతం లోటు నమోదైంది. ములుగు జిల్లాలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదు కాగా, కామారెడ్డి జిల్లా తొమ్మిది శాతం లోటుతో సాధారణ పరిధిలోనే ఉంది.

# తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు

>> కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు.అలాగే రూ.47 వేల 984 కోట్లతో రైల్వే అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. హైస్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం కోసం 1 లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేయబోతున్నామన్నారు. తెలంగాణలో మరో 30 కొత్త రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఫైనల్ లొకేషన్ సర్వే జరుగుతుందన్నారు. కాజీపేట యూనిట్‌లో భవిష్యత్తులో నూతన తరం ఇంటర్‌సిటీ రైళ్ల తయారీకి రంగం సిద్ధమైందన్నారు.రాబోయే 50 యేండ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకొని దేశ వ్యాప్తంగా రైల్వే స్టేషన్ల ఆధునీకరణ జరుగుతుందన్నారు. తెలంగాణలో రూ.2 వేల కోట్ల వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు రాబోతున్నాయన్నారు. ఏదేశమైనా..ఏ రాష్ట్రమైనా బాగుపడాలంటే రవాణా సౌకర్యాలు బాగుంటేనే సాధ్యమవుతుందని అందుకే ప్రధాని మోడీ రోడ్డు, రైల్వే, ఎయిర్ కనెక్టివిటీలకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు.హైదరాబాద్‌లోని ఎంఎంటిఎస్‌ను యాదాద్రి వరకు విస్తరించడం జరుగుతుందని అందుకోసం 1122 కోట్లు ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూ.715 కోట్లు నాంపల్లి రైల్వేస్టేషన్ రూ.322 కోట్ల ఆధునీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రూ.512 కోట్లతో కాజీపేటలో నిర్మిస్తున్న రైల్వే మాన్యుఫాక్చరింగ్ యూనిట్ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. రైల్వే ట్రాక్‌లు కేవలం రెండు పట్టాలు కావు అభివృద్ధికి బాటలు అన్నారు. కేంద్రంపై విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలన్నారు. లక్షలాది మంది కొమురవెల్లి మల్లన్న స్వామి భక్తుల ఎన్నో యేండ్ల నిరీక్షణకు ఫలితం లభించిందన్నారు. మల్లన్న స్వామి ప్రతి భక్తుడి ప్రయాణం మరింత సులభం,సౌకర్యవంతంగా కాబోతుందన్నారు. రైల్వే స్టేషన్‌తో కొమురవెల్లి ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.కార్యక్రమంలో రైల్వే ఆపరేషన్ సంజుకుమార్, సర్పంచ్ గొల్లపల్లి పద్మఅంజనేయులు, బిజెపి జిల్లా అధ్యక్షులు బైరి శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్చలు మాత్రమే సరైన మార్గం

## సామాజిక కార్యకర్త అన్నాహజారే



**రాహెల్‌గాంవ్ సిద్ధికి, జులై 26:** కేంద్ర విద్యాశాఖ మాజీమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై సామాజిక కార్యకర్త అన్నాహజారే స్పందించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో సమస్యలను పరిష్కరించడానికి చర్చలు మాత్రమే సరైన మార్గమని పేర్కొన్నారు. ఉద్రిక్తతలు సృష్టించడంతో, నియంతృత్వ ధోరణితో ఏమీ సాధించలేమని అన్నారు. ఇప్పటివరకు తాను 22 సార్లు నిరాహార దీక్ష చేశానని, ఎన్నడూ హింసను ఆశ్రయించలేదని అన్నారు. శాంతియుత ఆందోళనలే శాసనపరమైన మార్పులు తీసుకురావడానికి దోహదపడ్డాయన్నారు. తాను చేపట్టిన శాంతియుత నిరసనల కారణంగా 10 చట్టాలు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వాలు పౌరుల మాట వినాలని, ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని హజారే సూచించారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రెండు అడుగులు ముందుకు వేయాల్సి వచ్చినా అందులో ఏ తప్పూ ఉండబోదని పేర్కొన్నారు. మన నిర్ణయాలు ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉండటమే ముఖ్యమన్నారు. మంత్రుల రాజీనామా వంటి డిమాండ్లను సైతం శాంతియుత పద్ధతిలో సాధించు కోవాలని తెలిపారు. హింసాత్మక నిరసనల కంటే శాంతియుత నిరసనలు, చర్చలే ప్రజల్లో పాలనలో మార్పు తీసుకువస్తాయన్నారు. ఎంతటి పరిస్థితులు ఎదురైనా హింసను మాత్రం ఆశ్రయించొద్దని ప్రజలకు, ప్రభుత్వానికి సూచించారు.

## ఓపెన్ స్కూళ్లలో అడ్మిషన్లకు గడువు ఆగస్టు 15కు పొడిగింపు

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో 2026-27 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాల గడువును పొడిగించారు. ప్రవేశాల షెడ్యూల్‌ను ఈ నెల 29 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించినట్టు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశం కోసం నిర్దేశిత రుసుముతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించే గడువును ఈ నెల 29 నుంచి ఆగస్టు 15 వరకు పొడిగించారు.

# నేటి నుంచి రైతు వేదికల్లో విత్తన మేళా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 26:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల సోమవారం నుంచి 29 వరకు తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల ప్రతి మండల కేంద్రంలోని రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నారని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి ప్రకటించారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని తక్కువ నీటితో సాగుకు అనువైన ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రతి రైతు వేదికలో 4 నుంచి 5 ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచనున్నారని పేర్కొన్నారు. ఈ విత్తన మేళాలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌సీడ్స్ రీసెర్చ్, కృషి విజ్ఞాన కేంద్రాల శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు పంటల ఎంపిక, సాగు విధానాలు, వాతావరణ పరిస్థితులకు అనుగుణమైన వ్యవసాయ పద్ధతులపై శాస్త్రీయ సలహాలు, సూచనలు అందిస్తారు. ఆయా విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు సిఫారసు చేసిన నాణ్యమైన విత్తనాలు కూడా ప్రత్యేక కౌంటర్లలో అందుబాటులో ఉంటాయి. అదేవిధంగా వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులు, జిల్లా వ్యవసాయ అధికారులు, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు పంటల ఎంపిక, విత్తనాల ఎంపిక, సాగు విధానాలు, నీటి యాజమాన్యంపై అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తారు. రాష్ట్రంలోని రైతులందరూ తమ సమీప రైతు వేదికలో నిర్వహించే విత్తన మేళాలో అధిక సంఖ్యలో పాల్గొని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు తమ ప్రాంతానికి అనువైన పంటలను ఎంపిక చేసుకొని, నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ తెలిపారు.

# సమాజ నిర్మాణంలో కుటుంబానిది కీలక పాత్ర

## పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరించవద్దు

## ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 26, ప్రభాతవార్త:** సమాజ నిర్మాణంలో కుటుంబం కీలక పాత్ర పోషిస్తుందని, ఇంట్లో తండ్రి, తల్లి ఇద్దరూ కలిసి బాధ్యతలను పంచుకోవడం ద్వారానే ఉత్తమమైన తరాన్ని తయారు చేయగలమని ఆర్ఎస్ఎస్ సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన యుగానుకూల మాతృత్వం సదస్సులో పాల్గొన్న ఆయన శతాబ్దాలుగా సమాజంలో వస్తున్న మార్పులు, పాశ్చాత్య భావజాల ప్రభావం, భారతీయ కుటుంబ మాతృశక్తి సంప్రదాయం, ఆత్మ విస్మృతి తదితరల అంశాలపై కీలక ఉపన్యాసం చేశారు. ఆధునిక కాలంలో మాతృత్వానికి ఉండాల్సిన బాధ్యతలను వివరించారు. మాతృత్వం అనేది ప్రకృతి సిద్ధమైనదని, శాశ్వతమైనదని, ఇది సృష్టి ప్రారంభం నుండి కొనసాగుతోందని అన్నారు. కాలంతో పాటు మాతృత్వం తనను తాను మార్చుకోవాలని, కానీ పాశ్చాత్య సంస్కృతిని గుడ్డిగా అనుకరించడం వల్ల కుటుంబ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతుందని హెచ్చరించారు. పిల్లలతో నిరంతరం సంభాషించాలని, వారి సందేహాలను తీరుస్తూ, కుటుంబ విలువలను వారికి వివరించాలని తల్లిదండ్రులకు సూచించారు. భారతీయ సంస్కృతిలో మహిళను శక్తి స్వరూపిణిగా, జగజ్జననిగా గౌరవిస్తారని, ఈ శక్తిని సద్వినియోగం చేసుకుని సమాజాన్ని ముందుకు నడిపించాలన్నారు. పాశ్చాత్య దేశాల్లో నెలకొన్న తప్పుడు ఆలోచనలు, సంపూర్ణత లేని దృక్పథం కారణంగా అనేక సామాజిక సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మోహన్ భగవత్

మనం వారి ఆలోచనలను గుడ్డిగా స్వీకరించడం వల్ల సరైన సమాధానాలు మనకు దొరకవని అన్నారు. మన సంస్కృతిలో అలాంటి వాతా వరణమే లేదని స్పష్టం చేశారు. స్త్రీ, పురుషుల మధ్య ఆధిపత్యం అనే అంశంపై మాట్లాడుతూ మీమే అన్ని చేయగలము అనే భ్రమనుంచి ఇరువురు బయట పడాల్సిన అవసరముందన్నారు. ఇద్దరు కలిసి సాగడం ఎంతో ఆవశ్యకమన్నారు. పాశ్చత్య దేశాల్లో స్త్రీ విముక్తి ఉద్యమం గురించి ఆయన మాట్లాడారు. రాబోయే తరాలు కుటుంబవ్యవస్థను, మాతృత్వాన్ని గౌరవించాలని సూచించారు. మన ప్రతిఒక్కరూ కాస్త లోపలికి తొంగి చూసి ఆలోచిస్తే ఎవరి ప్రబోధం లేకుండానే మన సనాతన ధర్మ సత్యం బోధపడుతుందని, నేటి సమస్య లన్నింటికీ ఆధ్యాత్మిక, కుటుంబ సంప్రదాయాలలోనే సరైన సమాధానాలు దొరుకుతాయని మోహన్ భగవత్ ప్రసంగాన్ని ముగించారు.

# యుపిలో ఎస్పీతో పొత్తుకు సిద్ధం

## బిజెపిని ఓడించేందుకు ఇదే సరైన సమయం: అసదుద్దీన్ ఒవైసి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 26:** దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరిం చేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు. మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఒవైసీ మాట్లాడుతూ.. 'ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవవద్దు' అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయ డం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరిం చారు. అయితే, ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఒవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. 'మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తాను' అని ఆయన పేర్కొన్నారు. ఒవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది.

ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. 'అఖిలేశ్, ఒవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు పెద్ద భాయిజాన్ ఎవరు అనే పోటీని పక్కనపెట్టి భాయిజాన్ కలయిక కోసం చూస్తున్నారు. అందుకే ఒవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారు' అని ఆయన ఎద్దేవా చేశారు.

# బిసి చేతివృత్తుల కళాకారులకు ఎంతో ఆదరణ

## ఎగ్జిబిషన్‌లో 60 స్టాళ్లతో 11 రోజులపాటు నిర్వహణ

## వారాంతాల్లో 4,000 నుంచి 5,000 మంది వరకు సందర్శకులు

## ఎంబిసి కార్పొరేషన్ సిఇఒ అలోక్‌కుమార్

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆషాఢ బోనాలు చేతి వృత్తుల మేళా విజయవంతమైందని బీసీ సంక్షేమ శాఖ ఎంబీసీ కార్పొరేషన్ సిఈవో, మేళా ఆర్గనైజర్ అలోక్ కుమార్ తెలిపారు. ఎగ్జిబిషన్‌ను 60 స్టాళ్లతో 11 రోజుల పాటు నిర్వహించామన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు, ప్రిన్సిపల్ సెక్రటరీ బాలామాయదేవి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ ఎగ్జిబిషన్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని మేళ ముగింపు సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో చెప్పారు. గత ఏడాది 30 స్టాళ్లతో ఐదు రోజుల పాటు నిర్వహించిన ఎగ్జిబిషన్‌ను.. ఈసారి 60 స్టాళ్లతో 11 రోజుల పాటు నిర్వహించగా పాల్గొన్న చేతివృత్తుల కళాకారులకు ఎంతో ఆదరణ లభించిందన్నారు. ఎగ్జిబిషన్‌కు సాధారణ రోజుల్లో 1,500 నుంచి 2,000 మంది రాగా, వారాంతాల్లో 4,000 నుంచి 5,000 మంది వరకు సందర్శకులు ఎగ్జిబిషన్‌ను సందర్శించినట్లు తెలిపారు. కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి తదితర బీసీ చేతివృత్తుల ఉత్పత్తులకు విస్తృత ప్రచారం, మార్కెటింగ్ అవకాశం కల్పించామని తెలిపారు. ప్రతి రోజూ సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలకు సహకరించిన సాంస్కృతిక శాఖ అధికారులు, కళాకారులు, అలాగే ఎగ్జిబిషన్ విజయవంతానికి కృషి చేసిన రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల అధికారులు, బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది ఎగ్జిబిషన్‌ను మరింత ఘనంగా నిర్వహిస్తామని వెల్లడించారు.


## పిజి ఇసెట్ మొదటి విడతలో 4,221 మందికి సీట్ల కేటాయింపు

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో ఎంఈ, ఎంటెక్ కోర్సుల్లో 2026-27 విద్యాసంవత్సరంలో అడ్మిషన్ల కోసం నిర్వహించిన పీజీ ఈ సెట్-2026లో భాగంగా మొదటి విడత సీట్ల కేటాయింపులో 4,221 మందికి సీట్లను కేటాయించారు. సీటు పొందిన విద్యార్థులు నేటి(సోమవారం) నుంచి ఈ నెల 30 వరకు ఆయా కాలేజీల్లో చేరాల్సి ఉంటుందని అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఐ పాండురంగారెడ్డి తెలిపారు. పీజీ ఈ సెట్-2026 మొదటి విడతసీట్ల కేటాయింపును ఆదివారం చేశారు. రాష్ట్రంలో 5338 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పీజీ ఇంజనీరింగ్‌లో సీట్ల కోసం 7750 మంది వెబ్‌ఆప్షన్లు ఇచ్చినట్టు తెలిపారు.

# ఇది ఆరంభం మాత్రమే..

## సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ, జులై 26:** ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజాస్వామ్యానికి విజయమని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అన్నారు. ఈ ఆందోళనలో అండగా ఉన్న యువత, విద్యార్థులను ఉద్దేశిస్తూ ఒక వీడియో రిలీజ్ చేశారు. ఇంతకాలం అండగా ఉన్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ పోరాటం ఇక్కడితో ఆగిపోదని కూడా ఆయన చెప్పారు. మంత్రి రాజీనామా కేవలం ఆరంభం మాత్రమే అని కామెంట్ చేశారు. యువత, సీజేపీ మద్దతుదార్ల వల్లే ఇదంతా సాధ్యమైందని అన్నారు. బొద్దింకలు శాంతియుతంగా ఉద్యమిం చాయని ప్రశంసించారు. ఇది దేశ యువత సాధించిన అత్యంత చారిత్రక విజయంగా అభివర్ణించారు. ఈ పరిణామాల తర్వాత మొదటి రోజైన ఈ ఉదయం కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే తాజా వీడియోను షేర్ చేశారు. ఈ సుదీర్ఘ ఆందోళనల ముగింపుపై స్పందించారు. నిరసన ముగిసిన తర్వాతి రోజు తన అనుభవాలను పంచుకున్నారు. రోజుల తరబడి సాగిన తీవ్ర శారీరక శ్రమ, మానసిక ఒత్తిడి తర్వాత, ఎట్టకేలకు తన బెడ్రూమ్ లో ప్రశాంతంగా కంటి నిండా కునుకు తీశానని, ఎంతో ప్రశాంతంగా నిద్ర లేచానని ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఒక్క విజయంతోనే సంతృప్తి చెంది తాము ఆగిపోబోమని స్పష్టం చేశారు అభిజిత్ డిప్కే. ప్రస్తుతానికి జంతర్ మంతర్ వద్ద నిరసనలు ముగిసినప్పటికీ, తమ పోరాటం ఇక్కడితో ఆగిపోలేదని, కేంద్ర ప్రభుత్వం నుంచి కీలకమైన అంశాలపై స్పష్టమైన హామీలు లభించినందున ప్రస్తుతానికి మాత్రమే తమ ఆందోళనలను విరమించామని ఆయన పునరుద్ఘాటించారు. భవిష్యత్తులో యువత, విద్యార్థుల హక్కుల సాధన కోసం తమ పోరాటాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకువెళతామని, ఇదొక సుదీర్ఘ, నిరంతర ప్రక్రియ అని అభిజిత్ డిప్కే స్పష్టం చేశారు. ఇచ్చిన హామీల అమలును నిశితంగా పరిశీలిస్తామని, ఒకవేళ హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తే మళ్లీ వీధుల్లోకి వచ్చి పోరాడటానికి సిద్ధంగా ఉన్నామని డిప్కే హెచ్చరించారు. రాబోయే రోజుల్లో తాము తీసుకోబోయే తదుపరి చర్యలు, నూతన వ్యూహాలను త్వరలోనే వివరంగా వెల్లడిస్తామని ఆ సంస్థ పేర్కొన్నారు.



# వర్షాభావంతో పీక్‌కు విద్యుత్ డిమాండ్

## రాష్ట్రంలో 16,500 మెగావాట్లకు వినియోగం

## వచ్చే నెల నుండి ఒక్క సాగుకే రోజుకు 7 వేల మెగావాట్ల అంచనా

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతోంది. వర్షాకాలంలోనూ ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో పీక్ డిమాండ్ 16,500 మెగావాట్లకు చేరడం విశేషం. ప్రధానంగా వర్షాలు సకాలంలో, సరిపడా కురవకపోవడంతో పాటు, ఉష్ణోగ్రతలు కూడా పెరగడంతో విద్యుత్ వినియోగం పెరుగుతున్నట్లు విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నెల 21వ తేదీన రాష్ట్రంలో విద్యుత్ వినియోగం 13722 మెగావాట్లు (252.473 మిలియన్ యూనిట్లు) ఉండగా, 22వ తేదీన 13937 మెగావాట్లున( 251.124 మిలియన్ యూనిట్లు), 23న 14426 మెగావాట్లు (258.14 మిలియన్ యూనిట్లు), 24న 15749 మెగావాట్లు (278.82 మిలియన్ యూనిట్లు), 25 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 16536 మెగావాట్లకు (289.844 మిలియన్ యూనిట్లు) విద్యుత్ వినియోగం పెరుగుదల చోటు చేసుకుంది. కాగా ఈ ఏడాది ఆగస్టు నుంచి నవంబర్ మధ్య ఉండే గరిష్ట వ్యవసాయ కాలంలో, కేవలం వ్యవసాయ పంపుసెట్ల కోసమే విద్యుత్ డిమాండ్ రోజుకు సుమారు 7,000 మెగావాట్లు ఉండవచ్చని విద్యుత్ శాఖ అంచనా వేసింది. ప్రధానంగా పత్తి వంటి అధిక నీటి వినియోగం గల పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుండటంతో వ్యవసాయ పంపుసెట్లను నడపడమే రైతుల ముందు ఉన్న ప్రధాన అవకాశంగా భావిస్తోంది. ఒక్క వ్యవసాయ రంగం అవసరాలను తీర్చడానికి వచ్చే నెల నుంచి రోజుకు సుమారు 6,500 మెగావాట్ల నుంచి 7,000 మెగావాట్ల విద్యుత్ అవసరం అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. గత ఖరీఫ్ సీజన్లలో, సగటున విద్యుత్ డిమాండ్ రోజుకు 3,500 మెగావాట్లకు మించలేదు. కానీ ఈ సారి వర్షాభావంతో అది రెట్టింపు చేరుకుంటుందని చెబుతున్నారు.

# మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు

## హనుమకొండకు మాజీమంత్రులు హరీశ్‌రావు, కెటిఆర్

## హైదరాబాద్‌కు తరలించిన బిఆర్ఎస్ నాయకులు

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, జులై 26, ప్రభాత వార్త:** తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ కీలక నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి గుండెపోటుతో అస్వస్థతకు గురయ్యారు. ఉదయం 7:30 గంటలకు హనుమకొండలోని తన స్వగృహంలో సుదర్శన్ రెడ్డికి గుండె పోటు రాగా వెంటనే స్థానిక రోహిణి ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. ఆయనకు హఠాత్తుగా గుండెపోటు రావడంతో వైద్యులు ఐసీయూ విభాగంలో ఆయనకు సీపీఆర్ నిర్వహించారు. అనంతరం ఆయనను హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే, మాజీ ఎమ్మెల్యే అస్వస్థతకు గురైన విషయం తెలియడంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు రోహిణి ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి. హరీశ్ రావు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హుటాహుటిన హనుమకొండకు చేరుకుని రోహిణి ఆసుపత్రిలో వైద్యులను కలిసి సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి తదితరులు రోహిణి ఆసుపత్రి చేరుకుని ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. బీఆర్ఎస్ కు రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, మాజీమంత్రి సత్యవతి రాథోడ్, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేష్, డాక్టర్ టి. రాజయ్య, ఎమ్మెల్సీ టి. రవీందర్ రావు, మాజీ ఎంపీ దయాకర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సహా పలువురు బీఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు ఆసుపత్రికి తరలి వచ్చారు. కాగా బీఆర్ఎస్ నాయకులతో పాటు ఆయన ఆరోగ్య పరిస్థితిపై అధికారిక హెల్త్ బులెటిన్ కోసం కుటుంబ సభ్యులు, అభిమానులు ఎప్పటికప్పుడు ఆందోళనగా ఎదురుచూశారు. బీఆర్ఎస్ లో మంచి శ్రేయోభిలాషిగా, ఆప్త మిత్రుడుగా ఎంతోమందికి సహాయ సహకారాలు అందించిన వ్యక్తిగా సుదర్శన్‌రెడ్డి గుర్తింపు పొందారు.



మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి (ఫైల్)

### డాక్టర్ మమతకు హరీశ్‌రావు ధన్యవాదాలు

పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రాణాలు కాపాడేందుకు తొమ్మిది సార్లు సీపీఆర్ చేసిన డాక్టర్ మమతా రెడ్డికి, రోహిణి హాస్పిటల్ యాజమాన్యానికి, సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదములు తెలుపుతున్నట్లు మాజీమంత్రి హరీష్ రావు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. తల్లిదండ్రులు మనకు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మను ప్రసాదిస్తారని, మాజీ శాసనసభ్యులు, ఉద్యమ సహచరులు పెద్ది సుదర్శన్ రెడ్డి విషయంలో డాక్టర్ మమతారెడ్డి కృషిని చూస్తే ఆ విషయం మరోసారి నిరూపితమైందని పేర్కొన్నారు. దాదాపు తొమ్మిది సార్లు సీపీఆర్ చేసి ప్రాణాలను నిలిపిన తీరు, వైద్యులపై, వైద్య వృత్తిపై మరింతగా గౌరవ మర్యాదలను పెంచాయని అభినందించారు.

### మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి ఎక్మో చికిత్స..

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి సికింద రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో ఎక్మో విధానంలో చికిత్స అందిస్తున్నారు. నిపుణులైన వైద్యుల బృందం ఆయనను నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఎక్మో విధానం కృత్రిమ గుండె, ఊపిరితిత్తులలాగా పని చేస్తుంది. రోగి శరీరం వెలుపల రక్తానికి ఆక్సిజన్‌ను అందిస్తూ కార్బన్ డయాక్సైడు తొలగిస్తుంది. దీంతో గుండె, ఊపిరితిత్తులకు తాత్కాలిక విశ్రాంతి దొరికి కోలుకోవడానికి దోహదం చేస్తుంది.


**AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్** (ఒక షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకు)

నమోదిత కార్యాలయం: 19-A, ధూలేశ్వర్ గార్డెన్, అజ్మీర్ రోడ్, జైపూర్-302001, రాజస్థాన్, (ఇండియా). (CIN: L36911RJ1996PLC011381)

**అనుబంధం-IV-A- (నియమం 8 (6) నిబంధన చూడండి) స్థిర ఆస్తుల అమ్మకానికి విక్రయ ప్రకటన**

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ప్రత్యేకంగా రుణగ్రహీత/లు/సహ-రుణగ్రహీత(లు), తనఖాదారులు(లు) మరియు హామీదారులు(లు) (ఎవరైతే సెక్యూరిటీ క్రెడిటార్‌కు తనఖా ద్వారా ఆర్థిక రుణ సౌకర్యాన్ని పొందారో వారికి) AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఒక షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంక్) యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకొనబడిన వారికి ఈ ప్రకటన జారీ చేయబడుతోంది. ఇక నుండి ఆపై అది AUSFBకి రిఫర్ చేయబడుతుంది. ఫైనాన్షియల్ బ్యాంక్ లిమిటెడ్ ఏదైతే ఇప్పుడు 01వ ఏప్రిల్ 2024 నుండి AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ లోనికి మరియు విలీనమైందో దాని నుండి క్రింద వివరింపబడిన స్థిరాస్తులు. స్వాధీనం చేసుకొన్న సెక్యూర్డ్ ఆస్తులు క్రింద పట్టికలో పేర్కొన్న మొత్తం రికవరీ నిమిత్తం 'ఏది ఎక్కడ' 'ఎలా ఉన్నవీ అక్కడ అలా' ఏవి ఎలా ఉన్నవీ' మరియు 'అక్కడ ఏదో అలాగే' ప్రాతిపదికన తదుపరి వచ్చే వడ్డీ, ధర, ఛార్జీలు మరియు ఖర్చులు AUSFBకి అనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు బకాయి కారణంగా ఇ-వేలం ద్వారా విక్రయించబడతాయి.

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా వెబ్‌సైట్ https://sarfaesi.auctiontiger.net ద్వారా బహిరంగ ఇ-వేలం నిర్వర్తిస్తున్నారని మీరు తెలియజేస్తున్నాము.

| రుణ ఖాతా నం. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, తనఖాదారులు, హామీదారుడి పేరు | డిమాండ్ నోటీసు 13(2) యొక్క తేదీ & మొత్తం | స్వాధీనతా తేదీ | ఆస్తి కొరకు రిజర్వ్ ధర | ఆస్తి కొరకు బయానా | వేలం తేదీ & సమయం | బిడ్ సమర్పణ తేదీ | టెండర్ దాఖలు యొక్క ఇ-వేలం ప్రదేశం | సంప్రదించు వ్యక్తి & ఆస్తి దర్శించు తేదీ |
|---|---|---|---|---|---|---|---|---|
| (లోన్ ఖాతా నం.) 22660000736466, వెంగళ శ్రీకాంత్ (రుణగ్రహీత) వెంగళ జయసుధ (సహ-రుణగ్రహీత) | 06-ఫిబ్రవరి-24 రూ. 16,14,002/- (పదహారు లక్షల పద్నాలుగు వేల రెండు రూపాయలు మాత్రమే 29-జనవరి-24 నాటికి | 17-ఏప్రిల్-26 | రూ. 17,00,000/- పదిహేడు లక్షల రూపాయలు మాత్రమే | రూ. 1,70,000/- ఒక లక్ష డెబ్బై వేల రూపాయలు మాత్రమే | 03-సెప్టెంబర్-26 మ.2:00 నుండి సా.4:00 గంటల వరకు 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో | 01-సెప్టెంబర్-26న లేదా అంతకు ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ చిరునామా: ప్లాట్ నం. A5/2, సర్వే నం. 147, UGF, హసన్‌పర్తి భీమారం హన్మకొండ -506001 | దోమాల శ్రీను 9908567643 - auctions@aubank.in 27-ఆగస్టు-26 |

**ఆస్తి వివరాలు:** హన్మకొండ జిల్లా, హసన్‌పర్తి మండలం, భీమారం గ్రామంలోని సర్వే నంబర్ 53/1/2లో ఉన్న, ఇంటి నంబర్ 55-1-1048 (పాత ఇంటి నంబర్ 1-443(2)కి అనుగుణంగా) కలిగిన ఇల్లు మరియు ఖాళీ స్థలం. మొత్తం అదంతా. దీని విస్తీర్ణం 105.55 చదరపు గజాలు లేదా 88.25 చదరపు మీటర్లు; ఇందులో RCC పైకప్పుతో కూడిన భవన విస్తీర్ణం (ప్లింత్ ఏరియా) 367.00 చదరపు అడుగులు. ఇది వరంగల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోకి వస్తుంది. మొత్తం విస్తీర్ణం: 105.55 చదరపు గజాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (లోన్ ఖాతా నం.) 22660001028062, గుంపనోల మద్దిలేటి (రుణగ్రహీత), గుంపనోల యాదమ్మ (సహ-రుణగ్రహీత) | 31-డిసెంబర్-24 రూ. 5,78,298/- ఐదు లక్షల డెబ్బై ఎనిమిది వేల రెండు వందల తొంభై ఎనిమిది రూపాయలు మాత్రమే 12-డిసెంబర్-24 నాటికి | 14-మే-26 | రూ. 6,20,000/- (ఆరు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే) | రూ. 62,000/- (అరవై రెండు వేల రూపాయలు మాత్రమే) | 03-సెప్టెంబర్-26 మ.2:00 నుండి సా.4:00 గంటల వరకు 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో | 01-సెప్టెంబర్-26న లేదా అంతకు ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ చిరునామా: సర్వే నం. 312/C3/1/1/1, 1వ అంతస్తు, కొత్తకోట-పెబ్బేరు మెయిన్ రోడ్, వనపర్తి, మహబూబ్‌నగర్ - 50938 | జెల్ల ప్రవీణ్ - 8008801095 - auctions@aubank.in - 27-ఆగస్టు-26 |

**ఆస్తి వివరాలు:** వనపర్తి జిల్లా, వనపర్తి పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని మెట్‌పల్లిలో ఉన్న స్థిరాస్తి (ఇంటి నం. 47-29/4 - ఉత్తర వైపు). ఇది 99.66 చదరపు గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్‌లో ఉంది; ఇందులో RCC పైకప్పుతో 205.34 చదరపు అడుగుల ప్లింత్ ఏరియా (నిర్మాణ విస్తీర్ణం) కలిగిన ఇల్లు ఉంది. ఈ ఆస్తిలో నిర్మించిన RCC భవనం మరియు దానికి అమర్చిన తలుపులు, చట్రాలు, అల్మారాలు, వెంటిలేషన్లు, కిటికీలు, ఫ్లోరింగ్, పైకప్పులు, వైరింగ్, పెరడు, వాస్తు అంశాలు, నాలుగు వైపుల గోడలు మొదలైనవి మరియు ఆ భవనంలోని అన్ని ఫిక్చర్లు మరియు ఫిట్టింగ్‌లు ఇందులో ఉన్నవి. విస్తీర్ణం: 99.66 చదరపు గజాలు.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (లోన్ ఖాతా నం.) 23660001292071, పసుల నాగరాజు (రుణగ్రహీత), ఉమ్మళ్ళ రజిత (సహ-రుణగ్రహీత) | 04-ఏప్రిల్-25 రూ. 5,90,839/- ఐదు లక్షల తొంభై వేల ఎనిమిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) - 26-మార్చి-25 నాటికి | 14-మే-26 | రూ. 6,00,000/- ఆరు లక్షల రూపాయలు మాత్రమే) | రూ. 60,000/- అరవై వేల రూపాయలు మాత్రమే | 03-సెప్టెంబర్-26 మ.2:00 నుండి సా.4:00 గంటల వరకు 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో | 01-సెప్టెంబర్-26న లేదా అంతకు ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ చిరునామా: సర్వే నం. 312/C3/1/1/1, 1వ అంతస్తు, కొత్తకోట పెబ్బేరు మెయిన్ రోడ్, వనపర్తి, మహబూబ్‌నగర్ - 50938 | జెల్ల ప్రవీణ్ - 8008801095 - auctions@aubank.in - 27-ఆగస్టు-26 |

**ఆస్తి వివరాలు:** (నమోదిత ఇంటి సెటిల్మెంట్ డీడ్ పత్రం సంఖ్య 7877/2023, తేదీ: 14-06-2023 ప్రకారం) వనపర్తి పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస్‌పూర్‌లో ఉన్న ఇంటి నం. 1-65. ఇది 30 X 20 = 66.66 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలంలో నిర్మించబడింది (ఇంటి నిర్మాణ విస్తీర్ణం 25 X 17 = 425 చదరపు అడుగులు). పట్టణ మునిసిపాలిటీ పరిధిలో ఉన్నాయి. దీని సరిహద్దులు క్రింది విధంగా ఉన్నాయి. **విస్తీర్ణం: 66.66 చదరపు గజాలు.**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (లోన్ ఖాతా నం.) 24660001706803, కేతావత్ నరేష్ (రుణగ్రహీత), కేతావత్ దేవి (సహ-రుణగ్రహీత) | 11-జూన్-25 రూ.8,01,968/- ఎనిమిది లక్షల ఒక వెయ్యి తొమ్మిది వందల అరవై ఎనిమిది రూపాయలు మాత్రమే 04-జూన్-25 నాటికి | 14-మే-26 | రూ. 9,00,000/- తొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే) | రూ. 90,000/- తొంభై వేల రూపాయలు మాత్రమే | 03-సెప్టెంబర్-26 మ.2:00 నుండి సా.4:00 గంటల వరకు 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో | 01-సెప్టెంబర్-26న లేదా అంతకు ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ చిరునామా: సర్వే నం. 312/C3/1/1/1, 1వ అంతస్తు, కొత్తకోట పెబ్బేరు మెయిన్ రోడ్, వనపర్తి, మహబూబ్‌నగర్ - 50938 | జెల్ల ప్రవీణ్ - 8008801095 - auctions@aubank.in - 27-ఆగస్టు-26 |

**ఆస్తి వివరాలు:** రిజిస్టర్ హౌస్ సెటిల్‌మెంట్ డీడ్ డాక్యుమెంట్ నం. 5761/2024, తేదీ 31-05-2024) ప్రకారం, వనపర్తి మండలం మరియు జిల్లాలోని ఖాసింనగర్ గ్రామం, కందూర్ తండా (కందూర్ తండా) గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆస్తి కలిగి, 6-14 నంబర్ గల నివాస గృహాన్ని (నిర్మాణ విస్తీర్ణం 27 X 17 = 459 చదరపు అడుగులు) కలిగి ఉంది. **విస్తీర్ణం: 280 చదరపు గజాలు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| (లోన్ ఖాతా నం.) 22630000007859, మార్త నిరంజన్ (రుణగ్రహీత), మార్త మొగిలి (సహ-రుణగ్రహీత) | 27-ఆగస్టు-24, రూ. 15,45,920/- (పదిహేను లక్షల నలభై ఐదు వేల తొమ్మిది వందల ఇరవై రూపాయలు మాత్రమే - 19-ఆగస్టు-24 నాటికి) | 27-మే-26 | రూ. 22,70,000/- (ఇరవై రెండు లక్షల డెబ్బై వేల రూపాయలు మాత్రమే) | రూ. 2,27,000/- కేవలం రెండు లక్షల ఇరవై ఏడు వేల రూపాయలు మాత్రమే | 09-సెప్టెంబర్-26 మ.2:00 నుండి సా.4:00 గంటల వరకు 5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో | 07-సెప్టెంబర్-26న లేదా అంతకు ముందు | AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్ చిరునామా: 21, Pr004, మంజు నగర్ ఏరియా, ఇంటి నం. 21, భూపాలపల్లి, కొంపల్లి, తెలంగాణ 506170 | దోమాల శ్రీను 9908567643 - auctions@aubank.in 02-సెప్టెంబర్-26 |

**ఆస్తి వివరాలు:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ములుగు) జాయింట్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని మైలారం గ్రామం మరియు శివారు గ్రామ పంచాయతీ గాంధీనగర్, ఘన్‌పూర్/ములుగు మండలం)లో ఉన్న ఆస్తి. ఇది వార్డు నం. 3లో, ఇంటి నం. 3-41 కలిగి ఉండి, RCC రూఫ్ (కాంక్రీట్ పైకప్పు) గల ఇల్లు మరియు ఖాళీ స్థలాన్ని కలిగి ఉంది. దీని విస్తీర్ణం 433.33 చదరపు గజాలు లేదా 362.30 చదరపు మీటర్లు. **విస్తీర్ణం 433.33 చదరపు గజాలు**

**ఇ-వేలం అమ్మకం నిబంధనలు మరియు షరతులు:-**

1). సెక్యూర్డ్ ఆస్తి యొక్క E-వేలం అమ్మకం "ఎక్కడ ఉన్నది ఉన్నట్లుగానే", "ఏది ఉందో అలాగే", "ఏది ఉందో అలాగే" మరియు "అక్కడ ఏదీ" ఆధారంగా సెక్యూర్డ్ క్రెడిటర్ అంటే AUSFB తరఫున జరుగుతుంది మరియు పేర్కొన్న ఆస్తిపై ఎటువంటి తెలిసిన చిక్కులు లేవు.

2). ఆన్‌లైన్ ఇ-వేలం అమ్మకంలో పాల్గొనడానికి, బిడ్ డాక్యుమెంట్, పాన్ కార్డ్ కాపీలు, కంపెనీ విషయంలో బోర్డు రిజల్యూషన్ మరియు ఫోటో ఐడి, చిరునామా రుజువును బయానాతో పాటు సమర్పించాలి, దీనిని MSME AUCTION POOL ACCOUNT OF AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్, కరెంట్ ఖాతా నం. 1921201121711599 AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ ఐదవ మరియు ఆరవ అంతస్తు సన్నీ బిగ్ జంక్షన్ STC ఖస్రా నం. 64 నుండి 67, గ్రామ్ సుతైపురా న్యూ ఆతిష్ మార్కెట్ జైపూర్ 302020, IFSC కోడ్: AUBL0002011, ఆన్‌లైన్ బిడ్ సమర్పించిన తర్వాత, దానిని ఉపసంహరించుకోలేరు. ఇంకా బిడ్డర్ సమర్పించిన ఏదైనా EMD రద్దు చేయబడిన చెక్కు కాపీతో RTGS/NEFT యొక్క UTR/రిఫరెన్స్ నంబర్‌ను ఈ క్రింది ఇమెయిల్ IDలకు అంటే auction@aubank.in కు పంపాలి.

(3) ఆసక్తిగల పాల్గొనేవారు / బిడ్డర్లు అందరూ మరిన్ని వివరాల కోసం https://sarfaesi.auctiontiger.net & https://www.aubank.in/bank-auction వెబ్‌సైట్‌ను సందర్శించాలని అభ్యర్థించారు. ఇ-వేలం అమ్మకాల ప్రక్రియలో పాల్గొనడానికి నిబంధనలు & షరతులు మరియు auctions@aubank.in ఇమెయిల్ ద్వారా కూడా సంప్రదించవచ్చు.

**దయచేసి గమనించండి:** పైన పేర్కొన్న తేదీన టెండర్/ఇంటర్ సే బిడ్డింగ్ ద్వారా అమ్మకం గురించి పైన పేర్కొన్న రుణ ఖాతా యొక్క రుణగ్రహీతలు/సహ రుణగ్రహీతలు/తనఖాదారులకు నియమం 8(6)తో కలిపి చదవబడిన నియమం 9(1) కింద ఇది 30 రోజుల నోటీసు కూడా. ఇచ్చిన నోటీసు వ్యవధిలో రుణగ్రహీత వారి బకాయిలను పూర్తిగా తిరిగి చెల్లించకపోతే ఆస్తి అమ్మబడుతుంది.

తేదీ : 24/07/2026 ప్రదేశం : తెలంగాణ అధీకృత అధికారి, AU స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

వార్త

దుఃఖం అనేది శిక్ష కాదు, సంతోషం అనేది వరముకాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే!

- ఆర్‌జి ఇంగర్సాల్

# తగ్గేదేలే.. తగ్గకేంచేస్తాం!

'యువతకు ఉజ్వల భవితే మా సంకల్పం' అని చెప్తున్న కేంద్ర ప్రభుత్వం కాస్త ఆలస్యంగానైనా 'లీకు' వీరుల పని పట్టేందుకు నడుం కట్టిందనే చెప్పాలి. యువత భవిష్యత్‌ను కాలరాసిన 'నీట్' ప్రశ్నపత్రాల లీకుల నాడే ప్రభుత్వం స్పందించి ఉంటే'కాక్రోచ్ జనతాపార్టీ' ఉద్భవించేదే కాదు. 'జెన్‌జి' ఉద్యమానికి మొగ్గ తొడిగేదే కాదు. పేపరు లీకు కేసుల్లో నిందితులకు వేగంగా శిక్షలు పడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించడాన్ని స్వాగతిద్దాం. కానీ దొంగలు పడ్డ ఆరు నెలలకు తస్మాత్ జాగ్రత్త! అంటూ మేమున్నామంటూ పోలీసులు బాధితులకు భరోసా ఇస్తే ఏంలాభం? అన్న చందాన ఈ వ్యవహారం సాగిన తీరే ఏమాత్రం బాగోలేదు. ఇంత ఆలస్యంగా నిర్ణయం తీసుకుని కూడా కేంద్ర ప్రభుత్వం ఇదితమ నిబద్ధతకు నిదర్శనం అని సోషల్ మీడియాలో చెప్పుకున్న సంగతులు వినేవారికి ఎబ్బెట్టుగా ఉన్నాయి. ఒక పక్కన కాక్రోచ్ విద్యార్థి సంఘాల ఆగ్రహంకట్టలు తెంచుకుని ఢిల్లీ పుర వీధుల్లో వీరంగమాడుతుంటే వారిని అణచివేయడానికి ఢిల్లీ పోలీసులు చేసారని వైరల్ అవుతున్న దమనకాండను కూడా దేశ ప్రజలంతా చూసారు. ఇలా జరుగుతోందేమిటి? అని బాధపడ్డారు కూడా. తలవని తలంపుగా అభిజిత్ దీప్‌కే అనే నిరుద్యోగి 'కాక్రోచ్' జనతాపార్టీకి ప్రాణం పోసినా వారి ఆశలు, ఆశయాలు రాజకీయాలు కాదు గనుకనే ఇప్పటికీ 'నీట్' లీక్‌కు బాధ్యులైనవారిని శిక్షించాలని కోరుతున్నారు. అందుకే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలనే ఏకైక డిమాండ్ మీదనే నిలబడి పట్టుపట్టి సాధించుకున్నారు. ఈ డిమాండ్ ఉభయ వర్గాల్లో 'కాక' రేపిందన్నది ఎవరూ కాదనలేని వాస్తవం. కేంద్ర ప్రభుత్వ ఎన్‌డిఎ పేరు మీద ఉన్నా పట్టువిడుపుల్లేకుండా సిజెపినా, బిజెపియా అనే ధోరణిలో వ్యవహారం నానింది. ఢిల్లీ ప్రధాన వీధుల్లో తమతోపాటు గళమెత్తిన ఏ రాజకీయ పార్టీతోనూ తమకు సంబంధం లేదని నిర్ద్వందంగా ప్రకటించింది. 'నీట్-యుజీ' ప్రశ్నాపత్రం లీక్ అంశంపై కొనసాగుతున్న ఆందోళనలతో సిజెపి మూడు డిమాండ్లను ప్రభుత్వం ముందుపెట్టింది. 'నీట్' లీకులతో భంగపడిన విద్యార్థుల భవితవ్యాన్ని వారికి నష్టపరిహారాన్ని చెల్లించడం వంటి ప్రధాన విద్యార్థులకు సంబంధించిన డిమాండ్‌లున్నాయి. విద్యార్థులకు పరిహారం, కేసుల ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం తరపున చర్చలలో కూర్చున్న మంత్రులు అంగీకరించారు. మరో పక్క'నీట్ తప్పిదాలకు ముగింపు పలకాలని తనముందు కొచ్చిన పిటీషన్‌లపై సుప్రీంకోర్టు కూడా ప్రభుత్వాన్ని ఆదేశించింది. అసలు 'నీట్' పరీక్షను అన్ని రాష్ట్రాల విద్యార్థులపై రుద్దుతున్న తీరునే విద్యార్థిలోకం తప్పు పడుతోంది. కాగా 'నీట్' పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ ప్రతిసారీ గతి తప్పుతోంది. చెప్పాలంటే పకడ్బందీగా పరీక్షల నిర్వహణ చేపట్టలేకపోతోంది. తొలిసారి 2013లో నిర్వహించిన 'నీట్'పరీక్ష న్యాయపరమైనచిక్కులతో రద్దయ్యింది. 2015లో 'లీక్' అయి మళ్లీ నిర్వహించారు. 'లీక్'ల వ్యవహారం ఇదే మొదటిసారి కాదు. ప్రస్తుతమున్న వ్యవస్థలో ఇదే ఆఖరుసారి అని చెప్పలేని పరిస్థితులున్నాయి. ఢిల్లీలో విద్యార్థుల 'జెన్‌జి' ఉద్యమం తీవ్ర స్థాయిలో మొదలై అన్ని రాష్ట్రాల విద్యార్థుల్లో చైతన్యం కలిగించాక, ప్రభుత్వంలో కదలిక మొదలైనట్లుంది. తాజాగా 'లీకేజ్ బాధ్యులకు పదేళ్ల జైలుశిక్ష, రూ.10కోట్ల జరిమానా అనే విధంగా గరిష్ట జరిమానా విధించే స్థాయిలో చట్టసవరణ చేస్తామంటోంది. అందుకు ప్రతిపాదనలు చేసింది. లీక్‌లపై విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ)లో భారీ ప్రక్షాళన చేపట్టింది. ఇదిలా ఉండగా మరోపక్క ఎన్‌టిఏ ఘనకీర్తిని రాజ్యసభలో విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంతమజుందార్ వివరిస్తూ 24 మంది శాశ్వత సిబ్బంది, 124 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో 'ఎన్టీఏ' నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేవలం సిబ్బంది లేకపోవడం వల్లనే 'లీకు'లు అవుతున్నాయా? అనే సందేహం ఎవరికీ రాదు కానీ 'ప్రశ్నాపత్రాల రూపకల్పన, వాటి ప్రింటింగ్‌లోనూ భాగస్వాములైన వారిలో నిబద్ధత, నిజాయితీలు లేకనే అలా జరుగుతుండడం సహజం. కాగా ఎన్టీఏ ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం మరో విధమైన లెక్కలకు ఆస్కారమిస్తోంది. అందులో విధులు నిర్వహిస్తోన్న 47మంది అధికారులపై వేటు వేసినట్లు ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. వారిలో ఎంతో నిబద్ధత కూడిన ప్రక్రియలో నిర్లక్ష్యం వహించిన ఆ ఉద్యోగులను బర్తరఫ్ చేసింది. ఈ చర్యలన్నీ జాతీయ స్థాయి పరీక్షలపై ప్రజలకున్న విశ్వాసాన్ని పునరుద్ధరిస్తాయా? లేదా?తెలుసుకోవాల్సిందే. ఇకపేపరు లీకుల నివారణ చట్టసవరణ ముసాయిదా బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదంతెలిపింది. దోషులకు ప్రస్తుతమూడు సంవత్సరాల కనిష్ట జైలుశిక్షను ఐదేండ్లకు పెంచాలన్నది ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. నీట్ ప్రశ్నపత్రాల లీకేజి జరిగి దాదాపు నాలుగుమాసాల తర్వాత మేల్కొని 'లీక్' వీరులకోసం పెంచిన శిక్షతో కొత్తచట్టం ఆమోదించబోవడం ఏలినవారి నిబద్ధతను ప్రశ్నిస్తోంది. పార్లమెంటులో ఐదు రోజులపాటు ఇదే అంశంపై విపక్షాలు పట్టుబట్టాయి. ఎట్టిపరిస్థితుల్లోనూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వినా వేరే మార్గం లేదన్నాయి. పట్టువీడేది చెప్పకనే చెప్పారు. సిజెపి తాజా చర్చలు కూడా అదే డిమాండ్‌వల్లిస్తున్నాయి. ప్రధాన్ లేక ప్రధాని ఎవరు రాజీనామాచేస్తారో ఆలోచించుకోండని కాక్రోచ్ జనతా పార్టీ అల్టిమేటమ్ ఇచ్చింది. ఏదిఏమైనా ప్రభుత్వ విశ్వసనీయత ప్రస్తుతం ప్రశ్నార్థకమైంది. కేంద్ర మంత్రి రాజీనామా సిజెపి ఉద్యమాన్ని ఎటువైపు పరుగులు పెట్టిస్తుందో చూడాలి.

ఉపన్యాసకుడైనా, రచయిత అయినా తన భావాల్ని సంక్షిప్తీకరించడం నేర్చుకోగలిగేంత వరకూ విజయం సాధించలేడు.



ఎమర్సన్

ఎన్నో కష్టనష్టాలు అనుభవించిన తరువాత కాని, మనిషికి వినయం, వివేకంరాదు.



ఫ్రాంక్లిన్

## ప్రజావాక్కు



### విరాళాల చోరీ చిన్న విషయం కాదు

అయోధ్య రామాలయంలో భక్తుల విరాళాలు చోరీ సంఘటన చిన్న విషయం ఏం కాదు! పటిష్ట నిఘా వ్యవస్థ ఉన్నా దేవుని సొమ్ము దొంగిలించటానికి ఒడిగట్టారంటే వారికి కించిత్తు కూడా దైవచింతన, పాపభీతి లేదని అర్థమవుతోంది. శతాబ్దాలుగా పోరాడి నిర్మించుకున్న ఈ భవ్య శ్రీరామ ఆలయంలో ఇలాంటి తుచ్ఛ సభ్యులు, ఉద్యోగులు ఉండటానికి వీలులేదు. ఒకప్రక్క హిందువులందరూ దేవాలయాలను ప్రభుత్వ అజమాయిషీ నుంచి విముక్తం చేయాలని కోరుకుంటుంటే, ప్రైవేట్ ట్రస్టులు ఈ విధంగా వ్యవహారిస్తే ఇక దిక్కేది. దేవుడి సొమ్ము మీద చెయ్యేసిన వాడికి మన పూర్వపు రాజులు విధించిన శిరచ్ఛేదన వంటి శిక్షలు అమలు చేయాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### పెరుగుతున్న మూఢనమ్మకాలు

టీవీలు ప్రజలకు చైతన్యంచెయ్యవలసిన బాధ్యత ఉంది. అసలు టీవీలు పత్రికలు, రేడియోలు అన్ని కూడా ప్రజలను జ్ఞానవంతులుగా చెయ్యటానికి, ప్రపంచంలో జరిగే రకరకాల సంఘటనలు తెలియచేయటానికి ఏర్పడ్డాయి. మరి అలా చెయ్యకుండా ప్రజలను మూఢులుగా చేసే కార్యక్రమాలు చూపిస్తున్నాయి. అందువలన అవి అన్నీ నిజమేననుకొని ప్రజలు మూఢనమ్మకాలవైపు పరుగెడుతున్నారు. ఈమధ్య వశీకరణం అంటూ కొంతమంది ప్రజలను దోచుకుంటున్నారు. మేము కొండజాతివారం, ఈ మంత్రం మావంశ పారంపర్యంగా నేర్చుకున్నాను, అన్నీ రకాల సమస్యలు తీరుస్తాను, ఉద్యోగం ,ఆరోగ్యం కోర్టు సమస్యలు ఇట్టేతీరుస్తాము. ఈకనపడే నంబర్లకు ముందుగా డబ్బు పంపండి, సమస్య తీరకపోతే డబ్బు వాపసు అంటూ మోసం చేస్తున్నారు. ఇలా ఎంతకాలం మోసపోవాలి. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### అంతా రాజకీయమే

ఆప్తులు అర్థాంతరంగా మరణిస్తే రాజకీయాలకు స్వస్తి పలికినవారు పదవులను తృణప్రాయంగా భావించి వాటిని వదులుకున్నవారు చాలా తక్కువగా ఉంటారు. కానీ వారి వారసులమంటూ రాజకీయాల్లోకి వస్తున్న వారు ఎన్నికల్లో పోటీచేస్తున్నవారు గెలిచినమూడోరోజు మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్నవారు,పదవుల కోసం ఆప్తులైన వారికివెన్నుపోటు పొడుస్తున్న వారు కోకొల్లలు.

- కె.రామారావు, హైదరాబాద్

### పీ.ఎఫ్ నిబంధనలు సక్రమంగా అమలవుతాయా?

గతంలో ప్రావిడెంట్ ఫండ్ (పీ.ఎఫ్) డబ్బు తీసుకోవడం చాలా శ్రమతో కూడుకున్న పని. 'చెప్పులు అరిగినా పీఎఫ్ డబ్బులు దొరకడం కష్టం' అనే నానుడి అప్పట్లో ప్రచారం ఉద్యోగుల్లో ప్రబలంగా ఉండేది. సాంకేతిక యుగంలో, పీఎఫ్ డబ్బులు తీసుకునే ప్రక్రియ మెరుగుపడింది. పీ.ఎఫ్ క్లెయిమ్ దరఖాస్తులు, పెన్షన్,బీమా ప్రయోజనాలను ఇరవై రోజుల్లోగా పరిష్కరించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కొన్ని నిబంధనలను అమలులోకి తీసుకుని రావడం మంచి పరిణామం. ఈవ్యవధిలో క్లెయిమ్ ఆలస్యమైతే, దానికి 'ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్' కార్యాలయ మే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఆ డబ్బుపై 12 శాతం వడ్డీ చెల్లించాలని ఆదేశించడం జరిగింది. ఈ కొత్త నిబంధనలను ప్రకటనల వరకే పరిమితం కాకుండా సరిగ్గా అమలు చేస్తే, అది దేశవ్యాప్తంగా ఉన్న ఈ.పీ.ఎఫ్ ఓ చందాదారులకు ఇదో ప్రయోజనం.

- దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### గొప్పలు చెప్పకుంటున్న ఎమ్మెల్సీలు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమిగా ఏర్పడిన ప్రభుత్వం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నిర్ణయాలకు లోబడి పని చేస్తూ ఉన్నది అన్నది చర్విత చరణం. ఇలాంటి ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ సూచనలతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని నిర్ణయాలను మాసిఫార్సులతోనే,విజ్ఞప్తితోనే చేస్తున్నారని ప్రచారం చేసుకునే అత్యంత అదృష్టవంతులైన ఎమ్మెల్సీలు,కొన్ని ఉపాధ్యాయసంఘాల నేతలునిస్సిగ్గుగా ప్రకటించుకోవడం విచారించదగ్గ విషయం. నిజంగా ఉపాధ్యాయుల సాధకబధకాలను, సమస్యలను ఒక వాణిగా చేసి వినిపించాల్సి నబాధ్యత ఉపాధ్యాయులు ఎన్నుకున్నఎమ్మెల్సీలపై ఉన్నది. ఉపాధ్యాయులు తెలియజేసిన సమస్యలను ఏవైతే ప్రభుత్వం పరిష్కరిస్తుందో వాటిని మేము చెప్పడంవల్ల పరిష్కరించారని గొప్పలు చెప్పుకుంటున్నారు.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### దివ్యాంగులైన టీచర్ల ఇబ్బందులు

రాష్ట్రంలో ఉన్న వివిధ గురుకులాల్లో విద్యాబోధన చేస్తున్న వైకల్యం కలిగిన వికలాంగుల లెక్చరర్స్, టీచర్స్, సమస్యలు పరిష్కారంచేయాలి. వైకల్యం గురువులను విద్యార్థులు హేళన చేస్తున్నారు. లెసన్స్ వినడంలేదు. దృష్టిలోపం కలిగిన అంధులు రాత్రిపూట నైట్ స్టడీ డ్యూటీలో ఇబ్బంది పెడుతున్నారు. వివిధ రాకలైన వైకల్యం కలిగిన వికలాంగుల గురువులను నైట్ స్టడీ డ్యూటీ నుండి మినహాయించాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)


# విద్య నాణ్యత పేరుతో అనుభవానికి పరీక్ష?

**ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతింటే దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతుంది. గురువును అనుమానంతో చూడడం కాదు, విశ్వాసంతో బలోపేతం చేయడం ప్రభుత్వాల బాధ్యత. విద్యా నాణ్యత పేరుతో తీసుకునే ప్రతి నిర్ణయం ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని పెంచేదిగా ఉండాలి. దశాబ్దాల సేవ చేసిన గురువును మళ్లీ పరీక్షల ముందు నిలబెట్టడం కంటే, ఆధునిక బోధనా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, డిజిటల్ విద్యలో ప్రావీణ్యం కల్పించడం, కృత్రిమ మేధస్సు ఆధారిత బోధనా సాధనాల వినియోగంపై అవగాహన కల్పించడం వంటి చర్యలు విద్యార్థులకు కూడా ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తాయి.**



రామ కిష్టయ్య సంగన భట్ల

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుడి పాత్రకు ప్రత్యామ్నాయం లేదు. రాజ్యాంగం కల్పించిన విద్యా హక్కు సాకారం కావాలంటే పాఠశాలలుండాలి, పాఠ్యపుస్తకాలు ఉండాలి, మౌలిక సదుపాయాలు ఉండాలి. కానీ ఇవన్నింటికంటే ముఖ్యంగా నిబద్ధత, నైపుణ్యం,అనుభవం కలిగినఉపాధ్యాయుడు ఉండాలి. అందుకే ఉపాధ్యాయ నియామకాల్లో నాణ్యతా ప్రమాణాలను తీసుకురావాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను ప్రవేశపెట్టారు. ప్రారంభంలో ఈ నిర్ణయం విద్యా సంస్కరణగా ప్రశంసలు అందుకున్నప్పటికీ, కాలక్రమేణా అదే టెట్ ఇప్పటికే ఉద్యోగాల్లో కొనసాగుతున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు కూడా తప్పనిసరిగా మారిన సందర్భాల్లో తీవ్ర అసంతృప్తికి దారితీసింది. దశాబ్దాలుగా బోధనలో విశిష్ట సేవలందిస్తున్న ఉపాధ్యాయుడు మరోసారి పరీక్ష రాసి తన అర్హతను నిరూపించుకోవాల్సి రావడం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్న ఇప్పుడు విద్యారంగంలో ప్రధాన చర్చగా మారింది. 2009లో విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) ఉపాధ్యాయ అర్హతకు దేశ వ్యాప్తంగా కనీస ప్రమాణాలను నిర్దేశించింది. ఆ మార్గదర్శకాల ప్రకారం టెట్‌ను ప్రవేశపెట్టారు. కొత్తగా నియమితులయ్యే ఉపాధ్యాయులకు ఇది అవసరమనే విషయంలో పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదు. అయితే టెట్ అమలుకు ముందు నియమితులై, ఎన్నో సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల పైనా ఈ నిబంధనలను వర్తింప జేయడం వివాదాస్పదమైంది. ఒకవైపు ఉపాధ్యాయులపై రోజురోజుకూ బాధ్యతలు పెరుగుతున్నాయి. తరగతి బోధనతో పాటు మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణ, విద్యార్థుల హాజరు నమోదు, వివిధ ప్రభుత్వ సర్వేలు, ఓటరు జాబితాల సవరణ, ఎన్నికల విధులు, జనగణన, సంక్షేమ పథకాల అమలు, డిజిటల్ డేటా నమోదు, తల్లిదండ్రుల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పాఠశాల పరిపాలన ఇలా అనేక పనులు నిర్వహిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మరోసారి టెట్ పరీక్షకు సిద్ధం కావడం వారికి అదనపు భారం అవుతోంది. ముఖ్యంగా 45 నుంచి 55 సంవత్సరాల మధ్య వయస్సు గల ఉపాధ్యాయులు ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూ మళ్లీ పోటీ పరీక్షలకు సిద్ధమవ్వాల్సి రావడం తీవ్ర ఒత్తిడిని కలిగిస్తోంది. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులలో చాలామంది పదిహేను, ఇరవై, ముప్పై సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్నారు. వేలాది మంది విద్యార్థులను ఉన్నత స్థానాలకు చేర్చారు. వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, పరిపాలనా అధికారులు, న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులను తీర్చిదిద్దిన గురువులే నేడు మరోసారి అర్హతను నిరూపించుకోవాల్సి రావడం సహజంగానే బాధను కలిగిస్తోంది. ఒక ఉపాధ్యాయుడి సామర్థ్యాన్ని అతని విద్యార్థుల విజయాలు, సేవా చరిత్ర, తరగతి గది నిర్వహణ,సామాజిక బాధ్యతలు తెలియజేస్తే, వాటిని పక్కనబెట్టి కేవలం ఒక ప్రశ్నాపత్రం ఆధారంగా అంచనా వేయడం న్యాయమా అనే ప్రశ్నకు విద్యాశాఖ సమాధానం చెప్పాల్సి ఉంది. టెట్‌పరీక్ష ప్రధానంగా బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో నిర్వహించబడుతుంది. బాల మనోవిజ్ఞానం,బోధనా పద్ధతులు, భాష, గణితం, విజ్ఞానశాస్త్రం, సామాజికశాస్త్రం వంటి అంశాలపై ప్రశ్నలు ఉంటాయి. ఇవి సిద్ధాంతపరమైన అవగాహనను పరీక్షించ గలవు. కానీ ఒక ఉపాధ్యాయుడి బోధనా నైపుణ్యం, విద్యార్థులను ప్రేరేపించే సామర్థ్యం, సమస్యలను పరిష్కరించే చాతుర్యం, విలువల బోధన,





తరగతి గది నిర్వహణ వంటి లక్షణాలను పూర్తిగా కొలవలేవు. అనుభవం ద్వారా వచ్చిన ప్రజ్ఞను ప్రశ్నాపత్రంతో కొలవడం సాధ్యం కాదని అనేక మంది విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా పాఠశాల విద్యావ్యవస్థలో సుమారు 95 లక్షలకు పైగా ఉపాధ్యాయులు సేవలందిస్తున్నట్లు కేంద్ర విద్యాశాఖ గణాంకాలు సూచిస్తున్నాయి. వీరిలో గణనీయమైన సంఖ్యలో టెట్ అమలుకు ముందే నియమితులైనవారే. కొన్ని రాష్ట్రాలు వారికి మినహాయింపులు ఇచ్చాయి. మరికొన్ని రాష్ట్రాలు మాత్రం టెట్ ఉత్తీర్ణతను తప్పనిసరి చేశాయి. ఒకే దేశంలో ఒకే విధానానికి వేర్వేరు అమలు విధానాలు ఉండటం వల్ల ఉపాధ్యాయుల్లో అయోమయం నెలకొంది. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి నిర్దేశిత ప్రమాణాలకు చేరని పాఠశాలలు కూడా ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో విధుల్లో ఉన్న ఉపాధ్యాయుల శక్తిని పరీక్షలకే పరిమితం చేయడం కంటే, పాఠశాలల విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించడం అవసరమనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. పరీక్షలు నిర్వహించడం కన్నా తరగతి గదిలో బోధనా నాణ్యతను పెంచేకార్యక్రమాలు చేపట్టడం మరింత ప్రయోజనకరమని నిపుణులు సూచిస్తున్నారు. జాతీయ విద్యా విధానం-2020 ఉపాధ్యాయుడిని విద్యా వ్యవస్థకు కేంద్రబిందువుగా పేర్కొంది. ఉపాధ్యాయుడు జీవితాంతం నేర్చుకుంటూ ఉండాలని, సేవలో ఉన్న సమయంలోనూ నిరంతర వృత్తిపరమైన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించింది. అయితే ఆ విధానం కూడా పరీక్షలకే పరిమితం కాలేదు. శిక్షణ,పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, తరగతి గది పరిశీలన, నూతన బోధనా విధానాల అవలంబన వంటి అంశాలకు ప్రాధాన్యంఇచ్చింది. అందువల్ల ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల విషయంలో కూడా అదే దిశగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని అనేక దేశాల్లో సేవలో ఉన్న ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తారు. వారి తరగతులను పరిశీలించి సూచనలుఇస్తారు. బోధనా పద్ధతులను నవీకరించే కార్యశాలలు నిర్వహిస్తారు. విద్యార్థుల అభ్యాస ఫలితాలు, తల్లిదండ్రుల అభిప్రాయాలు, పాఠశాల పరిశీలన నివేదికలు వంటి అనేకఅంశాల ఆధారంగా వారి పనితీరును అంచనా వేస్తారు. ప్రతి కొన్నేళ్లకోసారి అర్హత పరీక్షలు నిర్వహించడం సాధారణ పద్ధతి కాదు. భారతదేశం కూడా పరీక్షా సంస్కృతికి బదులుగా నైపుణ్యాభివృద్ధి సంస్కృతిని పెంపొందించాల్సిన అవసరం ఉంది. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం దెబ్బతింటే దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతుంది. గురువును అనుమానంతో చూడడం కాదు, విశ్వాసంతో బలోపేతం చేయడం ప్రభుత్వాల బాధ్యత. విద్యా నాణ్యత పేరుతో తీసుకునే ప్రతి నిర్ణయం ఉపాధ్యాయుల మనోధైర్యాన్ని పెంచేదిగా ఉండాలి. దశాబ్దాల సేవ చేసిన గురువును మళ్లీ పరీక్షల ముందు నిలబెట్టడం కంటే, ఆధునిక బోధనా పద్ధతులపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, డిజిటల్ విద్యలో ప్రావీణ్యం కల్పించడం, కృత్రిమ మేధస్సు ఆధారిత బోధనా సాధనాల వినియోగంపై అవగాహన కల్పించడం వంటి చర్యలు విద్యార్థులకు కూడా ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తాయి. విద్యా నాణ్యత అనేది కేవలం పరీక్షలతో పెరగదు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు,ఆధునిక బోధనా సామగ్రి, నిరంతర శిక్షణ, సమర్థవంతమైన పర్యవేక్షణ, విద్యార్థి కేంద్రిత బోధన ఇవి అన్నీ కలిసివచ్చినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. టెట్ ఒక్కటే విద్యా ప్రమాణాలకు కొలమానం కాదనే విషయాన్ని పాలకులు గుర్తించాలి. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల విషయంలో అనుభవానికి తగిన గౌరవం ఇవ్వాలి. ఇప్పటికే సేవలో ఉన్న ఉపాధ్యాయులను పదేపదే పరీక్షల బాట పట్టించడం వల్ల వారి సమయం,శ్రమ, మానసిక ప్రశాంతత దెబ్బతింటాయి. అదే సమయాన్ని వారు విద్యార్థుల అభ్యాసాభివృద్ధికి వినియోగిస్తే సమాజానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఉపాధ్యాయుడు పరీక్ష రాసే అభ్యర్థి కాదు పరీక్షలకు తరాలను సిద్ధం చేసే మహోన్నత గురువు. ఆయన జ్ఞానాన్ని,అనుభవాన్ని, సేవాస్ఫూర్తిని గౌరవించడం నాగరిక సమాజ లక్షణం. విద్యా నాణ్యతను పెంపొందించాలనే ప్రభుత్వ సంకల్పాన్ని ఎవరూ వ్యతిరేకించరు. కానీ ఆ లక్ష్యం సాధించే మార్గం ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడేదిగా, వారి అనుభవాన్ని సద్వినియోగం చేసేదిగా, విద్యార్థి ప్రయోజనాలను ముందుంచేదిగా ఉండాలి. టెట్ పరీక్షలు విద్యా వ్యవస్థను బలోపేతం చేసే సాధనంగా నిలవాలి గానీ, ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు అంతులేని పరీక్షా ప్రయాణంగా మారకూడదు. ●

# 'అసమానతల అత్యవసర పరిస్థితి'లో ప్రపంచ మానవాళి

బుర్ర మధుసూదన్ రెడ్డి

నేడు ప్రపంచం అనేక సంక్షోభాలతో అతలాకుతలం అవుతున్నది. ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటికి సాధించడానికి అనేక నూతన ఆలోచనలకు పదును పెట్టాల్సి ఉన్నది. నేటిడిజిటల్ ప్రపంచం వాతావరణ ప్రతికూల మార్పులు, అభివృద్ధి కుంటుపడడం,అసమానతలు, పేదరికం, ఆకలి కేకలు, నిరుద్యోగం,సాంకేతిక తికమకలు, భౌగోళిక రాజకీయ అస్థిరతలు, సాయుధ సంక్షోభాలు, యుద్ధాల మోతలు లాంటి పలు సంక్లిష్ట సమస్యలతో సంసారం చేస్తున్నది. వీటిలో ప్రపంచ జనాభా నేడు అసమానతల విషవలయంలో చిక్కి విలవిలలాడుతున్నట్లుపలు అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఆర్థికశాస్త్ర నోబెల్ పురస్కార గ్రహీత 'జోసెఫ్ స్టిట్‌లిడ్జ్' అభిప్రాయం ప్రకారం నేటి డిజిటల్ ప్రపంచం 'అసమానతల అత్యవసర పరిస్థితి' లేదా ఇన్‌ఈక్వాలిటీ ఎమర్జన్సీ లో ఉందని హెచ్చరికలు చేశారు. ఇటీవల సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసా ఏర్పాటు చేసిన జీ20 ఎక్స్‌ట్రార్డినరీ కమిటీ తయారు చేసిన నివేదికను విడుదల చేశారు. ఈ కమిటీకి నోబెల్ పురస్కార గ్రహీత జోసెఫ్ స్టిట్‌లిడ్జ్ చైర్మన్‌గా సేవలు అందించారు. నేటి విపరీత పరిస్థితుల్లో వెంటనే ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆన్ ఇన్‌ఈక్వాలిటీని ఏర్పాటు చేసి అసమానతల విష వలయాలను తొలగించే ప్రయత్నాలను చేస్తూ, ప్రపంచ దేశాలకు మార్గ నిర్దేశనం చేయాలని సూచించడం కూడా జరిగింది. జీ20 ఎక్స్‌ట్రార్డినరీ కమిటీ అధ్యయనంలో పలు ఆసక్తికరమైన,ఆందోళనకరమైన అంశాలు బయట పడడం జరిగింది. 2000-04 మధ్య కాలంలో 1శాతం ప్రపంచ సంపన్నులు 41శాతం నూతన సంపదలను సొంతం చేసుకున్నారని, 50 శాతం ప్రపంచ పేద జనాభా




కేవలం 1శాతం సంపదను మాత్రమే పొందారని తెలుస్తున్నది. ఈఅసమానతలను తగ్గించడానికి ప్రభుత్వాలచొరవ, పాలసీల తయారీ, అంతర్జాతీయ సమాజ ఏకీకరణ జరగాలని కూడా సూచించారు. సంపన్నుల ఆదాయంతో పాటు సంపద కూడా అనేక రెట్లు పెరుగుతున్నట్లు, అట్టడుగు పేదలకు బతుకు వెతలు, జీవనోపాధ సంఘర్షణలు కొనసాగుతున్నట్లు స్పష్టం అవుతున్నట్లు నివేదిక సూచిస్తున్నది. 83శాతం ప్రపంచ దేశాల్లో 90శాతం ప్రపంచ జనాభా ఉన్నదని, అసమానతలు పెరిగినపుడు ప్రజాస్వామ్యస్ఫూర్తి పూర్తిగా పలుచబడుతుందని, అశాంతి పురుడు పోసుకుంటుందని తెలిపారు. ఒక శాతం సంపన్నుల సగటుసంపద పెరుగుదల 1.3 మిలియన్ డాలర్లు ఉండగా, 50 శాతం పేద జనాభా సగటు ఆదాయం/సంపద కేవలం 585 డాలర్లు పెరిగిందనే సంచలన విషయాలను బహిర్గత పరిచింది. ప్రపంచ స్థాయిలో ఆదాయ మార్గాలు పెరగడంతో ప్రజల్లో అసమానతలు కొంత తగ్గుతున్నట్లు తెలియజేస్తున్నారు. ఎన్నిజరిగిన ఉత్తర దేశాలకు, దక్షిణదేశాలకుమధ్య ఆదాయ వ్యత్యాసాలు అధికంగా ఉన్నట్లు తేల్చారు. అధ్యయన సంస్థ సూచనల ప్రకారం సంపన్నులు, బహుళజాతి కంపెనీలపై తగు రీతిలో పన్నులను పెంచడం, దేశాలు స్థానిక ప్రజల కేంద్రంగా అభివృద్ధి పథంలో నడవడంతో పాటు ఆయా దేశాల్లోని సంపన్నులపై పన్నులను పెంచడం జరగాలని సూచించింది. వివిధ దేశాల మధ్య సానుకూల సంబంధాలు బలపడడం, అంతర్జాతీయ వాణిజ్యం పెరగడం, పర్యావరణహిత అభివృద్ధికి బాటలు వేయడం నిరంతరం జరగాలని అభిప్రాయపడింది. నేను బాగుండాలంటే నా చుట్టు ఉన్న జనులు, పర్యావరణం కూడా బాగుండాల్సిందే' అనే సరికొత్త భావనలను చిగురింపజేయాలి. ప్రజల మధ్య సంఘీభావం, సమానత్వం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సుసాధ్యం చేసుకోవాలి. ●

# అవినీతి జాతరను కట్టడి చేయలేమా!



మేకిరి దామోదర్

మన దేశం,రాష్ట్రాలలో అవినీతికి పాల్పడుతున్న అధికారులకు అడ్డు అదుపు లేకుండాపోతోంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అవినీతి నిరోధక(ఏసీబీ)శాఖ దాడులు జరపడం అభినందనీయమే,కానీ శిక్షలు పడడంలో జాప్యం జరగడంతో అవినీతి బట్టబయలవుతోంది. కానీ ఆ అధికారులు భయపడటంలేదు. స్వతంత్ర తక్షణ విచారణ, కఠిన శిక్షలు అమలుచేసే వ్యవస్థ కా(రా)వాలి? అప్పుడే పాలన వ్యవస్థలో వేళ్లూనుకపోయినా అవినీతి కూకటివేళ్లతో పెకిలించవచ్చు. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి ఉందనే ఆరోపణలు వినిపించేవి. ఇప్పుడు మన రాష్ట్రంలో ఇటీవల వరుసగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహిస్తున్న దాడులు ప్రజలను విస్మయానికి గురిచేస్తున్నాయి. ఒక్కోఅధికారి ఇంటిపై దాడి చేస్తే గుట్టల కొద్దీ నగదు, కిలోల కొద్దీ బంగారం, వెండి,ఖరీదైన విల్లాలు, లగ్జరీ కార్లు, విలువైన ప్లాట్లు, ఎకరాల కొద్దీ భూములు, బినామీ పెట్టుబడులు, భారీ బ్యాంకు డిపాజిట్లు వెలుగులోకి వస్తున్నాయి. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, రోడ్లుభవనాలు, హెచ్‌ఎండీఏ, మెట్రోవాటర్ వర్క్స్,రవాణా వంటి కీలక శాఖల్లో బయటపడుతున్న ఈ అక్రమ ఆస్తులు ప్రభుత్వ వ్యవస్థల్లో అవినీతి ఎంతలోతుగా వేళ్లూనుకుపోయిందో తెలియజేస్తున్నాయి. అయితే ప్రజలను వేధిస్తున్న అసలు ప్రశ్న మాత్రం ఒక్కటే. దాడులు, అరెస్టులు జరుగుతున్నాయి. కానీ ఆ తర్వాత ఏమవుతోంది? కేసులు ఏళ్లతరబడి కోర్టుల్లో నత్తనడకన సాగుతుండగా, అక్రమంగా కూడబెట్టిన ఆస్తులు ప్రభుత్వ ఖజానాకు ఎందుకు చేరడం లేదు? ఈ ప్రశ్నకు సమాజం సమాధానం కోరుతోంది. అంతర్జాతీయ పారదర్శకత సంస్థ అవినీతి అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా పేర్కొంటోంది. ప్రపంచ బ్యాంకు అంచనాల ప్రకారం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రతి సంవత్సరం ట్రిలియన్ల డాలర్ల మేర అవినీతి, లంచాల రూపంలో నష్టం జరుగుతోంది. భారతదేశంలో కూడా కేంద్ర విజిలెన్స్ కమిషన్, సీబీఐ, రాష్ట్ర ఏసీబీలు ప్రతి సంవత్సరం వందలాది కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, శిక్షలశాతం ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో అధికారులు పట్టుబడుతున్నా, విచారణలు పూర్తవ్వడానికి ఐదునుంచి పది సంవత్సరాలు పట్టే సందర్భాలు ఉన్నాయి. కొందరు పదవీ విరమణ పొందేవరకు కూడా కేసులు తేలడం లేదు. ఈజాప్యమే అవినీతి అధికారుల్లో భయాన్ని తగ్గిస్తోంది. మరోవైపు అవినీతికి, రాజకీయ అవినీతి తోడవడం



ఒక కారణమే!.ప్రభుత్వ ఉద్యోగి సంపాదించే ప్రతిరూపాయి ప్రజల పన్నుల ద్వారానే వస్తుంది. అలాంటి వ్యక్తి చట్టవిరుద్ధంగా వేల కోట్ల విలువైన ఆస్తులు కూడబెడితే, ఆ సంపద అసలు యజమానులు ప్రజలే. అయినప్పటికీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో ఆస్తులు సంవత్సరాల తరబడి అలాగే ఉండిపోతున్నాయి. న్యాయపరమైన ప్రక్రియ పూర్తయ్యాక మాత్రమే శాశ్వత స్వాధీనం సాధ్యమైనా, విచారణలను వేగవంతం చేసి అక్రమ ఆస్తులను ప్రభుత్వానికి జమ చేసే వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. స్వాధీనం చేసుకున్న నిధులను విద్య,వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, సాగునీటి ప్రాజెక్టులు వంటి ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తే సమాజానికిప్రత్యక్ష లాభం చేకూరుతుంది. అవినీతిని అరికట్టేందుకు కేవలం దాడులుసరిపోవు. అవినీతి చేయాలనే ఆలోచన వచ్చినప్పుడే భయం కలిగించే పాలనా వ్యవస్థ అవసరం. అందుకోసం కొన్ని కీలక సంస్కరణలు అత్యవసరం. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల కోసం ప్రత్యేక వేగవంతమైన కోర్టులు ఏర్పాటు చేయాలి. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి ఆస్తుల వివరాలను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులోఉంచాలి. బినామీ ఆస్తుల గుర్తింపుకు కృత్రిమ మేధ,డేటా అనలిటిక్స్, డిజిటల్ లావాదేవీల సమగ్ర విశ్లేషణను వినియోగించాలి. ప్రభుత్వ కొనుగోళ్లు, టెండర్లు పూర్తిగా పారదర్శక ఈ గవర్నెన్స్ విధానంలో నిర్వహించాలి. అవినీతిని బయటపెట్టే విజిల్‌బ్లోయర్లకు సమర్థ రక్షణ కల్పించాలి. శిక్షలు ఖరారైన అధికారులకు జీవితకాలం ప్రభుత్వ ఉద్యోగాలు, కాంట్రాక్టులు, ప్రజాప్రతినిధి పదవులకు అనర్హత వంటి కఠిన నిబంధనలు అమలు చేయాలి. సింగపూర్, హాంకాంగ్ వంటి దేశాలు స్వతంత్ర అవినీతి నిరోధక సంస్థలు, వేగవంతమైన విచారణలు, కఠిన శిక్షల ద్వారా ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పెంచిన వాస్తవం గ్రహించి మన దగ్గర అమలు చేయాలి. భారతదేశం కూడా అదే దిశగా మరింత దృఢమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. నిజాయితీకి గౌరవం పెరిగితేనే ప్రజాస్వామ్యానికి బలం.'అవినీతి వటవృక్షానికి తల్లి వేరు రాజకీయ అవినీతే' దాన్ని సమూలంగా నిర్మూలించినప్పుడే అభివృద్ధి సుసాధ్యం. అవినీతి అధికారి ఇంటి నుంచి కోట్ల రూపాయలు బయట పడటం వార్త మాత్రమే. కానీ ఆ కేసులో త్వరగా తీర్పు రావడం, అక్రమ ఆస్తులు ప్రభుత్వ ఖజానాకు చేరడం, నేరస్థుడికి కఠిన శిక్ష పడటం అదే నిజమైన ప్రజా న్యాయం. అరెస్టులు సంచలనం సృష్టిస్తాయి. శిక్షలే మార్పు తీసుకొస్తాయి. దాడులు అవినీతిపై తొలి అడుగు మాత్రమే. చివరి అడుగు మాత్రం వేగవంతమైన విచారణ, నిష్పాక్షిక న్యాయం, అక్రమ ఆస్తుల స్వాధీనం, నిజాయితీకి గౌరవం కల్పించే పాలనా వ్యవస్థ. ప్రజల కష్టార్జిత పన్నులతోనడిచే ప్రభుత్వ వ్యవస్థలో రాజకీయ నాయకుల కుంభకోణాలైనా, అధికారుల అవినీతి అయినా జాతర కారాదు? నిజాయితీకి పరీక్ష అనే పరిస్థితి కొనసాగ కూడదు. చట్టం, న్యాయం ముందు ప్రతి ఒక్కరూ సమానమే అనే నమ్మకం ప్రజల్లో బలపడాలంటే అవినీతికి తావులేని పాలన,ఆలస్యం లేని న్యాయం, రాజీ లేని శిక్షలు తప్పనిసరి. అదే నిజమైన సుపరిపాలనకు పునాది. అదే ప్రజాస్వామ్యానికి అసలైన గౌరవం. ●



# సరికొత్త శిఖరాలకు భారత్

## విశ్వసనీయ ప్రపంచ రక్షణ భాగస్వామిగా గుర్తింపు
## స్థానిక ఉత్పత్తులు, చేనేత, ఖాదీని ప్రోత్సహించాలి
## మట్టి విగ్రహాలను పూజించి గణేష్ ఉత్సవాన్ని జరుపుకోవాలి
## 'నారీ శక్తి' దేశానికి కీర్తిని తెచ్చింది
## మన్ కీ బాత్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ
### కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బృందం విజయం సాధించాలని ఆకాంక్ష

**న్యూఢిల్లీ, జులై 26:** భారత్ ఒక విశ్వసనీయ ప్రపంచ రక్షణ భాగస్వామిగా ఎదుగుతోందని, తన రక్షణ సామర్థ్యాలను నిరంతరం బలోపేతం చేసుకుంటోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. ఆదివారం నిర్వహించిన 136వ 'మన్ కీ బాత్'లో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, కార్గిల్ యుద్ధంలో పోరాడిన భారతీయ సైనికులకు ఆయన నివాళి అర్పించారు. 1999లో పాకిస్థాన్‌తో జరిగిన సంఘర్షణ సమయంలో, కఠినమైన వాతావరణ పరిస్థితులు, శత్రువుల సవాళ్లను ఎదుర్కొని వారు అసాధారణ ధైర్యసాహసాలను ప్రదర్శించారని ఆయన గుర్తుచేశారు. "కార్గిల్ విజయ్ దివస్ మనలో గర్వభావాన్ని నింపుతుంది. మన వీర సైనికుల అసాధారణ ధైర్యసాహసాలను ఈ రోజు మనకు గుర్తుచేస్తుంది" అని ఆయన అన్నారు. రక్షణ రంగ ఉత్పత్తి లేదా ఎగుమతులు ఏ విషయంలోనైనా భారత్ నిరంతరం కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. జులై ప్రారంభంలో తాను ఇండోనేషియాలో ఉన్నానని, అక్కడ బ్రహ్మోస్, అస్త్ర క్షిపణుల కోసం ఒక కీలక ఒప్పందం కుదిరిందని మోడీ తెలిపారు. 'పినాక్షా దీర్ఘశ్రేణి గైడెడ్ రాకెట్, 'కుశ' క్షిపణిని విజయవంతంగా పరీక్షించినందుకు డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లను ప్రధాని మోడీ అభినందించారు. ఈ విజయాలు భారతదేశ రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ముఖ్యమైన మైలురాళ్ళుగా ఆయన అభివర్ణించారు.

జులై 4న ప్రారంభించిన దేశవ్యాప్త 'క్యాచ్ ది రెయిన్' ప్రచారం, గ్రామీణ, పట్టణ భారతదేశం అంతటా ప్రజల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం, సాంప్రదాయ జలాశయాల పునరుద్ధరణ, పెద్ద ఎత్తున మొక్కల పెంపకాన్ని ప్రోత్సహిస్తోందని ప్రధానమంత్రి అన్నారు. గ్లాస్గోలో జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత బృందం విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ, భారత క్రీడాకారులు అద్భుతమైన ప్రదర్శనలు చేసి దేశానికి గర్వకారణంగా నిలుస్తారని ప్రధాని మోడీ విశ్వాసం వ్యక్తం చేశారు. జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టైటిల్ గెలిచిన తొలి భారతీయురాలిగా నిలిచిన పివి సింధును ప్రధానమంత్రి అభినందించారు. లండన్‌లోని లార్డ్స్‌లో చారిత్రాత్మక తొలి టెస్ట్ విజయాన్ని నమోదు చేసిన భారత మహిళల క్రికెట్ జట్టును ప్రశంసించారు.

ఎర్నాకుళం జిల్లా, దక్షిణ చిత్తూరులోని ఒక పాఠశాలలో ఉపాధ్యాయుడు అభిలాష్ ఫుట్‌బాల్ సంబంధిత పదాల ద్వారా సంస్కృతాన్ని ప్రోత్సహిస్తూ, విద్యార్థులకు భాషా అభ్యసనాన్ని ఆసక్తికరంగా మారుస్తున్న 'అక్షరకందుక్ష' కార్యక్రమాన్ని ప్రధాని అభినందించారు. భారత దేశపు మొట్టమొదటి ప్రైవేటుసంస్థ అభివృద్ధి చేసిన రాకెట్ అయిన విక్రమ్1 విజయవంతమైన ప్రయోగాన్ని, భారతదేశ అంతరిక్షరంగానికి ఒక మైలురాయిగా అభివర్ణిస్తూ ప్రధాని ప్రశంసించారు. అలాగే దేశంలోని యువ ఆవిష్కర్తల అంకితభావాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని కొనియాడారు.

తాను గతంలో చేసిన విజ్ఞప్తిని పునరుద్ఘాటిస్తూ, స్థానికంగా లభించే సహజ మట్టితో చేసిన విగ్రహాలను పూజించి గణేష్ ఉత్సవాన్ని జరుపుకోవాలని, తద్వారా పర్యావరణ అనుకూల పండుగను ప్రోత్సహించాలని ప్రధాని పౌరులను కోరారు. ఆగస్టు 7న దేశం జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్న సందర్భంగా, ఖాదీకి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతూనే ఉందని, భారతదేశ నేత కార్మిక వర్గానికి మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి పౌరులను కోరారు. భారతదేశపు గొప్ప గిరిజన సాంస్కృతిక వార సత్వాన్ని ప్రదర్శించే త్రిపురకు చెందిన సాంప్ర దాయ మూడు తీగల వెదురు వాద్యమైన 'చోంగ్‌ప్రెంగ్'ను ప్రధాని మోడీ ప్రముఖంగా ప్రస్తావించారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు, 2026 ఆగస్టు 15న ప్రతి ఇంటిలో జాతీయ జెండాను సగర్వంగా ఎగురవేయడం ద్వారా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో పాల్గొనాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రతి పౌరుడికి పిలుపునిచ్చారు.



## అమెరికా క్షిపణుల నిల్వలు కరిగిపోతున్నాయి
### ఆందోళనలో అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, జులై 26 :** ఇరాన్‌పై దాడుల విషయంలో అమెరికా కొంచెం వెనక్కి తగ్గింది. తమ వద్దనున్న ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల్లో క్షిపణుల నిల్వలు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలోనే ఇరాన్‌పై సైనిక చర్యలు తీవ్రం చేసే ప్రణాళికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలుస్తోంది. సీనియర్ సలహాదారులతో సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా దళాలు, స్థావరాల రక్షణ కోసం పోరాడితే నిల్వలు వేగంగా కరిగిపోవచ్చని సైనికాధికారులు హెచ్చరించిన నేపథ్యంలో ట్రంప్ ప్రభుత్వం ఆందోళన చెందుతోంది.

ప్రస్తుత యుద్ధంలో ఇరాన్ చౌకగా తయారుచేసిన డ్రోన్లను భారీ సంఖ్యలో వినియోగిస్తోంది. ఒక్కో డ్రోన్ ధర కేవలం 20వేల నుంచి 50 వేల డాలర్లలోపే. అయితే వీటిని ఎదుర్కోవడానికి అమెరికా వినియోగిస్తున్న ఒక్కో ఇంటర్‌సెప్టర్ క్షిపణి ధర మాత్రం 1.5మిలియన్ డాలర్ల పైమాటే. ఆర్థిక పరమైన ఈ అంతరం యుద్ధంలో అమెరికాపై ప్రభావం చూపనుందని నిపుణులు అంటున్నారు. అంతే కాకుండా గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు తీవ్రం చేయడంతో అమెరికాకు చెందిన అనేక స్థావరాలు దెబ్బతిన్నాయి. వాటిని రక్షించడానికి పేట్రియాట్ ఎయిర్ డిఫెన్స్ ఇంటర్‌సెప్టర్‌లు ఇతర ఆయుధాలను పెద్ద మొత్తంలో ఉపయోగించింది. ఫలితంగా ప్రస్తుతం ఆయా ఆయుధాల కొరత ఏర్పడింది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే పశ్చిమాసియా దేశాల్లో సైనిక కార్యకలాపాలను పర్యవేక్షించే యుఎస్ సెంట్రల్ కమాండ్‌కు అందుబాటులో ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు గణనీయంగా తగ్గిపోతాయని జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మన్ జనరల్ డాన్ కెయిన్ హెచ్చరించినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చెంగ్ మాట్లాడుతూ యుద్ధాన్ని కొనసాగించడం కంటే ట్రంప్ దౌత్యపరమైన పరిష్కారాన్నే ఇష్టపడతారని పేర్కొన్నారు. కానీ గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగిస్తే మాత్రం అమెరికా తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. మరోవైపు యుద్ధం విషయంలో మధ్యవర్తిత్వం వహించమని శనివారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖతార్, పాకిస్థాన్‌లను కోరినట్లు తెలుస్తోంది.

# ఇక ఏ ఎన్నికల్లోను పోటీ చేయను: సిద్దరామయ్య



**బెంగళూరు,జులై 26:** కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య సంచలన నిర్ణయం తీసుకున్నారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయట్లేదని ప్రకటించారు. ప్రస్తుత రాజకీయాల్లో నైతిక విలువలు క్షీణించాయని, అవినీతి పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు. వయసు, ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా కూడా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. మండ్య జిల్లా కేఆర్ పేటలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ఎక్స్ లో ఓ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత రాజకీయాలపై సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు వరుణ నియోజకవర్గం ఓటర్లు డబ్బులు విరాళంగా ఇచ్చి తనను గెలిపించారని గుర్తు చేసుకున్నారు. నేడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని, నేటి తరం రాజకీయాల్లో ఓట్లు పొందడానికి అభ్యర్థులే ప్రజలకు డబ్బులు పంచాల్సిన దుస్థితి ఏర్పడిందని అన్నారు. విలువలు లేని కలుషిత రాజకీయాల్లో నిజాయితీగా పనిచేసే వారికి గుర్తింపు దక్కట్లేదని సిద్ధరామయ్య చెప్పారు. ప్రస్తుతం సిద్ధరామయ్య వయసు ప్రస్తుతం 79 ఏళ్లు. 2028 ఎన్నికల నాటికి 82 సంవత్సరాలకు చేరుకుంటుంది. వయసు పైబడటంతో పాటు శారీరక దృఢత్వం తగ్గడం వల్ల ఒకప్పటిలా ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయ పడ్డారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ చురుగ్గా సేవ చేయాలంటే శారీరక శక్తి ఎంతో అవసరమని, అందుకే ఎన్నికల బరి నుంచి తప్పుకోవడానికి ఇదే సరైన సమయంగా తాము భావించినట్లు స్పష్టం చేశారు. ఇటీవల కర్ణాటక రాజకీయాల్లో చోటు చేసుకున్న పరిణామాలు ఈ నిర్ణయానికి కారణమంటూ వస్తున్న ఊహాగా నాలకు సిద్ధరామయ్య పరోక్షంగా తెరదించారు. ఈ నిర్ణయం వ్యక్తిగత కారణాల వల్లేనని తాజాగా తేల్చి చెప్పారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ఎప్పుడూ కూడా సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేశానని, మనస్సాక్షికి విరుద్ధంగా వ్యవహరించలేదని పేర్కొన్నారు.



## పిఒకె మినహా పాక్‌తో మరే ఇతర చర్చలు ఉండవు
### కార్గిల్ దివస్ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**శ్రీనగర్,జులై 26:** పాక్ ఆక్రమిత్ కాశ్మీర్ మినహా పాకిస్థాన్‌తో భవిష్యత్తులో మరే అంశంపైన చర్చలు ఉండవని రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేసారు. భారత్ ఇన్నోవేషన్, స్టార్టప్‌లు, స్పేస్ మిషన్ల వైపు అడుగులు వేస్తుంటే పాకిస్థాన్ మాత్రం చొరబాటు మార్గాలను వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. మనం డేటా సెంటర్లను నిర్మిస్తుంటే వాళ్లు ఉగ్రవాద కేంద్రాలను అభివృద్ధి చేసుకుంటున్నారన్నారు. పాకిస్థాన్‌తో చర్చలంటూ జరిగితే అది పీవోకే కోసమే తప్ప మరే విషయంలోనూ జరగబోవని పేర్కొన్నారు. పీవోకేను పాక్ అక్రమంగా ఆక్రమించుకుందని మండిపడ్డారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని యుద్ధ స్మారక చిహ్నం వద్ద మాట్లాడుతూ కేంద్రమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. 1999లో కార్గిల్ యుద్ధంలో దేశం సాధించిన విజయాన్ని భారతమాత కిరీటంలో పొదిగిన వజ్రంగా అభివర్ణించారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని తమ దేశ విధానంలో ఒక భాగంగా మార్చుకుందని రాజ్‌నాథ్ సింగ్ దుయ్యబట్టారు. ఉగ్రవాదులను అడ్డు పెట్టుకొని భారత్‌ను బెదిరించడానికి ప్రయత్నిస్తే ఏమవుతుందో ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రపంచమంతా చూసిందన్నారు. 27వ కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్‌తోపాటు ఆర్మీ చీఫ్ జనరల్ ధీరజ్ సేథ్, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఇతర ఆర్మీ అధికారులు అమరవీరులకు నివాళులర్పించారు.

## కొత్త విద్యామంత్రిగా ప్రహ్లాద్ జోషి బాధ్యతల స్వీకారం
### తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్న మంత్రి



**న్యూఢిల్లీ,జులై 26:** తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు శక్తివంచన లేకుండా పని చేస్తానని కేంద్ర విద్యాశాఖ మంత్రిగా నియమితులైన ప్రహ్లాద్ జోషి అన్నారు. ఆయన విద్యా శాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎంతో వినయంతో ఈ బాధ్యతలను స్వీకరిస్తున్నట్లు ఎక్స్ వేదికగా వెల్లడించారు. తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ప్రధాని నరేంద్ర మోడీ కి ధన్యవాదాలు తెలిపారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారానికి సంబంధించిన ఆందోళనలు తీవ్రమైన నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ప్రధాని నరేంద్ర మోడీసలహా మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రహ్లాద్ జోషికి విద్యా శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. కర్ణాటకకు చెందిన ప్రహ్లాద్ జోషి ధార్వాడ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ శాఖ మంత్రిగా ఉన్న ఆయన ఇకపై విద్యాశాఖ అదనపు బాధ్యతలను కూడా నిర్వర్తించనున్నారు. నూతన మంత్రిగా ప్రహ్లాద్ జోషి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో ధర్మేంద్ర ప్రధాన్ శనివారం కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో 36 రోజులుగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనలతో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల దృష్ట్యా తాను ప్రధాని నరేంద్రమోడీకి రాజీనామా సమర్పించినట్లు ధర్మేంద్ర ప్రధాన్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఆయన రాజీనామా చేసిన కాసేపట్లోనే ప్రహ్లాద్ జోషికి ఈ కీలకశాఖను అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ప్రహ్లాద్ జోషి సోషల్ మీడియాలో స్పందించారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ప్రధాని మోడీకి కృతజ్ఞతలు. వినయంతో, కర్తవ్య నిష్ఠతో ఈ బాధ్యతను స్వీకరిస్తున్నానని పేర్కొన్నారు. గతంలో పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖల మంత్రిగా పనిచేశారు. 2024 ఎన్నికల అనంతరం వినియోగదారుల వ్యవహారాలు, పునరుత్పాదక ఇంధన శాఖలను నిర్వహించారు.

# బిజెపిని కట్టడి చేసేందుకు పొత్తులకు సిద్ధమే..
### అఖిలేష్‌కు ఒవైసీ ఓపెన్ ఆఫర్



**మొరాదాబాద్,జులై 26:** దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఉత్తరప్రదేశ్‌లో మరోసారి రాజకీయ సమీకరణాలు వేడెక్కుతున్నాయి. 2027లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేశ్ యాదవ్‌కు పొత్తు కోసం బహిరంగ ఆహ్వానం పంపారు. బీజేపీని మరోసారి అధికారంలోకి రాకుండా నిలువరించేందుకు కలిసి పనిచేయడానికి ఇదే సరైన సమయమని ఆయన స్పష్టం చేశారు. మొరాదాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఒవైసీ మాట్లాడుతూ "ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని మజ్లిస్ కోరుకోవడం లేదు. అందుకే నేను చేతులు కలపడానికి, పొత్తు పెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. మాట్లాడటానికి ఇదే సరైన సమయం. ఎన్నికలు ముగిశాక తర్వాత ఏడవద్దు అంటూ అఖిలేశ్ యాదవ్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ పార్టీ పోటీ చేయడం వల్ల ఎస్పీకి నష్టం జరుగుతుందనే వాదనను ప్రస్తావిస్తూ, ఆ నష్టం జరగకుండా ఉండేందుకే తాను పొత్తుకు సిద్ధంగా ఉన్నానని వివరించారు. ఈ పొత్తులో తమకు సమాన గౌరవం, హక్కులు కావాలని ఒవైసీ స్పష్టమైన సంకేతాలిచ్చారు. మా పోరాటం ఏ మతానికి వ్యతిరేకం కాదు. మా గౌరవం, న్యాయం కోసమే ఈ పోరాటం. అఖిలేశ్ యాదవ్ కుర్చీలో కూర్చుంటే, నేను కూడా ఆయన ముందు సమానంగా కూర్చుని హక్కులు, న్యాయం గురించి చర్చిస్తానని ఆయన పేర్కొన్నారు. ఒవైసీ పొత్తు ప్రతిపాదనపై బీజేపీ వెంటనే స్పందించింది. ఇది బుజ్జగింపు రాజకీయాల కలయిక అని బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. అఖిలేశ్, ఒవైసీ ఇద్దరూ బుజ్జగింపు రాజకీయాల్లో ఒకరితో ఒకరు పోటీ పడతారు. ఇప్పుడు పెద్ద భాయిజాన్ ఎవరు అనే పోటీని పక్కనపెట్టి భాయిజాన్ కలయిక కోసం చూస్తున్నారు. అందుకే ఒవైసీ, అఖిలేశ్‌కు ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షంగా సమాజ్‌వాదీ పార్టీ ఉంది. 2027 ఎన్నికలను పార్లమెంట్ ఎన్నికలకు సెమీ ఫైనల్‌గా భావిస్తున్న తరుణంలో ఒవైసీ ప్రతిపాదన ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ ఆఫర్‌పై అఖిలేశ్ యాదవ్ నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

# సంక్షిప్త వార్తలు

## అమెరికాను భయపెడుతున్న ఖైబర్ షెకాన్!



**వాషింగ్టన్, జులై 26:** అమెరికాను ఇన్నాళ్లు షాహెద్ డ్రోన్లు గుక్క తిప్పుకోనీయకుండా చేస్తే ఇప్పుడు దానికి తోడుగా ఓ చౌకబారు క్షిపణి వచ్చి చేరింది. దాని ఖైబర్ షెకాన్. దీని రేంజి 1,400కిలోమీటర్లు. పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై జరిగిన భీకర దాడుల్లో ఈ క్షిపణిదే కీలక పాత్ర. పాత ఇరాన్ క్షిపణులతో పోలిస్తే ఇది విభిన్నమైనది. ఘన ఇంధనంతో పనిచేస్తుంది. శత్రువుపై వినియోగించే ముందు దీనిలో ఇంధనం నింపాల్సిన అవసరంలేదు. ఫలితంగా వీటిని ట్రక్కులపై లోడ్‌చేసి వేగంగా తరలించి శత్రువుపై దాడిచేయవచ్చు. దీంతో ఇరాన్ క్షిపణి లాంచర్లకోసం యుద్ధ విమానాలు వెతికే వేళ త్వరగా తప్పించుకొనే అవకాశం ఉంది.

## వచ్చేవారమే కర్ణాటక కేబినెట్ విస్తరణ



**బెంగళూరు,జులై 26:** కర్ణాటక మంత్రివర్గాన్ని వచ్చే వారం విస్తరించే అవకాశం ఉందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. మంత్రులంతా ఐక్యంగా పనిచేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. శనివారం చిత్రదుర్గలో జరిగిన బెంగళూరు రీజనల్ డివిజన్ అభివృద్ధి ప్రగతి సమీక్ష సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కేబినెట్‌ను వచ్చే వారం విస్తరించవచ్చు. అది జరిగిన వెంటనే మంత్రు లంతా చేతులు కలిపి పనిచేయాలి. రాష్ట్ర వ్యాప్తంగా కరువు పరిస్థితిని సమష్టిగా అంచనా వేసి, గ్రామాల్లో రైతులు ఇబ్బంది పడకుండా చూడటం మనందరి బాధ్యతని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# విద్యార్థులపై ప్రాణాంతక పెల్లెట్‌గన్‌లు అనుమతించింది మీరేనా?
### కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు రాహుల్ గాంధీ లేఖ



**న్యూఢిల్లీ,జులై 26:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత వారం విద్యార్థులపై జరిగిన పోలీసు దాడి ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. విద్యార్థులపై జరిగిన ఈ "క్రూరమైన దాడి"కి పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఆయన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఆదివారం ఒక లేఖ రాశారు. ఈ దాడిలో ప్రాణాంతకమైన పెల్లెట్ గన్లను ప్రయోగించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈనెల 20న జంతర్ మంతర్ వద్ద "న్యాయమైన, జవాబుదారీతనంతో కూడిన విద్యా వ్యవస్థ" కోసం విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. భద్రతా బలగాలు వారిపై విచక్షణారహితంగా బలప్రయోగం చేశాయని ఆరోపించారు. భాష్పవాయువుతో పాటు, ప్రమాదకరమైన పెల్లెట్ గన్లను కూడా వాడారని, ఈ దాడిలో వందలాది మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారని తెలిపారు. ముఖ్యంగా, మహిళా విద్యార్థినులను లక్ష్యంగా చేసుకుని, వారి సున్నితమైన భాగాలపై దాడి చేశారని తీవ్రంగా ఆరోపించారు. ఈ ఘటనలో 19 ఏళ్ల విద్యార్థి సాహిల్ లోచాబ్ కంటికి పెల్లెట్ తగలడంతో, అతను శాశ్వతంగా కంటిచూపు కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ తన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఉద్దేశించి ఆయన రెండు సూటి ప్రశ్నలు సంధించారు విద్యార్థులపై పెల్లెట్ గన్ల వంటి ప్రాణాంతక ఆయుధాలను ప్రయోగించడానికి హోం మంత్రిగా మీరు అనుమతి ఇచ్చారా ఒకవేళ ఇవ్వకపోతే, ఆ అధికారం ఎవరిచ్చారు, సాధారణ దుస్తుల్లో వచ్చి విద్యార్థులను లాఠీలతో కొట్టిన వ్యక్తులు ఎవరు వారిని రంగంలోకి దించింది ఎవరు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాహుల్ డిమాండ్ చేశారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో దేశవ్యాప్తంగా విద్యార్థి ఆందోళనలు కొనసాగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. జంతర్ మంతర్ ఘటనకు అమిత్ షానే ప్రత్యక్ష బాధ్యుడని రాహుల్ గాంధీ గతంలోనే ఆరోపించారు. తాజాగా లేఖ రాయడం ద్వారా ఈ అంశంపై ఒత్తిడిని మరింత పెంచారు. రాహుల్ గాంధీ లేఖపై కేంద్ర హోం శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే అవసరమైన చర్యలు తీసుకున్నామని ప్రభుత్వ వర్గాలు ఇదివరకే స్పష్టం చేశాయి.



## ప్రపంచ వారసత్వ ప్రాంతాల జాబితాలోకి సారనాథ్

**లక్నో,జులై 26:** బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందిన తర్వాత తన తొలి ఉపన్యాసం ఇచ్చిన పురాతన ప్రదేశమైన ఉత్తరప్రదేశ్‌లోని ప్రాచీన బౌద్ధ క్షేత్రమైన సారనాథ్‌కు యునెస్కో ప్రపంచ వారసత్వ జాబితాలో అధికారికంగా స్థానం లభించింది. సారనాథ్ ఒక పవిత్ర భూమి. ఇక్కడే బుద్ధ భగవానుడు జ్ఞానోదయం పొందిన తర్వాత మానవాళికి తన మొదటి ప్రబోధాన్ని ఇచ్చి ధర్మచక్రప్రవర్తనకు నాంది పలికారు. దక్షిణ కొరియాలోని బుసాన్‌లో జరిగిన యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 48వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

## ఇమ్రాన్ సోదరి వ్యాఖ్యలపై షరీఫ్ సర్కార్‌లో కలకలం



**కరాచి,జులై 26:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ సోదరి నోరీన్ నియాజీ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు ఆ దేశంలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ వ్యాఖ్యలు దేశ ప్రయోజనాలకు, అంతర్జాతీయ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని పాకిస్థాన్ ప్రభుత్వం తీవ్రంగా ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెకు నేషనల్ సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ జులై 18న విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన తన ఇంటర్వ్యూలో నోరీన్ నియాజీ అమెరికా, భారత్, ఇరాన్‌తో పాకిస్థాన్ సంబంధాలు, అబ్రహం ఒప్పందాల విస్తరణ వంటి అంశాలపై మాట్లాడారు. అయితే ఆమె వ్యాఖ్యలు తప్పుడు, రెచ్చగొట్టే సమాచారాన్ని వ్యాప్తి చేసేలా ఉన్నాయని ప్రభుత్వం ఆరోపిస్తోంది.

## గిన్నిస్ రికార్డుల్లోకి హుబ్బలి రైల్వే ప్లాట్‌ఫామ్

**హుబ్లి,జులై 26:** భారతీయ రైల్వేల అద్భుతమైన ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలిచిన హుబ్బలి(హుబ్లీ) రైల్వే ప్లాట్‌ఫామ్, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. కర్ణాటకలోని హుబ్బళ్లి జంక్షన్ రైల్వే స్టేషన్, ప్రపంచంలోనే అత్యంత పొడవైన రైల్వే ప్లాట్‌ఫామ్‌కు నిలయంగా మారింది. దీని పొడవు ఏకంగా 1507 మీటర్లు. 2023లో ఈ ప్లాట్‌ఫామ్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ లో అధికారికంగా స్థానం సంపాదించింది. అంతకుముందు ఈ రికార్డు ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జంక్షన్ (1,366 మీటర్లు) పేరిట ఉండేది. దానిని హుబ్బళ్లి అధిగమించింది. రైల్వే యార్డ్ ఆధునికీకరణ ప్రాజెక్టులో భాగంగా ఈ ప్లాట్‌ఫామ్‌ను నిర్మించారు. రైళ్ల రాకపోకల సామర్థ్యాన్ని పెంచడం, భద్రత, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యాలు. కర్ణాటకలోని అత్యంత రద్దీగా ఉండే రైల్వే హాబ్‌లలో ఒకటైన హుబ్బళ్లిలో కార్యాచరణ అవసరాల దృష్ట్యా ఇది ఎంతో కీలకం.

## పంజాబ్‌లో ఏ పేపరూ లీక్ కాలేదు: సిఎం భగవంత్‌మాన్



**అమృత్‌సర్,జులై 26:** నీట్ పేపర్ లీక్ అంశంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన రాజీనామాకు కీలక పాత్ర పోషించిన సీజేపీ పార్టీ పంజాబ్ రాష్ట్రంలో జరిగిన పేపర్ లీక్ అంశంపై కూడా నిరసనలు తెలపాలని దేశవ్యాప్తంగా డిమాండ్ మొదలైంది. దీంతో అప్రమత్తం అయిన పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్ ఆదివారం మీడియా ముందు వచ్చి రాష్ట్రంలోని పేపర్ లీక్‌పై కీలక ప్రకటన చేశారు. పంజాబ్‌లో తమ ఆప్ ప్రభుత్వం ఏర్పడి నాలుగున్నరేళ్లు పూర్తవుతోందని, ఈ కాలంలో ఒక్కటి కూడా క్వశ్చన్ పేపర్ లీక్ కాలేదని ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో, ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అయితే ఇటీవల రెండు ప్రాంతాల నుంచి కాపీయింగ్ (మాస్ కాపీయింగ్) రాయడానికి ప్రయత్నించినట్లు సమాచారం అందిందని, వెంటనే అధికారులు రంగంలోకి దిగి ఆ కుట్రను ఛేదించారని సీఎం వెల్లడించారు. బ్లూటూత్ పెన్నుల ద్వారా ప్రశ్నాపత్రాలను డిజిటల్‌గా స్కాన్ చేసి బయటకు పంపి, ఆపై బయటి నుంచి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించిన ముఠాను పోలీసులు పట్టుకున్నారని భగవంత్ మాన్ వివరించారు. పరీక్ష ప్రారంభమైన కేవలం 10 నిమిషాల్లోనే లోపల కాపీయింగ్ చేస్తున్న విద్యార్థులతో పాటు, ఒక్కో పేపర్‌కు రూ.3 నుంచి 5 లక్షలు వసూలు చేస్తూ బయట నుంచి ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న సూత్రధారులను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో మొత్తం 21 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు సీఎం వెల్లడించారు.



## నల్లసముద్రంలో నౌకల రవాణాపై విదేశాంగశాఖ అలర్ట్

**న్యూఢిల్లీ,జులై 26:** భారత పౌరులకు తాజాగా విదేశాంగశాఖ కీలక ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. నల్లసముద్రంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న యుద్ధం, ఘర్షణల నేపథ్యంలో అక్కడ ప్రయాణించే పౌరులు, పని చేసే వ్యాపార నౌకలు అప్రమత్తంగా ఉండాలని స్పష్టంచేసింది. తాజాగా నల్లసముద్రంలో ప్రయాణించే సరుకు రవాణా నౌకలపై క్షిపణులు, డ్రోన్ల దాడులు పెరిగాయి. ముఖ్యంగా ఏప్రిల్ నెల నుంచి ఈ తరహా దాడుల తీవ్రత మరింత ఎక్కువైంది. ఇప్పటి వరకు ఐదుగురు భారతీయ పౌరులు ప్రాణాలు కోల్పోయినట్లుగా తెలిపింది.

## హైడ్రోజెన్ రైల్ ట్రయల్ రన్ విజయవంతం



**చండీగఢ్,జులై 26:** భారత రైల్వే చరిత్రలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి హైడ్రోజన్ రైలు తన ప్రయోగాత్మక పరుగును విజయవంతంగా పూర్తి చేసింది. 10 కోచ్‌ల ఈ రైలు 1,200 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి, ఏకంగా 3,200 లీటర్ల డీజిల్ వినియోగాన్ని ఆదా చేసినట్లు రైల్వే మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రైలు ప్రయాణ సమయంలో కర్బన ఉద్గారాలకు బదులుగా కేవలం నీటి ఆవిరిని మాత్రమే విడుదల చేయడం దీని ప్రత్యేకత. హైడ్రోజన్, ఆక్సిజన్ మధ్య రసాయన చర్య ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకుంటూ ఈ రైలు నడుస్తుంది.

## ఐదుగురు పోలీస్ అధికారులపై సువేందు సర్కార్ వేటు



**కోల్‌కతా,జులై 26:** పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి నేతృత్వం లోని ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పాలనలో వివాదా స్పదంగా, పక్షపాత వైఖరితో వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఐదుగురు పోలీసు అధికారులను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ముగింపు రోజున ముఖ్యమంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు.

## ఫిన్లాండ్‌లో పర్యటించిన ప్రతినిధులతో రేపు సిఎం ప్రత్యేక సమావేశం

### హెడ్మాస్టర్లతోపాటు పాఠశాల విద్య డైరెక్టర్ హాజరు

### ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో మీటింగ్ ఏర్పాటు

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రేపు(మంగళ వారం) పాఠశాలకు చెందిన హెడ్మాస్టర్లతోపాటు ఎంఈవో, డీఈవో, ఆర్‌జేడీ, అడిషనల్ డైరెక్టర్స్, పాఠశాల విద్య డైరెక్టర్‌తో సమావేశం నిర్వహించనున్నారు. సమావేశానికి ప్రత్యేకంగా ఫిన్లాండ్‌లో పర్యటించిన ప్రతినిధులను ఆహ్వానించనున్నారు. మంగళవారం ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం కానుంది. సమావేశంలో ఫిన్లాండ్ పర్యటన ప్రతినిధి బృందాలతో సంప్రదింపులు, మండల విద్యాధికారులు(ఎంఈవోలు), ప్రధానోపాధ్యాయులు/ప్రిన్సిపాల్‌లతోపాటు జిల్లా విద్యాధికారులు(డీఈవో) పాఠశాల విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులందరి(ఆర్‌జేడీ)లు సమావేశంలో పాల్గొననున్నారు.

పాఠశాల విద్యా శాఖ సమగ్ర శిక్షకు చెందిన విభాగాధిపతులు, అదనపు డైరెక్టర్లు, జాయింట్ డైరెక్టర్లు, హైదరాబాద్, వరంగల్ పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, 33 మంది జిల్లా విద్యాధికారులందరూ, సమగ్ర శిక్షకు చెందిన 33 మంది జిల్లా నాణ్యతా సమన్వయకర్తలు, ఫిన్లాండ్ ఎక్స్‌పోజర్ విజిట్‌లోని ప్రతినిధులందరూ సమావేశంలో పాల్గొననున్నారు.

## మానసిక లోపాల చిన్నారులతో బాధ్యతగా వ్యవహరించాలి

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** మానసిక ఎదుగుదల లోపాలతో బాధపడుతున్న చిన్నారుల విషయంలో తల్లిదండ్రులతో పాటు, సమాజం కూడా బాధ్యతగా వ్యవహరించాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహా అన్నారు. ఆదివారం ఉదయం హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో.. సాధన ఇన్స్టిట్యూట్ ఫర్ ది ఇంటెలెక్చువల్లీ ఛాలెంజ్ (సాధన ఫౌండేషన్)కు చెందిన మానసిక దివ్యాంగులైన చిన్నారులతో కలిసి సంస్థ ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పిల్లలతో మంత్రి ఎంతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి అభిరుచులు, దైనందిన కార్యకలాపాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో కలిసి నవ్వుతూ, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు. 1996 నుంచి మెంటల్లీ చాలెంజ్‌డ్ పిల్లల కోసం ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, వృత్తి శిక్షణ, పునరావాస సేవలు అందిస్తున్నామని సంస్థ నిర్వాహకులు మంత్రికి వివరించారు. సంస్థ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించగా, మంత్రి సానుకూలంగా స్పందించారు. అవసరమైన సహకారాన్ని అందించి, అండగా నిలుస్తామని మంత్రి సంస్థ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. పిల్లలకు సేవ చేస్తున్న సంస్థ నిర్వాహకులను అభినందించారు.

## రామచందర్‌రావు ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

### మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సాకుగా చూపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ముందుగా కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పాలని రవాణా, బీసీ సంక్షేమం శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఒక్కరోజులో ఏర్పడినవి కావని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే భారీగా పేరుకుపోయిన వారసత్వ సమస్య అని ఆయన గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు బకాయిలు పెడుతున్న సమయంలో రామచంద్రరావు ఎందుకు మౌనం వహించారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. ఇపుడు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ, దేశంలో తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడ ఈ పథకాన్ని అమలు చేస్తుందో స్పష్టం చేయాలని మంత్రి సవాల్ విసిరారు. విద్యార్థుల సంక్షేమంపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయాలని, కనీసం రాష్ట్రాలపై ఉన్న ఆర్థిక భారాన్ని పంచుకుంటూ కేంద్రం కూడా తన వంతు నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశ యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే కనీస వయస్సును 21 సంవత్సరాలకు తగ్గించాలని చేసిన ప్రతిపాదన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందన్నారు. ఈ అంశంపై సమాధానం చెప్పకుండా దృష్టి మళ్లించేందుకే బీజేపీ నాయకులు ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు.

## ఆగస్టు 15లోగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి టిఎస్‌టిసిఇఎ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, మైనారిటీ విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఆగస్టు 15 లోపు విడుదల చేయాలని తెలంగాణ స్కూల్ టెక్నికల్ కాలేజెస్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టిఎస్‌టిసిఈఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆదివారం మెయిల్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రదాన కార్యదర్శికి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌కి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అయినేని సంతోష్ కుమార్ లేఖలుపంపించినట్టు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఆగస్టు 15లోపు చెల్లించాలని, లేనిపక్షంలో సెక్రటేరియట్ ముందు ఢిల్లీ తరహాలో మెరుపు ధర్నాకు దిగాల్సి వస్తుందన్నారు. ఉద్యోగులకు నెలవారీగా ఏడవ వేతన జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో గత మూడేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందన్నారు. సుమారు రూ.8 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని వాటిని విడుదల చేయకుండా నిరక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం స్పందించాలన్నారు.

## టేకుమట్ల రాతి వంతెనను వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి

### మంత్రి కోమటిరెడ్డికి డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త :** సూర్యాపేట జిల్లా టేకుమట్ల గ్రామ సమీపంలో మూసీ నదిపై ఉన్న చారిత్రక నిజాంకాలం నాటి రాతి వంతెనను అత్యవసరంగా పరిరక్షించి, పునర్వినియోగం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయి వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేదకుమార్ మణికొండ సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65)పై ఉన్న ఈ చారిత్రక రాతి వంతెన నిజాం పాలనా కాలంలో పూర్తిగా చెక్కిన రాతితో నిర్మించబడిన అపూర్వ ఇంజనీరింగ్ కట్టడమని ఆయన తెలిపారు. సుమారు 370 మీటర్ల పొడవు, 73 రాతి ఆర్చీలతో నిర్మితమైన ఈ వంతెన చారిత్రక, సాంకేతిక మరియు వారసత్వ పరంగా విశేష ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. 1948లో జరిగిన ఆపరేషన్ పోలో సమయంలో ఈ వంతెనకు సంబంధించిన చారిత్రక సంఘటనలు దీనికి మరింత జాతీయ ప్రాముఖ్యతను తీసుకొచ్చాయని పేర్కొన్నారు. కొత్త జాతీయ రహదారి వంతెన నిర్మాణం అనంతరం ఈ చారిత్రక కట్టడం పూర్తిగా నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## మన సైన్యం అజేయ ధైర్యానికి ప్రతీక కార్గిల్ విజయ్ దివస్



ఆదివారం హైదరాబాద్‌లో పెరేడ్‌గ్రౌండ్స్‌లోని వీరసైనిక స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై26:** కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఆదివారం హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లోని వీర సైనిక స్మారక స్థూపం వద్ద బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్గిల్ విజయ్‌దివస్ భారత సైన్యం అజేయ ధైర్యానికి, అసమాన పరాక్రమానికి, చెక్కు చెదరని సంకల్పానికి, దేశం పట్ల ఉన్న అత్యు న్నత అంకిత భావానికి ప్రతీక అని పేర్కొన్నారు. కార్గిల్ లోని దుర్భే ద్యమైన శిఖరాలపై మన వీర జవాన్లు అసాధారణ శౌర్యాన్ని ప్రదర్శించి, త్రివర్ణ పతాక గౌరవాన్ని, దేశ ప్రతిష్ఠను కాపాడుతూ భారత చరిత్రలో సువర్ణాధ్యా యాన్ని లిఖించారని అన్నారు. మాతృభూమి రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర జవాన్లకు వినమ్ర నివాళులు అర్పిస్తున్నామని, దేశ సరిహద్దులను అహర్నిశలు కాపాడుతున్న భారత సైనికులందరికీ శిరసు వంచి వందనం చేస్తున్నామని తెలిపారు. మన వీరపుత్రుల త్యాగం, అమరత్వం, దేశం పట్ల వారి అపూర్వ అంకితభావం ప్రతి భారతీయుడిలో, ముఖ్యంగా యువతలో, దేశభక్తిని, జాతీయ సేవాభావాన్ని తరతరాలకు ప్రేరేపిస్తూనే ఉంటుందని రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వన్ ర్యాంక్ - వన్ పెన్షన్ కమిషన్ మాజీ చైర్మన్ ఎల్. నర్సింహారెడ్డి కూడా పాల్గొన్నారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో సైనికుల పెన్షన్లకు సంబం ధించిన దీర్ఘకాల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించడం చారిత్రాత్మక నిర్ణయ మని గుర్తు చేశారు.

సైనికుల త్యాగాలు దేశం ఎన్నటికీ మరువలేనివని, దేశ సరిహద్దులను కాపాడుతూ ప్రాణత్యాగం చేసిన వీరుల జీవితం నేటి యువ తకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశ భద్రత, సమగ్రతను కాపాడుకోవా లంటే యువతలో దేశభక్తి, జాతీయ చైతన్యం మరింత పెరగాలని, దేశాన్ని సురక్షితంగా కాపాడే బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

## దివ్యాంగ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

### సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** దివ్యాంగుల ఉద్యోగులు సమస్యలు పరిష్కారం చేస్తానని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. వికలాంగుల, వికలాంగుల ఉద్యోగులు ఆత్మ బంధువు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. ఆదివారం గాంధీభవన్‌లోని ప్రకాశంహాల్‌లో తెలంగాణ వికలాంగుల ఉద్యోగులు కృతజ్ఞత సభ జరిగింది. సభకు ముఖ్యఅతిధులుగా వికలాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, తెలంగాణ దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ .. అన్ని శాఖల పనులు మీరే చూసుకోవాలని సీఎం చెప్పడం చాలా సంతోషమన్నారు. ఒక మంచి మనసున్న మహారాజు మన ముఖ్యమంత్రి అని, తాను విప్ అయిన కొన్ని రోజులకే మంత్రిగా అవకాశం ఇస్తూ వికలాంగుల శాఖ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. వికలాంగులకు సంబంధించిన అన్ని పెండింగ్ పనులను సీఎంతో మాట్లాడి, సమస్యలను 100 శాతం నెరవేరుస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఒక వ్యక్తి లేకుంటే మీరు బయటకు రాలేని పరిస్థితి అని, మీ కష్టం నాకు తెలుసునని, నాకు వినతులు ఇచ్చారు, వాటిని ఖచ్చితంగా నెరవేరుస్తానని మంత్రి తెలిపారు. మీకు సంక్షేమ భవన్ కట్టిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. వికలాంగుల స్థానిక సంస్థలలో, మునిసిపల్స్‌లలో కో అప్షన్ కోసం క్యాబినెట్‌లో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని త్వరలోనే కో ఆప్షన్ మెంబర్ వికలాంగుల కోసం ప్రయత్నం చేస్తానని, ఇందిరమ్మ ఇండ్ల లో రిజర్వేషన్ కోసం మాట్లాడతానని తెలిపారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికలాంగుల పెద్దన్నగా, ఆత్మ బంధువుగా వికలాంగుల ఉద్యోగుల సంక్షేమంలో ముందడుగు వేశారని, ఇప్పటికే జీవో నంబర్ 34 ఇచ్చి వికలాంగుల ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. జీవో ప్రకారం 70శాతం పైనా వైకల్యమున్నా వారికి ట్రాన్స్ ఫర్ ఉండదని, ప్రమోషన్ పొందే సమయంలో ఉన్న చోటనే లేదంటే దగ్గర స్థానంలో ప్రమోషన్ ఇస్తున్నామన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం రోజున ఆన్‌డ్యూటీ సౌకర్యం ఇచ్చి వికలాంగుల ఆత్మ గౌరవం నిలబెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వేల వేల ధన్యవాదములన్నారు. ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబీబ్‌మియా, రాష్ట్ర ప్రధానకార్యదర్శి చీరబోయిన లక్ష్మయ్య ..మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయాంలో తమను తీవ్ర నిరక్ష్యం చేశారని, కానీ నేటి ప్రజా పాలన ప్రభుత్వంలో ఒక్కో సమస్యను పరిష్కారం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కి ప్రత్యేకించి మా వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యకి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధికి యత్నం

### బిజెపి ఎంపి డికె అరుణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 26:** నీట్ పరీక్ష అంశంపై కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని బీజేపీ ఎంపీ డీకే అరుణ ఆరోపించారు. విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, ఆప్ విద్యార్థులను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష పేరుతో కొందరు ఉద్దేశపూర్వకంగా దేశంలో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నడూ పేపర్ లీక్ జరగనట్లు ఇప్పుడు వ్యవహరిస్తూ రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని ఇబ్బందుల్లోకి నెట్టేందుకు కుట్రపూరితంగా ఈ అంశాన్ని రాజకీయ రంగంలోకి తీసుకొచ్చారని పేర్కొన్నారు.

దేశాన్ని అస్థిరపరిచే లక్ష్యంతోనే ఈ ప్రచారం సాగుతోందని ఆమె ఆరోపించారు. కేంద్రం తలుచు కుంటే రేవంత్ ఒక్కరోజు సీఎం కుర్చీలో ఉండరు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల అవినీతి చిట్టా మా దగ్గర ఉంది. అమాయక విద్యార్థులను రెచ్చగొట్టి పబ్బం గడపటం రాహుల్‌కు అలవాటు. కేంద్రం సహకారం లేకుండా.. రాష్ట్ర ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు.

## దేశం గర్వించదగిన వ్యక్తి డాక్టర్ సతీష్‌రెడ్డి

### 'ఎమెస్కో-డాక్టర్ బివి పట్టాభిరామ్ ఛేంజ్ మేకర్-2026' అవార్డు కార్యక్రమంలో చిరంజీవి

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 26, ప్రభాతవార్త:** భారతదేశం గర్వించదగ్గ వ్యక్తి డీఆర్‌డీఓ మాజీ ఛైర్మన్, నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యులు, ప్రముక రక్షణరంగ శాస్త్రవేత్త డాక్టర్ గుండ్ర సతీష్‌రెడ్డి అని సినీనటుడు చిరంజీవి అన్నారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో ఆదివారం 'ఎమెస్కో-డాక్టర్ బివి పట్టాభిరామ్ ఛేంజ్ మేకర్-2026 అవార్డును సినీనటుడు చిరంజీవి చేతుల మీదుగా ప్రధానం చేశారు. బివి పట్టాభిరామ్ ప్రథమవర్ధంతిని పురస్కరించుకొని వివిధ రంగాల్లో అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్న వారికి ఈ అవార్డులను అందిస్తున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. మానసిక రుగ్మతలను దూరం పెట్టి, కుటుంబాలను నిలబెట్టిన మహనీయుడు బివి పట్టాభిరాం అన్నారు. ఆయన జ్ఞాపకంగా దేశానికి రక్షణ కల్పించి, రక్షణ కవచాన్ని అందించి అత్యంత ఎత్తైన స్థాయికి చేరుకున్న తెలుగుబిడ్డ సతీష్‌రెడ్డికి అందించడం గర్వకారణమన్నారు. వ్యక్తిత్వాన్ని ఎలా మార్చుకోవాలో డాక్టర్ పట్టాభిరామ్ ద్వారా తాను తెలుసుకున్నానని అన్నారు. ఆయన చెప్పిన అయిదు 'డ్లు తన జీవితంలోనూ అన్వయించుకున్నానని అన్నారు. ఆయన పుస్తకాలు సరళమైన భాషలో ఉంటాయన్నారు. సాధారణ రైతు కుటుంబంలో జన్మించి ఆరో తరగతి వరకు ఎలక్ట్రిక్ లైట్ లేని ఊరిలో చదివి తల్లి కోరికను నెరవేర్చిన సతీష్‌రెడ్డి ప్రతిభ అసమా న్యమైందన్నారు. ఆయన అందించిన సేవలు రాష్ట్రానికి, తెలుగు వాళ్లకే కాదు.. దేశానికి తలమానికమని అన్నారు. అందుకే ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో ఫెలోషిప్‌లు, అవార్డులు సొంతమయ్యాయన్నారు. అగ్ని నుంచి రుద్రం వరకు బాలిస్టిక్ మిషన్స్ నుంచి శక్తి మిషన్స్ వరకు ఆయన అందించిన సాంకేతికత అద్భుత మన్నారు. ఆయన చేసిన కృషి, సాంకేతికత మూలంగా భారత్ నాల్గో స్థానంలో ఉందన్నారు.



పుస్తకావిష్కరణలో చిరంజీవి, సత్యకుమార్, జయాపట్టాభిరామ్, కెవిపి రామచందర్‌రావు, కె.రామచంద్రమూర్తి, విజయ్‌కుమార్, సతీష్‌రెడ్డి, పద్మసతీష్‌రెడ్డి తదితరులు

ఏపీ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ బళ్లారిలో పీయూసీ చదివే సమయంలో చిరంజీవి నటించిన కిరాతకుడు, దొంగమొగుడు సినిమాలకు స్టార్‌లు కట్టానని గుర్తుచేశారు. డాక్టర్ సతీష్‌రెడ్డి ప్రపంచ దేశాలు గుర్తించడమే కాకుండా దేశంలోని విశ్వవిద్యా లయాల నుంచి దాదాపు 25 డాక్టరేట్లు సాధిం చారన్నారు. ఆయన సేవలకు ఈ అవార్డు ఇవ్వడం ఆయన రంగానికే కాకుండా తెలుగు ప్రజలకు ఇది గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఎడిటర్ రామచంద్ర మూర్తి, మాజీ రాజ్యసభ సభ్యులు కేవీపీ రామచందర్‌రావు, బివి పట్టాభిరాం సతీమణి జయాపట్టాభిరాం, ఎమెస్కో విజయ్‌కుమార్‌తో పాటు పలువురు న్యాయ మూర్తులు, మాజీ న్యాయమూర్తులు, ప్రస్తుత మాజీ ఐపీఎస్, ఐఏఎస్‌లు, వైద్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డిపై రూపొందించిన పుస్తకాన్ని సైతం ఇక్కడ ఆవిష్కరించారు. డాక్టర్ సతీష్‌రెడ్డితోపాటు ఆయన సతీమణి పద్మ సతీష్‌రెడ్డిని ఇక్కడ సత్కరించారు.

## దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో ముగిసిన ఫీజు చెల్లింపు గడువు

### నేటి వరకు ఆప్షన్లకు అవకాశం.. 30న సీట్ల కేటాయింపు

### మూడు విడతల్లో సీట్ల కేటాయింపు పూర్తి

### ఇప్పటివరకు 1,41,143 మంది చేరిక

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) పేరుతో డిగ్రీలో అడ్మిషన్లు చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో అడ్మిషన్ల షెడ్యూల్‌ను జారీ చేసి సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. ఈ నెల 16న స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల కోసం షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. స్పెషల్ ఫేజ్‌లో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు రూ. 400తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. ఈ నెల 20 నుంచి నేటి (సోమవారం-27) వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. నేడు స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నారు. ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ రిపోర్ట్ చేసిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి ఆగస్టు 1 వరకు ఆయా కాలేజీల్లో చేరాలి. మూడు విడతల్లో డిగ్రీ అడ్మిషన్ల కేటాయింపు చేశారు. ఇప్పటి వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తే రాష్ట్రంలో 1,41,143 మంది డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరారు. ఇంకా రాష్ట్రంలో 2,96,66 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 929 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,37,809 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1.41,143 మంది మాత్రమే చేరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించిన దోస్త్ అడ్మిషన్ల లెక్కల ప్రకారం రాష్ట్రంలో 780 డిగ్రీ కాలేజీల్లో 3,71,919 సీట్లు ఉండగా వాటిలో 1,19,016 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. వివిధ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న 79 సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 23,834 సీట్లు అందుబాటులో ఉంటే అందులో 9,271 సీట్లు భర్తీ అయ్యాయి. నాన్ దోస్త్ విధానంలో అడ్మిషన్లు తీసుకుంటున్న 70 కాలేజీల్లో 42,056 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 12,856 సీట్లను భర్తీ అయ్యాయి. స్వయంప్రతిపత్తి(అటానమస్) హోదా కలిగిన 36 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 45,120 సీట్లు ఉంటే అందులో 27,434 సీట్లు భర్తీ అయ్యాయి. అటానమస్ కాకుండా ఉన్న 116 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 50,940 సీట్లు అందుబటులో ఉంటే వాటిలో కేవలం 19,389 సీట్లు భర్తీ కాగా ఇంకా 31,551 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఉన్న సీట్లలో కేవలం 43 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 580 ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 2,48,330 సీట్లు ఉంటే వాటిలో కేవలం 59,615 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 1,88,715 సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి.

## వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తనిఖీలు

### గిట్టుబాటు ధరలు కల్పించడమే లక్ష్యం

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్ది రైతులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో వీటి వివరాలను తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ యార్డుల పనితీరును సమగ్రంగా పరిశీలించేందుకు ఆరు (6) ప్రత్యేక తనిఖీ బృందాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ బృందాలు వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకుల నియంత్రణలో పనిచేస్తూ రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీలను ఈ వారం తనిఖీ చేయనున్నాయని పేర్కొన్నారు. మార్కెట్ యార్డుల పరిపాలన, రైతులకు అందుతున్న సేవలు, మార్కెట్ నిర్వహణ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ ఆదాయ పరిరక్షణ తదితర అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించనున్నాయని చెప్పారు. తనిఖీలలో ముఖ్యంగా రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కనీస మద్దతు ధరకు కొనుగోలులో ఉన్న లోపాలు, ఇబ్బందులు, ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితుల కారణాలు, మార్కెట్ సెస్ ఎగవేతను నివారించే చర్యలు, మార్కెట్ యార్డుల పరిపాలన, మౌలిక సదుపాయాలు, సేవలపై సూచనలు, డిజిటల్ సేవలు, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ మార్గదర్శకాల అమలును పరిశీలించడం వంటి వాటిని ఈ బృందాలు ప్రతి వారం తనిఖీ చేసి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించుతాయన్నారు.

## 68 లక్షల ఎకరాలకు చేరిన ఖరీఫ్

### అన్ని పంటలూ 51.69 శాతం నమోదు

### వరి 11 లక్షల ఎకరాలకే పరిమితం

### 92.16 శాతం మేర 44 లక్షల ఎకరాల్లో సాగైన పత్తి

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకూ అన్ని పంటలూ కలిపి 51.69 శాతం మేర 68,43,435 ఎకరాల్లో సాగయ్యాయి. గత ఏడాది ఇదే సీజన్‌లో సాగైన పంటల కంటే దాదాపు లక్ష ఎకరాల్లో ఈ సారి ఎక్కువ వేయడం గమనార్హం. ఈ ఖరీఫ్‌లో సాగైన పంటల్లో 16.71 శాతం మేర 11,02,229 ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు పడ్డాయి. అయితే పత్తి మాత్రం 92.16 శాతం చొప్పున 43,70,029 ఎకరాల్లో సాగు చేయడం విశేషం. ఇది గత ఏడాది కంటే 3 లక్షల ఎకరాలకు పైగా ఎక్కువ. అనేక ప్రాంతాల్లో వర్షపాతం లోటు, వేగంగా తగ్గిపోతున్న భూగర్భ జలమట్టాల కారణంగా వ్యవసాయ కార్యకలాపాలు మందకొడిగా సాగుతున్నాయని వ్యవసాయ శాఖ వెల్లడించింది. తాజా సమాచారం ప్రకారం, రాష్ట్రంలో ఈ సీజనులో ఇప్పటి వరకూ సాధారణ వర్షపాతం 287.6 మి.మీ. కాగా, సగటు వర్షపాతం 217.4 మి.మీ.గా నమోదైంది. మొత్తం 5.80 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంలో 97.11 శాతంతో ఆదిలాబాద్ అన్ని జిల్లాల్లోనూ అగ్రస్థానంలో ఉండగా, సూర్యాపేట ఇప్పటివరకు కేవలం 15.58 శాతం సాగు విస్తీర్ణంలోనే ఉంది. రాష్ట్రంలోని మొత్తం 1.33 కోట్ల ఎకరాల సాగు విస్తీర్ణంలో ఇది కేవలం 51.69 శాతం మాత్రమే. నీటిపారుదల సంక్షోభంపై ప్రభుత్వం ఇప్పటికే అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించినందున, ఖరీఫ్ సీజన్‌లో పప్పుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగు తుందని, ప్రధాన పంట అయిన వరి సాగు తగ్గే అవకాశం ఉందని అంచనా.



జిఓ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసి ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించిన దృశ్యం

## జిఓ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

### 15లోపు పరిష్కరించకుంటే సెప్టెంబరులో ఆందోళనలు

**హైదరాబాద్ (చిక్కడపల్లి) జులై 26, ప్రభాతవార్త :** జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ కార్యాచరణపై నిపుణుల సూచనల కోసం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీవో 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన ఉద్యోగ ప్రతినిధులు, జేఏసీ నాయకులు, నిపుణులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీవో 317 బాధిత జేఏసీ అధ్యక్షుడు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా, పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో జీవో 317 బాధితులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం స్పౌజ్, మెడికల్ కేటగిరీలకు మాత్రమే న్యాయం చేసి, జీవో 317 వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్న అందరికీ న్యాయం చేసినట్లు గద్వాల సభలో ప్రకటించడం విచారకరమన్నారు. అధికారులు, మంత్రులు ఇచ్చిన తప్పుడు సమాచారంతో ముఖ్యమంత్రి వాస్తవ పరిస్థితిని తెలుసుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. జేఏసీ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. జీవో 317 అంశంపై ముఖ్యమంత్రి స్వయంగా దృష్టి సారిస్తే బాధితులందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. తాత్కాలిక ఉపశమనం పేరుతో తీసుకొచ్చిన జీవో 190 అమలై పది నెలలు పూర్తవుతున్నా పూర్తి స్థాయిలో అమలు కాలేదని ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కన్వీనర్ బాలప్రసాద్ తెలిపారు. జీవో 317 బాధితులకు న్యాయం చేయడం ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం కాని అంశమని పాలిటెక్నిక్ ఎడ్యుకేషన్ కన్వీనర్ సందీప్ అన్నారు. జీవో 317 కారణంగా మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని మహిళా నాయకురాలు వినోద డిమాండ్ చేశారు. సమావేశంలో వివిధ శాఖల నాయకులు, మేధావులతో చర్చించి తీసుకున్న నిర్ణయాలను జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్ రావు వెల్లడించారు. ఆగస్టు 15లోపు సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు డీస్‌లొకేటెడ్, నాన్ డీస్‌లొకేటెడ్ అనే తేడా లేకుండా జీవో 317 బాధితులందరినీ వారు కోరుకున్న జిల్లా లేదా జోన్‌లకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సర్వే డిపార్ట్‌మెంట్ కన్వీనర్ శ్రీకాంత్, గోవర్ధన్, సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## హెల్త్ కార్డులను వెంటనే అమలు చేయాలి

### ప్రభుత్వానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు వెంటనే హెల్త్ కార్డులను అమలు చేయాలి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్, ప్రధానకార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హెల్త్ కార్డ్స్ జారీ చేయక ముందే, ముందస్తుగా ఉపాధ్యాయ ఉద్యోగుల నుండి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా, హెల్త్ కార్డులకు సంబంధించిన ప్రీమియంను, ఉపాధ్యాయుల జీతభత్యాలనుండి తగ్గింపు చేసి తీసుకుందన్నారు. ఇప్పటికి మూడు నెలలు గడిచిన, ఇప్పటివరకు హెల్త్ కార్డ్స్ జారీ చేయలేకపోవడం అన్యాయమన్నారు. జారీ అయిన పాత హెల్త్ కార్డులు ఏవైనా ఉంటే అవి హాస్పిటల్‌లో పనిచేయకపోవడం, దానికి సంబంధించిన విధివిధానాలు ప్రకటించకపోవడం, ఉపాధ్యాయ ఉద్యోగ లోకాన్ని నిరాశకు గురి చేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ,ఉద్యోగ ఉపాధ్యాయుల నుండి తీసుకున్న ప్రీమియంకుగాను అన్ని హాస్పిటల్‌లో, అన్నిరకాల వైద్యానికి సంబంధించిన, చికిత్సకు పరిమితి లేకుండా, వైద్య సౌకర్యం కల్పించాలని వోడ్నాల రాజశేఖర్, తెల్కలపల్లి పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఆదివారం హైదరాబాద్‌లో బాలకృష్ణను పరామర్శిస్తున్న ఏపి సిఎం చంద్రబాబు

## హీరో బాలకృష్ణను పరామర్శించిన ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

**హైదరాబాద్ (గచ్చిబౌలి), జులై 26, ప్రభాతవార్త:** సినిమా షూటింగ్‌లో గాయపడి, మోకాలి శస్త్రచికిత్స చేయించుకొని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టాలీవుడ్ అగ్రనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణను ఆదివారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పరామర్శించారు. తన బావమరిది బాలకృష్ణకు శ స్త్రచికిత్స జరిగిన విషయం తెలుసుకున్న చంద్రబాబునాయుడు ఆది వారం గచ్చిబౌలి ఏఐజీ ఆసుపత్రికి వచ్చారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతోపాటు బాలకృష్ణకు నిర్వహించిన శస్త్రచికిత్సపై డాక్టర్లను అడిగి వివరాలు తెలుసుకున్నారు. టాలీవుడ్ అగ్రహీరో నందమూరి బాలకృష్ణ హీరోగా గోపిచంద్ మలినేని దర్శ కత్వంలో తెరకెక్కుతున్న సినిమా షూటింగ్ కొన్నిరోజుల క్రితం రాజమండ్రిలో నిర్వహించారు. ఈ సినిమా షూటింగ్ సందర్భంగా ఈ నెల 21న చోటుచేసుకున్న స్వల్పప్రమాదంలో హీరో బాలకృష్ణ గాయపడ్డారు. దీంతో రాజమండ్రిలో ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం ఎయిర్ అంబులెన్స్ ద్వారా ఆయనను నగరంలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ఏఐజీ ఆసుపత్రి వైద్యులు మొదట చిన్న గాయంగా భావించినా, బాలకృష్ణ ఎడుమ మోకాలు వాపురావడం, పరీక్షల్లో కాలి క్వాడ్రిసెప్స్ టెండన్ చిరిగిందని, కణజలాలు సైతం దెబ్బతిని రక్తం గడ్డకట్టిందని గుర్తించారు. దీంతో బాలకృష్ణ కాలికి శస్త్రచికిత్స అనివార్యమైంది. ఈ మేరకు ఈనెల 23న ఏఐజీ ఆసుపత్రి వైద్యుల బ ృందం బాలకృష్ణ కాలికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వ హించారు. అప్పటి నుంచి బాలకృష్ణ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ కోలుకుంటున్నారు.

## యాదవులు లేనిదే చరిత్ర లేదు

### మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై26:**యాదవులు లేనిదే చరిత్ర లేదని బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆదివారం విజయవాడలో యాదవ సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ శ్రీ కృష్ణుడి వారసులం... నీతి నిజాయితీకి మారుపేరు యాదవులు అని పేర్కొన్నారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మొదట తెరిచేది కూడా మన గొల్లవారేనని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో కూడా పెద్ద సంఖ్య లో జనాభా కలిగిన బలమైన సామాజిక వర్గం అని పేర్కొన్నారు. యాదవులంతా ఐక్యంగా ఉంటేనే అభివృద్ధి సాధిస్తాం,ఎవరి దయా దాక్షిణ్యాల కోసం ఎదురు చూడాల్సిన అవసరం ఉండదన్నారు. రాజకీయంగా ఏ పార్టీలో ఉన్నా, జాతి విషయానికి వచ్చే సరికి మనమంతా ఒక్కటిగా ఉండాలని చెప్పారు.కుల దైవమైన శ్రీ కృష్ణుడి జన్మదినం కృష్ణాష్టమి ని ఘనంగా నిర్వహించాలని, మీకు ఏ అవసరమొచ్చినా నేను ఉన్నానని గుర్తు పెట్టుకోండి..నా పూర్తి అండదండలు ఉంటాయన్నారు. అంతకు ముందు విజయవాడలో లోని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మను కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఆయనకు వేద మంత్రాలతో ఆలయ పండితులు ఆశీర్వచనం అందించారు.



ఎంపి బిప్లవ్‌కుమార్‌దేవ్ కుటుంబాన్ని సన్మానిస్తున్న త్రిదండి చినజీయర్‌స్వామి

## సమతామూర్తిని దర్శించుకున్న త్రిపుర బిజెపి ఎంపి బిప్లవ్‌కుమార్‌దేవ్

**శంషాబాద్, జులై 26, ప్రభాతవార్త :** శంషాబాద్ సమీపంలోని ముచ్చిం తల్‌లో సమతామూర్తి (స్టాట్యూడ్ ఆఫ్ ఈక్వాలిటీ)ని త్రిపుర మాజీ ముఖ్యమంత్రి, బిజెపి ఎంపి బిప్లవ్‌కుమార్‌దేవ్ కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. భగవద్రామానుజాచార్యుల పవిత్ర దివ్యమూర్తిని కుటుంబంతోసహా దర్శిం చుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు, సమా జంలో సమత, సిద్ధాంతాలను పెంపొందించేందుకు రామానుజుల వారి బోధనలు ఎంతో దివ్యమైనవని కొనియాడారు. అనంతరం త్రిదండి చినజీయర్ స్వామివారిని బిప్లవ్‌దేవ్ దంపతులు, కుటుంబసభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా స్వామివారు మంగళా శాసనాలు చేసారు ఆధ్యాత్మిక, సామాజిక సేవాకార్యక్రమాలను ఈ సందర్భంగా జీయర్‌స్వామివారి ద్వారా బిప్లవ్ కుమార్‌దేవ్ అడిగి తెలుసుకున్నారు. సమతామూర్తి ప్రాంగణంలోని 108 దివ్యదేశాల ఆలయాలు, ప్రాంగణ విశేషాలను కుటుంబంతో కలిసి తిలకించి తన సంతోషాన్ని వ్యక్తం చేసిన ఆయన, భారతీయ సంస్కృతి, సనాతనధర్మ వ్యాప్తికి చినజీయర్ స్వామివారు చేస్తున్న సేవలకు అభినందనీ యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మైహోమ్ గ్రూప్ ఛైర్మన్ జూపల్లి జగపతిరావు, ఆశ్రమ ప్రతినిధులు, ఇతర ముఖ్యప్రముఖులు పాల్గొన్నారు.

## వారంలో 437 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు నగదురహిత చికిత్సలు

### రూ.1.14 కోట్ల విలువ.. ప్రకటించిన ఇహెచ్‌సిటి

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కొత్తగా ప్రారంభించిన హెల్త్ స్కీమ్‌లో వారం రోజుల్లో 437 మంది ఉద్యోగులు, పెన్షనర్లు నగదు రహిత చికిత్సలను పొందినట్టు ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ట్రస్ట్(ఈహెచ్‌సీటీ) ప్రకటించింది. ఈహెచ్‌ఎస్ పథకాన్ని ఈ నెల 17న ప్రారంభమైందని, ప్రారంభమైన మొదటి వారంలోనే ఈ నెల 18 నుంచి 25 వరకు రాష్ట్రంలోని 17 జిల్లాల్లోని 153 ఆసుపత్రులు ఈ పథకం కింద రోగులకు చికిత్స అందించడంతో పాటు క్లైయిమ్‌ల ప్రక్రియను కూడా చేపట్టినట్టు ఈహెచ్‌సీటీ ప్రకటించింది. వారంలో, 184 మంది ఉద్యోగులకు రూ.40,42,786 విలువైన నగదు రహిత చికిత్సను, 253 మంది పెన్షనర్లకు రూ.73,70,035 విలువైన చికిత్సను పొందారని తెలిపారు.

ఒక వారంలో 437 మంది ఉద్యోగులు, పెన్షనర్లు రూ. 1,14,12,821 విలువైన నగదు రహిత చికిత్సను పొందినట్టు ట్రస్ట్ ప్రకటించింది. కేవలం హైదరాబాద్ జిల్లాలోనే ఈ పథకం కింద 47 ఆసుపత్రులు రోగులకు చికిత్స అందిస్తున్నాయని, వాటితోపాటు మేడ్చల్‌లో 21, రంగారెడ్డిలో 14, కరీంనగర్‌లో 13, హన్మకొండలో 12 ఆసుపత్రులు ఈ సేవలను అందిస్తున్నాయని ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణ ట్రస్ట్ ప్రకటించింది.

# రుణ వితరణలో నిశ్శబ్ద విప్లవం!



**న్యూఢిల్లీ, జులై 26, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కనీసం రెండు మిలి యన్‌ల గ్రామీణ రైతుల్లో, చిన్న వ్యాపారులలో చైతన్యం నిం పిన రుణ వితరణ సంస్థ అదైనా ఉందంటే అదే జాతీయ చిన్న ఫైనాన్స్ బ్యాంక్. పరిశ్రమల వృద్ధిని సాధ్యం చేస్తుంది. పొదుపు రేట్లను 35 శాతం మెరుగుపరుస్తుంది. గ్రామీణ భార్నతలో చిన్న ఫైనాన్స్ బ్యాంక్ నమూనాను విశ్లేషించడం. అనధికారిక వడ్డీ వ్యాపారుల నుండి నియంత్రిత బ్యాంకింగ్ సంస్థలకు మారడం స్థిరత్వాన్ని సూచిస్తున్నప్పటికీ, గ్రామీణ రుణ చక్రాలు ,సంస్థాగత స్థితిస్థాపకతపై దాని దీర్ఘకాలిక ప్రభావం దృష్ట్యా, జాతీయ ఆర్థిక గమనంలో రెండు మిలియన్ల కుటుంబాలను అధికారిక బ్యాంకింగ్ వ్యవస్థలో ఏకీకృతం చేయడం చెప్పుకోదగిన విశేషమే. ఈ సంస్థలు గ్రామీణలకు చేరువవుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిర్మాణాన్ని మౌలికంగా మార్చడాన్ని నిదర్శనంగా చూడచ్చు దశాబ్దాలుగా, భారత గ్రామీణ రుణరంగం రాయితీ లను కల్పించే ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ , అధిక వడ్డీతో కూడిన అనధికారిక రుణ వ్యవస్థల మధ్య ఊగిసలాడుతోంది. 1970ల నాటి ప్రాధాన్యతా రంగ రుణాల ఆదేశాల అంతరాన్ని పూడ్చడానికి చేసిన చారిత్రక ప్రయత్నాలు, తరచుగా తక్కువ రుణ వసూళ్ల రేట్లు ,విచ్ఛిన్నమైన పంపిణీ మార్గాల వల్ల విఫలమయ్యాయి. నిజానికి ఈ సంస్థలు తక్కువ సేవలు పొందుతున్న వర్గాలకు చిన్న మొత్తాల రుణాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతాయి. ఈ ఆదేశం ప్రకారం, ఈ బ్యాంకులు తమ నికర బ్యాంక్ రుణంలో 75 శాతాన్ని వ్యవసాయం ,సూక్ష్మపరిశ్రమలతో సహా ప్రాధాన్యతా రంగాలకు కేటాయించాలి. ఒక నిర్దిష్ట కార్యాచరణ దృష్టిని తప్పనిసరి చేయడం ద్వారా, నియంత్రణ చట్రం ఈ సంస్థలను సామీప్యఆధారిత బ్యాంకింగ్ నమూనాలను నిర్మించేలా ఒత్తిడి చేస్తుంది. ఈ మార్పు, కుటుంబాలను జాతీయ చెల్లింపుల వ్యవస్థలో ఏకీకృతం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను క్రమబద్ధం చేసే ప్రయత్నాన్ని సూచిస్తుంది, తద్వారా నగదు అధికంగా ఉండే, అనియంత్రిత రుణ మార్కెట్లపై ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. అక్షరాస్యత లేని ప్రాంతాల్లో కనీస విద్యార్హత లేని వారు సైతం ఆ బ్యాంక్ ప్రాంగణం లోకి అడుగుపెట్టగానే ఒక సంతృప్తికర భావన పొందడం ఇక్కడ విశేషం. తన వద్ద ఎలాంటి సంప్రదాయ పూచీకత్తు లేకపోయినా, అధిక దిగుబడినిచ్చే విత్తనాలు , ఒక నీటి పారుదల పంపును కొనుగోలు చేయడానికి అతనికి ఎంతో తేలికగా రుణ సదుపాయం అందింది.

### పంట కోత చక్రానికి సరిపోయే రుణ సౌకర్యాలు

సుదూర గ్రామీణ ప్రాంతాలకు సేవలు అందించడంతో ముడిపడి ఉన్న సగటు కంటే అధిక నిర్వహణ ఖర్చులను నిర్వహిస్తూనే, నిధుల వ్యయాన్ని తక్కువగా ఉంచగల బ్యాంకు సామర్థ్యంపై ఈ రుణ విస్తరణ సుస్థిరత ఆధారపడి ఉంటుంది. ఈ కుటుంబాలలో పొదుపు రేట్లు 35 శాతం పెరిగాయని, ఇది బ్యాంకులకు స్థిరమైన, తక్కువ ఖర్చుతో కూడిన డిపాజిట్ ఆధారాన్ని అందిస్తోందని డేటా సూచిస్తోంది. ఈ డిపాజిట్ సమీకరణ వడ్డీ రేటు అస్థిరతకు వ్యతిరేకంగా ప్రాథమిక రక్షణగా పనిచేస్తుంది. నియంత్రణ సంస్థల పరిశీలన అనేక ప్రధాన బలహీనతలపై కేంద్రీకృతమై ఉంది ఈ రుణాలు ఆదాయాన్నిచ్చే ఆస్తులకు ప్రాధాన్యతనిస్తాయి. కచ్చితమైన నెలవారీ వ్యవధులకు బదులుగా, వ్యవసాయ పంట కోత చక్రానికి సరిపోయేలా తిరిగి చెల్లింపు షెడ్యూళ్లను ప్రత్యేకంగా రూపొందిస్తాయి.

### పంట నష్టాలతో రుణ పరిమితి గందరగోళం!

స్థానిక వాతావరణ సంఘటనలు లేదా పంట నష్టాల వల్ల గ్రామీణ రుణపోర్ట్ ఫోలియోలు దెబ్బతినే అవకాశం ఉందని విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మౌలిక సదుపాయాల ముందస్తు అవసరాలు సమర్థవంతమైన కార్యకలాపాలకు స్థిరమైన ఇంటర్నెట్ కనెక్టివిటీ , విద్యుత్ అవసరం, ఈ రెండూ మారుమూల ప్రాంతాలలో స్థిరంగా ఉండవు. తక్కువ జనసాంద్రత గల గ్రామీణ ప్రాంతాలలో ఉనికిని కొనసాగించడం వలన గణనీయమైన అదనపు ఖర్చులు ఏర్పడతాయి. బ్యాంకులు తరచుగా తక్కువ సిబ్బందిని నియమించడం, స్థానిక థర్డ్‌పార్టీ సేవా ప్రదాతలపై ఎక్కువగా ఆధారపడటం ద్వారా దీనిని సమతుల్యం చేస్తాయి. సూక్ష్మసంస్థలు స్వయం సమృద్ధిని సాధించడంలో విఫలమైతే, తరచుగా, తక్కువ విలువ గల రుణాలపై ఆధారపడటం రుణ ఉచ్చును సృష్టించే ప్రమాదం ఉందని విమర్శకులు వాదిస్తున్నారు.

### పొదుపు రేట్లలో వృద్ధి

ఈ సంస్థలు రుణ పంపిణీదారుల నుండి స్థానిక సంపద నిర్వహణకు కీలక కేంద్రాలుగా మారతాయి. దీర్ఘకాలిక విజయం సాధించాలంటే, బ్యాంకింగ్ కార్యకలాపాలను విస్తృత వ్యవసాయ విధానంతో, ముఖ్యంగా చిన్న తరహా ఉత్పత్తులకు సరఫరా గొలుసు లభ్యత , మార్కెట్ ధరల స్థిరత్వం విషయంలో అనుసంధా నించడం అవసరం.

అటువంటి అనుసంధానం లేకుండా, గ్రామీణ ఉత్పాదకతలో నిర్మా ణాత్మక మార్పులను సాధించడానికి అందించే రుణం సరిపోదు. ప్రస్తుత వ్యవస్థ ఒక పటిష్టమైన పునాదిని అందిస్తుంది, కానీ దాని ప్రభావం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విలక్షణమైన నష్టాలకు ఈ బ్యాంకులు అనుగుణంగా మారగల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. రుణ చెల్లింపు ప్రవర్తనను నిరంతరం పర్యవేక్షించడం, గృహఆదాయ వైవిధ్యీకరణ అనేవి, ఈ కార్యక్రమం దీర్ఘకాలిక ఆర్థిక సమ్మిళితం అనే లక్ష్యం సాధిస్తుందో లేదో నిర్ధారిస్తాయి.

## వర్చువల్ కాదు.. సరిహద్దు గ్రామాలకు వెళ్లి భారతావనిని వీక్షించండి

### యువతకు ప్రధాని మోడీ పిలుపు

**న్యూఢిల్లీ, జులై 26:** వర్చువల్ మాధ్యమాల ద్వారా మాత్రమే దేశాన్ని తెలుసుకోవడం కాకుండా, సరిహద్దు గ్రామాలకు వెళ్లి అక్కడి ప్రజలతో కలిసి జీవిస్తూ భారతదేశాన్ని ప్రత్యక్షంగా వీక్షించాలని యువతకు ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు నిచ్చారు. ఈ లక్ష్యంతోనే వికసిత్ వైబ్రెంట్ విలేజ్ (వివివి) కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు.ఆదివారం వర్చువల్ విధానంలో నిర్వహించిన సమావేశంలో 2026 వికసిత్ వైబ్రెంట్ విలేజ్ కార్యక్రమంలో పాల్గొన్న యువతతో ప్రధాని సంభాషించారు. ఈ కార్య క్రమం కింద లడఖ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరా ఖండ్ రాష్ట్రాల్లోని 74 "వైబ్రెంట్ విలేజ్"లలో యువత పర్యటించి అక్కడి ప్రజల జీవన విధానం, అభివృద్ధి, సంస్కృతి గురించి అవగా హన పొందారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారిలో అధిక సంఖ్యలో జనరేషన్‌జెడ్ యువత ఉండటం విశేషం. ఈ సందర్భంగా ప్రధాని మా ట్లాడుతూ, భారత సరిహద్దు గ్రామాలు అభివృద్ధి పట్ల అపారమైన ఆకాంక్షతో పాటు దేశభక్తికి ప్రతీక లుగా నిలుస్తున్నాయని చెప్పారు. ఆ గ్రామాల ప్రజలు తమ వ్యక్తిగత ప్రయోజనాల కంటే దేశ ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారని పేర్కొన్నారు. వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డైలాగ్ సందర్భంగా తాను యువత ముందుకు ఒక ఆలోచనను తీసుకువచ్చినట్లు మోడీ గుర్తు చేశారు. "వర్చువల్ ప్రపంచంలోనే భారతాన్ని తెలుసుకోవడం కంటే, యువత స్వయంగా గ్రామా లకు వెళ్లి దేశాన్ని చూడాలి. అక్కడి ప్రజలతో మమేకమై జీవించాలి. భారతాన్ని అనుభవించి, అర్థం చేసుకోవాలని సూచించారు. దేశంలోని గ్రామాల్లో అభివృద్ధి పట్ల ఎన్నో ఆశలు, ఆకాంక్షలు ఉన్నాయని, వాటిని ప్రత్యక్షంగా గ్రామాలను సందర్శించినప్పుడే పూర్తిగా అర్థం చేసుకోవచ్చని ఆయన అన్నారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణానికి అభివృద్ధి చెందిన గ్రామాలే పునాది అని ప్రధాని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం సరిహద్దు గ్రామాలను దేశంలోని చివరి గ్రామా లుగా కాకుండా, తొలి గ్రామాలుగా భావిస్తూ వాటి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని తెలి పారు. వికసిత్ వైబ్రెంట్ విలేజ్ యాత్ర యువతను దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలతో, సంస్క ృతితో, నేలతో అనుసంధానించే ఒక గొప్ప వేదికగా మారిందని మోడీ పేర్కొన్నారు. దేశ మట్టితో అను బంధాన్ని పెంపొందించుకోవడం ద్వారా వికసిత్ భారత్ లక్ష్యం మరింత బలపడుతుందని యువతకు ఆయన పిలుపునిచ్చారు.

## వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యం

### బిజెపి డాక్టర్స్ సెల్ సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై26:** వైద్యులు సమాజానికి అందిస్తున్న సేవలు అమూల్యమైనవని, రోగికి చేసే వైద్యం ఒక వ్యక్తికే కాకుండా సమాజానికి, దేశానికి చేసే సేవగా భావించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాం చందర్‌రావు పిలుపునిచ్చారు. బిజెపి డాక్టర్స్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను కేటాయిస్తోంది. జిల్లా ఆసుపత్రు లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖా నలలో అవసరమైన మందులు, పరికరాలు, సిబ్బంది జీతాల వరకు మెజారిటీ నిధులను కేంద్రమే అందిస్తోంది. కోవిడ్ సమయంలో భారత్ బయోటెక్ స్వదేశీ వ్యాక్సిన్ రూపొందిం చడానికి ప్రధాని మోడీ అందించిన ప్రోత్సాహమే కారణమని కొనియాడారు. స్వచ్ఛ భారత్ పరిసరాల పరిశుభ్రతకే కాక స్వస్థ్ భారత్ సాధనకు పునాదిగా నిలిచిందని తెలిపారు. ఖేలో ఇండియా, అంతర్జాతీయ యోగా దినోత్సవం ద్వారా ప్రతిఒక్కరిలో ఆరోగ్యంపై అవగా హన పెరిగిందన్నారు.

సోషల్ మీడియా (వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్)లో వచ్చే అనధికారిక వైద్య సలహాలు, చిట్కాలను నమ్మి ఆరోగ్యం పాడుచేసుకోవద్దని, తప్పనిసరిగా అర్హులైన డాక్టర్ల సలహాలు మాత్రమే పాటించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇజ్రాయెల్ వంటి చిన్న దేశాలు శత్రువుల మధ్య ఉన్నప్పటికీ, జాతీయ భావం, పక్కా పరిశోధనలు, సైనిక శిక్షణ మరియు అధునాతన వైద్య విధానాల వల్ల ప్రపంచంలోనే శక్తివంతంగా ఎదిగాయని గుర్తు చేశారు. సోషలిజం, కమ్యూనిజం, క్యాపిటలిజం కంటే నేషనలిజం (రాష్ట్రీయత) ద్వారానే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షి ంచారు.

## మాటలు కాదు.. జెన్-జీలకు మంత్రి పదవి ఇవ్వండి

### సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జులై 26:** జెన్‌జీల గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు చెప్పడం కాదు, మంత్రి పదవి ఇచ్చి చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ డిమాండ్ చేశారు. జెన్‌జీలకు (21–30 ఏళ్ళ వయసు) ఉన్న వారు చట్ట సభలో అడుగు పెట్టాలని ముఖ్యమంత్రి చెప్పడంపై కేంద్ర హోం మంత్రి బండి సంజయ్ ఆదివారం శంషాబాద్ విమానాశ్రయంలో తనను కలిసిన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తొలుత జెన్‌జీలకు మంత్రి పదవి ఇచ్చి ఆచరణలో చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే ఎంఎల్‌ఏసిలను రాజీనామా చేయించి జెన్ జీలకు ఆ పదవులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

తమరి వద్ద హోం, విద్యా, మున్సిపల్ శాఖలు ఉన్నాయి కాబట్టి ఆ శాఖలను జెన్‌జీలకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. మీ దృష్టిలో జెన్‌జీలంటే విహెచ్, కెకె, కోదండ రెడ్డి అనుకుంటున్నారా? అని ఆయన ప్రశ్నించారు. వృద్ధులకు, వయసు దాటిన పెద్దలకు యూత్ కోటాలో పదవులు ఇవ్వడం కాంగ్రెస్‌కు అలవాటే కదా అని అన్నారు.తమ పార్టీకి దేశం ప్రథమమని, ఆ తర్వాతే పార్టీ అని, చివరగా వ్యక్తి అని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఆ కోణంలోనే ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేశారని ఆయన చెప్పారు.

## విద్యార్థులను రెచ్చగొట్టవద్దు, వారు అగ్గిరవ్వలు: దాసోజు శ్రవణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై26:** గతంలో ఎన్నడూ లేని విధంగా ఢిల్లీలో విద్యార్థి ఉద్యమం జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తెలిపారు. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థి, యువజన విప్లవ జ్వాలను చూశామని అన్నారు. విద్యార్థి ఉద్యమ జ్వాలలు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సునామీలా పాకిందని అన్నారు. విద్యార్థులంతా ఏకం కావడంతో ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయక తప్పలేదని తెలిపారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ.. నీట్ లీకేజీపై విద్యార్థులు పోరాటం చేస్తే బురదజల్లే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. సామాజిక మాధ్యమాల్లో ఉద్యమకారులపై బీజేపీ నేతలు అవకాలు, చవాకులు పేలారని విమర్శించారు. వారిని దేశద్రోహులు అని.. బంగ్లాదేశ్, పాకిస్థాన్ ఫండింగ్ చేస్తోందని చిల్లరగా మాట్లాడారని అన్నారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, నీట్ పేపర్ లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పోరాడారని తెలిపారు.

## స్క్వాష్ వరల్డ్ జూనియర్ ఛాంపియన్‌గా అనాహత్‌సింగ్



**న్యూఢిల్లీ, జులై 26:** భారత యువ క్రీడాకారిణి అనాహత్ సింగ్ అరుదైన ఘనత సాధించి ప్రపంచ వేదికపై దేశ కీర్తి పతాకాన్ని ఎగురవేసింది. కెనడా వేదికగా జరిగిన 2026 వరల్డ్ జూనియర్ స్క్వాష్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో అనాహత్ అద్భుత ప్రదర్శన కనబరిచి చాంపియన్‌గా నిలిచింది. తుది పోరులో ఈజిప్ట్ క్రీడాకారిణి రుకయ్యా సలేమ్‌ను వరుస సెట్లలో ఓడించి స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. మహిళల సింగిల్స్ విభాగంలో జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఆమె 113, 117, 119 తేడాతో ఏకపక్ష విజయం సాధించింది. దీంతో ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో టైటిల్ నెగ్గిన మొట్టమొదటి భారతీయ ప్లేయర్‌గా చరిత్ర పుటల్లో తన పేరు నమోదు చేసుకుంది. కేవలం 18 ఏళ్ల వయసులోనే ఎంతో ప్రతిభ కనబరిచిన అనాహత్ ఆటతీరుపై క్రీడా లోకం ప్రశంసలు కురిపిస్తోంది. గతంలో 2005లో జోష్న చినప్ప ఈ టోర్నీలో రన్నరప్‌గా నిలవడమే ఇప్పటిదాకా భారత్ అత్యుత్తమ ప్రదర్శన. ఇప్పుడు ఆ రికార్డును తిరగరాస్తూ అనాహత్ నేరుగా స్వర్ణం గెలిచి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టింది. వరుస విజయాలతో ఎంతో ఆత్మవిశ్వాసంతో ఆడిన అనాహత్, తన సత్తా ఏంటో చాటి చెప్పింది. ఈ విజయంతో జూనియర్ స్క్వాష్ పోటీల్లో దాదాపు 15 యేళ్లుగా కొనసాగుతున్న ఈజిప్ట్ దేశ ఆధిప త్యానికి అనాహత్ సింగ్ గట్టి బ్రేక్ వేసింది. 2010లో అమెరికాకు చెందిన అమండా సోభీ తర్వాత ఈ టైటిల్ గెలిచిన నాన్‌ఈజిప్షియన్ ప్లేయర్‌గా ఆమె నిలిచింది. టోర్నీ ఆసాంతం తన అద్భుతమైన నియంత్రణతో ప్రత్యర్థులకు ఏమా త్రం అవకాశం ఇవ్వలేదు. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో కేవలం రెండు గేమ్స్ మాత్రమే కోల్పోయిందంటే ఆమె ఆధిపత్యం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తొలి మూడు రౌండ్లలో ఎలాంటి కష్టపడకుండానే సునాయాస విజయాలు నమోదు చేసింది. టోర్నీ కీలక దశకు చేరుకున్నాక అనాహత్‌కు బలమైన ఈజిప్ట్ క్రీడాకారిణుల నుంచి సవాల్ ఎదురైంది. క్వార్టర్ ఫైనల్లో హబీబా రిజ్క్‌పై 31 తేడాతో గెలిచిన ఆమె, సెమీస్‌లో బార్బ్ సమీహ్‌ను కూడా 31 తేడాతోనే మట్టికరిపించింది. ఇక ఫైనల్లో రుకయ్యా సలేమ్‌ను చిత్తు చేసి తన సుదీర్ఘ కలను నెరవేర్చుకుంది. గత ఏడాది కైరోలో జరిగిన టోర్నీలో కాంస్య పతకం గెలిచిన అనాహత్, ఇప్పుడు దాన్ని స్వర్ణంగా మార్చుకుని భారత స్క్వాష్ క్రీడలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. ఆసియా క్రీడలు, కామన్వెల్త్ గేమ్స్‌లోనూ ఆమె భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది.

## అసోంలో వరదల బీభత్సం

**గువాహతి, జులై 26:** అసోం రాష్ట్రంలో వరదలు బీభత్సం సృష్టిం చాయి. గోలాఘాట్, శివసాగర్, చారియదేవ్, డిబ్రూగఢ్, జోర్హాట్, నాగావ్ ఆరు జిల్లాల్లో వరద పరిస్థితి తీవ్రంగా ఉండటంతో, 1.15 లక్షల మందికి పైగా ప్రజలను సహాయ శిబిరాలకు తరలించారు. తాజా నివేదిక ప్రకారం వరదల కారణంగా మరో 14 మంది మరణించారు. వీరిలో చారియదేవ్‌లో ఏడుగురు, శివసాగర్‌లో ఆరుగురు, జోర్హాట్‌లో ఒకరు ఉన్నారు. దీంతో వరదల వల్ల మరణించిన వారి సంఖ్య 66కు చేరినట్లు అధికారులు తెలిపారు. బ్రహ్మపుత్ర నదితోపాటు దిఖౌ, దిసాంగ్, ధన్‌సిరి వంటి ప్రధాన నదులు ప్రమాద స్థాయికి పైగా ప్రవహిస్తూనే ఉండటంతో అప్పర్ అసోంలో వరద పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. ఇంకా వదరు ముంపులో 6.55 లక్షల మంది ఉన్నారు.

## రాష్ట్ర సమాచార శాఖ పెన్షనర్స్ అసోసియేషన్ ఏర్పాటు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై26:** రాష్ట్ర సమాచార పౌర సం బంధాల శాఖకు చెందిన రిటైర్డ్ అధికారులు పెన్షనర్స్ అసోసియేషన్‌ను నూతనంగా ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం సమాచార భవన్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంఖిలో కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.ఎల్.కిస్మత్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం.వి. భాస్కర్ రెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీగా ఏర్వ వెంకటేశం, కోశాధికారిగా ఎం. రమాదేవి, ఉపాధ్యక్షులుగా కె. మనోహరాచారి, బి.రషీద్, సహాయ కార్యదర్శులుగా ఎం.గోవింద్, పి.భాస్కర్, 10 మందిని ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



రమేష్ కుటుంబసభ్యులకు చెక్కును అందిస్తున్న సినీనటుడు చిరంజీవి

## నటుడు రమేష్ కుటుంబానికి 'మెగా' చేయూత

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జులై 26, ప్రభాతవార్త:** సినీనటుడు, మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నటుడు రమేశ్ కుటుంబానికి ఆయన అం డగా నిలిచారు. చికిత్స ఖర్చుల నిమిత్తం రూ.3 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. గబ్బర్‌సింగ్ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు రమేశ్, ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో అపోలో ఆసుపత్రిలోని ఐసీయూలో చేరారు. ఈ విషయం తెలియగానే దర్శకుడు హరీశ్‌శంకర్, పవన్‌కల్యాణ్ టీం సభ్యులు ఆసుపత్రికి వెళ్లి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న చిరంజీవి వెంటనే స్పందించారు. అపోలో ఆసుపత్రి వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి రమేశ్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసు కున్నారు. మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం రమేశ్ కుటుంబసభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన భార్యకు రూ.3 లక్షల చెక్కును అందజేశారు. అంతేకాకుండా ప్రభుత్వ ఆరోగ్య బీమా పథకం ద్వారా సహాయం అందేలా చూస్తానని చిరంజీవి హామీ ఇచ్చారు. రమేశ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు చిరంజీవి సోదరుడు నాగబాబు సైతం తన వంతుగా రూ.2 లక్షల చెక్కును అందించి కుటుంబానికి అండగా నిలిచారు.

## రోడ్డుపైన ఓఎంఆర్ షీట్ల ఘటనపై విచారణ

### మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఎస్పిని ఆదేశించిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జులై 26, ప్రభాతవార్త:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) నిర్వహించిన పోటీ పరీక్షలకు సంబంధించిన కొన్ని ఓఎంఆర్ షీట్స్ రోడ్డుపై పడిఉండటానికి సంబంధించిన అంశంపై విచారణకు ఆదేశించినట్టు కమిషన్ ఇన్‌చార్జ్ సెక్రటరీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషన్ నిర్వహించే ఏదైనా నియామక పరీక్షకు సంబంధించిన ఓఎంఆర్ జవాబు పత్రాలను నియామక ప్రక్రియ పూర్తయిన తర్వాత మూడు సంవత్సరాల పాటు భద్రపరుస్తారని, ఆ తర్వాత నిర్దేశిత విధానాల ప్రకారం వాటిని పారవేయడం కోసం గుర్తించి, ముక్కలు చేయడానికి పంపిస్తారని తెలిపారు. వాటిల్లో కొన్ని ఓఎంఆర్ షీట్లు రోడ్డు పక్కన లభ్యమైనట్లు తెలిసిందని, ఈ సంఘటనకు దారితీసిన పరిస్థితులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై కనిపించిన ఓఎంఆర్ షీట్లు 2018లో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ రిక్రూట్‌మెంటకి సంబంధించినవని తెలిపారు. ఈ పోస్టుల ఎంపిక ప్రక్రియ చాలా కాలం క్రితమే పూర్తయిందని ఈ నేపథ్యంలో వాటిని పారవేయడం, నాశనం చేయడం కోసం గుర్తించడం జరిగిందన్నారు. ఈ ఓఎంఆర్ షీట్లు బహిరంగ ప్రదేశంలో ఎలా లభిం చాయనే విషయంపై విచారణ జరిపి 3 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని టిజిపిఎస్‌సిలో పోస్ట్ చేయబడిన సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్(ఎస్పి)ని ఆదేశించినట్టు ఇన్‌చార్జ్ సెక్రటరీ ప్రకటనలో పేర్కొన్నారు. విచారణలో తేలిన అంశాల ఆధారంగా ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకో బడతాయని తెలిపారు. ఇటువంటివి పునరావృతం కాకుండా నిరోధించడానికి కమిషన్ తన రికార్డుల నిర్వహణ విధానాలను సమగ్రంగా సమీక్షించి బలోపేతం చేయనున్నట్టు ప్రకటనలో స్పష్టం చేశారు.

# తెలుగు వైభవాన్ని చాటేలా యేటా 'తెలుగు మహోత్సవమ్'

## • ప్రాచీన భాషా పరిణామక్రమంపై డాక్యుమెంటేషన్ • నాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు త్వరలోనే నంది నాటకోత్సవాల నిర్వహణ • రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ, జులై 26 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు భాషా, సాంస్కృతిక వైభవాలు నలుదిశలా వెలుగొందేలా ఇకపై ప్రతి ఏటా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో 'తెలుగు మహోత్సవమ్' వేడుకలను నిర్వహించాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక, సృజనాత్మక సమితి ఆధ్వర్యంలో విజయవాడ నగర శివారు ఉండవల్లి గుహల ప్రాంగణంలో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన 'తెలుగు మహోత్సవమ్' ముగింపు వేడుకలకు మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమం అనంతరం తెలుగు భాష వ్యాప్తి కోసం కృషి చేసిన పలువురు కవులను, డిజిటల్ మాధ్యమంలో తెలుగు ఉనికి కోసం పోరాడుతున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను మంత్రి దుర్గేష్ సన్మానించారు. తెలుగు భాషపై ఉన్న ప్రత్యేక అభిరుచితో తనకు ఎంతో ఇష్టమైన 'విశ్వక్సేనుడ్ను' అనే పదాన్ని మంత్రి దుర్గేష్ స్వయంగా తన దస్తూరితో రాసి భాషాభిమానాన్ని చాటుకున్నారు. మట్టి వాసనలు పరిమళించేలా కుండల తయారీని పరిశీలించారు. కాలిగ్రఫీ ద్వారా తన సంతకాన్ని తెలుగులో రాయడాన్ని ఆసక్తిగా గమనించారు. ప్రాచీన జానపద కళ రూపమైన తోలుబొమ్మలాటను స్వయంగా వీక్షించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మిషన్ స్కూల్లో రెండవ తరగతి చదువుతూనే అత్యంత స్పష్టతతో భగవద్గీత శ్లోకాలను పఠించిన ఒక చిన్నారిని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు గీసిన ప్రత్యేక ఛాయాచిత్రాన్ని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సింహాద్రి వాణి రచించిన కవితా కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా సామెతల చెట్టును ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ తెలుగు భాషను ప్రపంచ శిఖరాగ్రాన నిలబెట్టాలనే ఉన్నతమైన ఉద్దేశంతోనే చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో తెలుగును విరివిగా ఉపయోగిస్తూ, భావితరాలకు దీనిని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆంగ్ల భాషా పరిజ్ఞానం నేటి అవసరమే అయినప్పటికీ, మాతృభాషను ఏమాత్రం విస్మరించకూడదని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక స్థాయిలో బోధన మాతృభాషలోనే సాగినప్పుడు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా దృక్పథం పెరుగుతాయని, సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.



సింహాద్రి వాణి రచించిన కవితా కుసుమాలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కందుల దుర్గేష్, డాక్టర్ మండలి బుద్ధప్రసాద్, పి.విక్రమ్, తేజస్విని, మల్లిఖార్జునరావు తదితరులు

**ప్రాచీన భాషా పరిణామక్రమంపై డాక్యుమెంటేషన్:** తమిళుల తరహాలో ప్రాచీన భాషగా గుర్తింపు పొందిన తెలుగు భాషా పరిణామక్రమాన్ని సమగ్రంగా వివరించేలా ఒక ప్రత్యేక డాక్యుమెంటేషన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. నాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు త్వరలోనే నంది నాటకోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రపంచ తెలుగు మహాసభల ద్వారా తెలుగు ఉన్నతికి కృషి చేసిన మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను ఆగస్టు 4న విజయవాడలో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 29న ఘనంగా తెలుగు భాషా దినోత్సవాన్ని, తెలుగు పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ కాక్రోచ్ ఉద్యమం మాదిరిగా ప్రతి ఒక్కరూ తెలుగు భాషా పరిరక్షణకు, ఉనికికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. తాము గతంలో భాష కోసం అనేక పోరాటాలు చేశామని, అయితే తొలిసారిగా యువతను భాగస్వామ్యం చేస్తూ 'తెలుగు భవితన్ను' ప్రోత్సహించేలా ఇలాంటి మహోత్సవాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

మాతృభాష తెలుగును భవిష్యత్ తరాలకు సురక్షితంగా అందించాలనే సంకల్పంతోనే 'తెలుగు మహోత్సవమ్' లాంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక.సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి తెలిపారు. అందరం ఐక్యంగా నిలబడి తెలుగు భాషా ఉనికిని, అస్తిత్వాన్ని కాపాడుకుందామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మండలి వెంకటకృష్ణా రావు అధికార భాష సంఘం చైర్మన్ త్రివిక్రం రావు మాట్లాడుతూ తెలుగు ఉనికి కోసం, ఉన్నతి కోసం ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని అన్నారు. తెలుగు అంతరించి పోయే ప్రమాదం లేదన్నారు. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు రేగుళ్ల మల్లికార్జున రావు మాట్లాడుతూ మంత్రి కందుల దుర్గేష్ చూపిన ప్రత్యేక శ్రద్ధ, చొరవ వల్లే చారిత్రక ప్రాధాన్యం ఉన్న ఉండవల్లి గుహల వద్ద ఈ మహోత్సవాన్ని అత్యంత జయప్రదంగా నిర్వహించగలిగామని తెలిపారు.

# 'ఇంటింటికి తెలుగుదేశమ్' పేరిట రాష్ట్రంలో ప్రజా చైతన్య యజ్ఞం

## • టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



**విజయవాడ, జులై 26 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమ ఫలాలపై విస్తృత ప్రచారాన్ని చేపట్టాలని పార్టీ శ్రేణులకు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా డోర్ టు డోర్ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాం. ఈ ప్రజా చైతన్య యజ్ఞం రాబోయే 45రోజుల పాటు నిర్విరామంగా కొనసాగనుందని తెలిపారు. 'సూపర్-6 హామీల అమలు, మహిళలు, రైతులు, యువత, విద్యార్థులకు అందిన లబ్ధిని ప్రజలకు వివరించాలి. ఒకే రాజధాని అభివృద్ధి వికేంద్రీకరణ, ఉత్తరాంధ్ర, రాయలసీమలో జరుగుతున్న అభివృద్ధిని వివరించాలి. గత ప్రభుత్వ విధ్వంసక పాలనకు, ఎన్డీయే ప్రభుత్వ అభివృద్ధి పాలనకు మధ్య ఉన్న తేడాను ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. ప్రజల సమస్యలు, సూచనలను నమోదు చేసి వాటి పరిష్కారానికి పార్టీ, ప్రభుత్వం తరఫున చర్యలు తీసుకునేలా కృషి చేయాల్లి అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్క టిడిపి నాయకుడు, కార్యకర్త ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని పల్లా శ్రీనివాసరావు కోరారు.

# బాలికపై బాలుడు లైంగిక దాడి

**చీమకుర్తి, జులై 26 ప్రభాతవార్త:** ఒంటరిగా ఉన్న 8 ఏళ్ల బాలికకు మాయమాటలు చెప్పి ఓ మైనర్ బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆరోపణలపై చీమకుర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. చీమకుర్తి పట్టణం క్రిస్టియన్ పాలెంలో ఓ మైనర్ బాలికను పదహారేళ్ల మైనర్ బాలుడు మాయమాటలు చెప్పి బైక్ ఎక్కించుకున్నాడు. మీ అమ్మ పెరుగు ప్యాకెట్ తెమ్మందని, వచ్చి బండి ఎక్కమని గదిమినట్టుగా అన్నాడని తెలుస్తోంది. అక్కడి నుంచి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడని ఆ బాలిక తల్లితో చెప్పింది. బాధితురాలు తల్లి చీమకుర్తి పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేయగా, విచారించిన సిఐ దాసరి ప్రసాద్ ఆదివారం పోక్సో సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

# నాన్న, నేనేం తప్పు చేశాను.. ఎందుకు నన్ను చంపేశావ్?

## ఒంగోలులో గుండెల్ని పిండేసే ఘటన





**ఒంగోలు, జులై 26 ప్రభాతవార్త:** భార్యభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థలు, అనుమానాలు చివరకు ఇద్దరు పసిపాపల ప్రాణాల మీదకు తెచ్చాయి. తనతో కాపురానికి రావట్లేదన్న అక్కసుతో ఒక తండ్రి కనీస మానవత్వం మరిచి దారుణానికి ఒడిగట్టాడు. కంటికి రెప్పలా కాపాడాల్సిన కన్నతండ్రే ఇద్దరు పిల్లలకు కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి తాగించి, తానూ తాగాడు, ఈ దారుణ ఘటనలో తీవ్ర అస్వస్థతకు గురైన 10 ఏళ్ల కుమార్తె చికిత్స పొందుతూ మృతి చెందగా, 8 ఏళ్ల కుమారుడు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు.

ఈ విషాదకర సంఘటన ప్రకాశం జిల్లా ఒంగోలులో తీవ్ర కలకలం రేపింది. బాపట్ల జిల్లా చీరాల సాయికాలనీకి చెందిన ప్రవళిక, ప్రకాశం జిల్లా సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన కారిశపాటి విజయకుమార్‌లు 12 ఏళ్ల క్రితం చీరాలలోని వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి 10 ఏళ్ల కూతురు ఆద్య, 8 ఏళ్ల కుమారుడు సుప్రీత్ ఉన్నారు. అయితే విజయకుమార్ ఎలాంటి పని చేయకుండా నిత్యం భార్యపై అనుమానం పెంచుకుని వేధించేవాడు. భర్త వేదింపులు తాళలేక ప్రవళిక ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చినా విజయకుమార్ తీరులో ఎలాంటి మార్పు రాలేదు. దీంతో విసిగిపోయిన ప్రవళిక పిల్లలను భర్త వద్దే వదిలేసి, గత మూడు నెలలుగా ఒంగోలులోని స్త్రీశక్తి సదన్ హోమ్‌లో ఉంటుంది.

**కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి..** ఈ క్రమంలో పిల్లలను నవోదయ స్కూల్‌లో చేర్పించేందుకు ఈనెల 18న ప్రవళిక భర్తను సంప్రదించింది. విజయకుమార్ పిల్లలకు పుస్తకాలు కొనిచ్చిన అనంతరం, భార్యను తిరిగి కాపురానికి రమ్మని కోరాడు. ఆమె అందుకు నిరాకరించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన విజయకుమార్.. ఈనెల 19న ఇద్దరు పిల్లలకు కూల్ డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి తాగించి, తానూ తాగాడు, ఆ తర్వాత పిల్లలను తీసుకెళ్లి స్త్రీశక్తి సదన్‌లో ఉన్న ప్రవళిక వద్ద వదిలేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన పిల్లలను గమనించిన తల్లి వెంటనే ఒంగోలు రిమ్స్‌కు తరలించింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఎగ్మోర్ ఆసుపత్రికి తరలించారు.

**చికిత్స పొందుతూ చిన్నారి ఆద్య మృతి:** చెన్నై ఎగ్మోర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 10 ఏళ్ల చిన్నారి ఆద్య కన్నుమూసింది. బాలుడు సుప్రీత్ పరిస్థితి ఇంకా విషమంగానే ఉంది. మరో వైపు పిల్లలకు విషమిచ్చి తాను కూడా తాగిన తండ్రి విజయకుమార్ ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. కుమార్తె ఆద్య మృతి చెందడంతో తల్లి ప్రవళిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒంగోలు తాలూకా పోలీసులు విజయకుమార్‌పై హత్య, హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నిందితుడి నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసినట్లు ఒంగోలు తాలూకా సీఐ విజయ్‌కృష్ణ తెలిపారు.



బోనాలు తెస్తున్న వారికి ఆహ్వానం పలుకుతున్న చైర్మన్, ఇఓ

# దుర్గమ్మకి ఘనంగా బంగారు బోనాలు

## • శ్రీమహంకాళి జాతర బోనాల బృందాల సమర్పణ

**ఇంద్రకీలాద్రి, జులై 26, ప్రభాతవార్త:** దుర్గమ్మకి భాగ్యనగర్ శ్రీమహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బంగారు బోనాలు సమర్పించారు. ముందుగా ఉదయం 11 గంటలకు జమ్మిచెట్టు ఊరేగింపుగా వచ్చి ఆషాఢం సారె సమర్పించారు. గత 16 సంవత్సరాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం జమ్మిదొడ్డిలో కొలువైన అమ్మవారి వద్ద తెలంగాణ బృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్, స్థానాచార్య వి.శివ ప్రసాద్ శర్మ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. జమ్మిదొడ్డి నుండి విచిత్ర వేషాలు, పోతురాజుల విన్యాసాలతో కొండ పైకి చేరిన కమిటీ వారికి ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వికె శీనా నాయక్ స్వాగతం పలికారు. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, మంత్రపఠనోచ్చారణలతో బోనాలు తెచ్చిన బృందాలను దుర్గమ్మ సన్నిధికి తొడ్కొని వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ మధుసూదన్ యాదవ్, సభ్యులు అంజయ్య శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనం అనంతరం వారికి వేదపండిత ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు ఇఓ చైర్మన్‌లు అందజేశారు.

**ప్రోటోకాల్ విఐపి దర్శనాలు రద్దు:** ఆషాఢ మాసం ఉత్సవాలు సందర్భంగా ఆదివారం తెలంగాణా నుండి బోనాలు సమర్పణకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేస్తున్నందున, వివిధ ప్రాంతాల నుండి సారె సమర్పణకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ముందే సమాచారముండడంతో ఇఓ విఐపి ప్రోటోకాల్ దర్శనాలు సాయంత్రం 4గంటల వరకు రద్దు చేశారు. ఘాట్ రోడ్ వైపు ప్రవేట్ వాహనాల రాకపోకలు నియంత్రించారు. దేవస్థానం బస్సులు పూర్తి స్థాయిలో నడపడంతో భక్తులు సులభంగా దేవస్థానానికి చేరుకుని దుర్గమ్మని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు చర్యలు చేపట్టి భక్తులకు సులభంగా, త్వరితంగా దర్శనమయ్యేలా స్వయంగా చర్యలు తీసుకున్నారు. పోలీస్ అధికారులు సిబ్బంది భక్తులకు సేవలందించారు. డీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, వన్ టౌన్ సిఐ గుణరామ్, వన్ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

**ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో రద్దీ:** దుర్గమ్మవారికి ఆషాఢం సారె తెచ్చిన



భక్తజనంతో ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మ వారిని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి 12వ రోజు ఆదివారం సాయంత్రం గంటల వరకు 82 సారె బృందాలకు చెందిన 38,967 మంది మహిళలు అమ్మవారికి సారె సమర్పించారు. సాయంత్రం 4 గంటల సమయానికే సుమారు 78 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. వారికి భవానీ అనుగ్రహ దర్శన్ రూ.100లు క్యూ లైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

**ముమ్మరంగా శాకంబరి అలంకారం, ఏర్పాట్లు:** దుర్గమ్మ ఆలయంలో శాకంబరి ఉత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆలయ ప్రాంగణమంతా చూడముచ్చటగా కూరగాయలు, పండ్లు దండలను ఏర్పాటు చేయగా, వాటిని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ పరిశీలించి తగు సూచనలు చేశారు. పలువురు భక్తులు కూరగాయలు, పండ్లు దండలను వేగంగా సిద్ధం చేస్తున్నారు. ఈనెల 27 నుండి 29 వరకు వైభవంగా వేడుకలు జరపడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

**దుర్గమ్మ సేవలో విఐపిలు:** దుర్గమ్మని ఆదివారం ఏపి అసెంబ్లీ స్పీకర్ సిహెచ్ అయ్యన్న పాత్రుడు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్ కుమార్, ఏపి అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, సినీనటుడు ఎం.మురళీ మోహన్ దర్శించుకున్నారు. చైర్మన్ రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, వేదపండితుల ఆశీర్వచనం, ప్రసాదాలు, అమ్మవారి చిత్రపటం అందించారు.



# కావేరి జల వివాదం.. హోసూరు సరిహద్దులో తమిళనాడు బస్సులకు బ్రేక్

**హోసూరు, జులై 26:** కావేరి జల వివాదం మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. మేకేదాతు ఆనకట్ట నిర్మాణానికి మద్దతుగా కన్నడ సంఘాలు చేపట్టిన ఆందోళనల నేపథ్యంలో ఆదివారం తమిళనాడు నుంచి కర్ణాటకకు వెళ్లే బస్సు సర్వీసులను హోసూరు సరిహద్దు వద్ద తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో బెంగళూరుకు వెళ్లాల్సిన వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే హోసూరు వద్ద బెంగళూరుకు వెళ్లే తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థ బస్సులను పోలీసులు నిలిపివేశారు. కృష్ణగిరి జిల్లా పోలీసుల ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.అలాగే ధర్మపురి జోన్ తమిళనాడు రాష్ట్ర రవాణా సంస్థ కూడా హోసూరు దాటి బెంగళూరుకు బస్సులను నడపవద్దని అధికారులకు సూచనలు జారీ చేసింది.

# అందని పరిహారం.. పునరావాసంలో సమస్యలు

## మూలపేట పోర్టు నిర్వాసితులు ఆందోళన

**సంతబొమ్మాళి (శ్రీకాకుళం జిల్లా) జులై 26 ప్రభాతవార్త:** మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంతో గ్రామంలో అసంతృప్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్వాసితులపై ఒత్తిడి తీసుకురావడాన్ని నిరసిస్తూ శుక్రవారం మూలపేట గ్రామంలో నిర్వాసితులు, యువకులు ఆందోళన చేపట్టారు. పెండింగ్ పరిహారం, పునరావాస కాలనీలో మౌలిక సదుపాయాల లేమి, దేవాలయాల తరలింపు, ఉపాధి హామీల అమలులో అధికారుల వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ, ఇప్పటికీ 32 ఎకరాల భూమికి పరిహారం చెల్లించలేదని, అలాగే 14 మందికి పీఏఎఫ్ పరిహారం, 11 మందికి ఇవ్వాల్సిన రేకులు అందలేదని ఆరోపించారు. గ్రామంలోని ఏడు దేవాలయాల తరలింపునకు ఎంత మొత్తం అంచనా రూపొందించారో ప్రజలకు వెల్లడించలేదని, రచ్చబండ నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్‌ను కూడా చూపించలేదని విమర్శించారు. 298 కుటుంబాలకు జీడి తోటల పరిహారంగా ఒక్కో కుటుంబానికి రూ.45,680 ఇస్తామని ప్రకటించి, కేవలం రూ.32,680 మాత్రమే చెల్లించి రూ.13,000 చొప్పున తగ్గించారని ఆరోపించారు. దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా, జీడి తోటల పరిహారం పేరుతో ఇంటింటికీ వెళ్లిన వీఆర్వో ప్రసాద్, విఆరఏ చిరంజీవి అసలు విషయం చెప్పకుండా ఇళ్లు కూల్చివేతకు సంబంధించిన పత్రాలపై సంతకాలు తీసుకున్నారని, సుమారు 70శాతం మంది నిర్వాసితులు తెలియకుండానే సంతకాలు చేశారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోర్టులో విధులు నిర్వహించకపోయినా గ్రామానికి చెందిన ఎనిమిది మందికి ప్రతినెల జీతాలు చెల్లిస్తున్నారని, వారి పేర్లను వెంటనే బహిర్గతం చేయాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు.



**ఆగస్టు 17 తర్వాతే గ్రామదేవత తరలింపు:** ఆషాఢ మాసం కొనసాగుతున్నందున ఆగస్టు 17వ తేదీ తర్వాత మాత్రమే గ్రామదేవతను తరలిస్తామని నిర్వాసితులు స్పష్టం చేశారు. గ్రామదేవత తరలింపును ప్రజల ఆచారాలు, సంప్రదాయాలకు అనుగుణంగానే నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు పెండింగ్ పరిహారం, పునరావాస సమస్యలు, మౌలిక వసతుల కల్పన, దేవాలయాల తరలింపు, ఉపాధి హామీలు తదితర అన్ని అంశాలను తక్షణమే పరిష్కరించాలని నిర్వాసితులు హెచ్చరించారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీరు మోహన్‌రావు, జీరు ధర్మారావు, జీరు ఎర్రన్న, జీరు దుర్గారావు, జీరు రామన్న, దారపు రామన్న, గరక అప్పన్న తదితర నిర్వాసితులు పాల్గొన్నారు.

**"హామీలు నెరవేర్చండి... తర్వాతే గ్రామం ఖాళీ:** పోర్టు కోసం మా భూములు, ఇళ్లు, జీవనాధారాన్ని త్యాగం చేశాం. కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేం "లేదు. పెండింగ్ పరిహారం, పునరావాస కాలనీలో వసతులు, ఉపాధి హామీలు అమలుచేసిన తర్వాతే తదుపరిచర్యలకు సహకరిస్తాం. ఆగస్టు 17తర్వాత గ్రామ దేవతను సంప్రదాయం ప్రకారం తరలిస్తాం" అని నిర్వాసితులు స్పష్టం చేశారు.

# భవిష్యత్తు మెగా వ్యూహంతోనే బిజెపి రాజీనామా స్కెచ్!

**న్యూఢిల్లీ, జులై 26:** నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఉదంతాన్ని బిజెపి భవిష్యత్ వ్యూహంగానే విపక్షాలు అంచనావేస్తున్నాయి. జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా నిరసన చేస్తున్న యువత, కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) తన నిరసనను విరమించుకుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కేవలం బీజేపీ పెద్ద లక్ష్యాల ముందు కేవలం చిన్న త్యాగంగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. వర్షాకాల సమావేశాల్లో అనవసరం రాద్ధాంతం ఎందుకని బీజేపీ భావించి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే, మరో 56 నెలల్లో ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిరసనకారులపై బలప్రదర్శన చేస్తే, ఏదైనా మరణాలు సంభవిస్తే బీజేపీ యూపీ ఫలితాలపై ప్రభావం పడుతుందని భావించింది. ప్రతిపక్షాలకు ఇది ఒక అస్త్రంగా మారొద్దని భావించింది. హింసలో ఏదైనా పెద్ద సంఘటన జరిగితే దీనిని రాజకీయం చేయడానికి ప్రతిపక్షాలు ఉన్నాయని భావించే బీజేపీ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరింది. దేశంలో 80వరకు ఎంపీ స్థానాలు ఉన్న యూపీలో గెలిచిన పార్టీనే కేంద్రంలో అధికారం ఏర్పాటు చేస్తుందనేది వాస్తవం. 2029 లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ బీజేపీ గెలవాలంటే ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు చాలా కీలకం. మళ్లీ యోగి అధికారంలోకి వస్తే లోక్‌సభ ఎన్నికల నాటికి మెరుగైన ప్రదర్శన చేయవచ్చని బీజేపీ భావిస్తోంది. పంజాబ్‌లో ఆప్‌ను, కర్ణాటకలో కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే వ్యూహం అమలుచేస్తోంది. యూపీలో పాటు మరికొన్ని నెలల్లో పంజాబ్ ఎన్నికలు జరగబోతున్నాయి. పంజాబ్‌లో ఆప్ అధికారంలో ఉంది. ఇటీవల పంజాబ్‌లో కూడా పేపర్ లీక్ ఘటనలు చోటు చేసుకున్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పిలుపునిచ్చిన కాక్రోచ్ పార్టీ నేతల్లో చాలా మందికి ఆప్‌తో సంబంధాలు ఉన్నాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో బీజేపీ ఒక ట్రెండ్‌ను సెట్ చేసింది. ఇప్పుడు, పంజాబ్‌లో ఆప్ విద్యాశాఖ మంత్రి రాజీనామాను బీజేపీ మరింత బలంగా కోరుతుంది. కేంద్ర మంత్రి రాజీనామా చేసినప్పుడు, రాష్ట్రంలోని మంత్రి కూడా రాజీనామా చేయాలనే నినాదాన్ని తీసుకువస్తుంది. ఇది ఒకవైపు పంజాబ్ ఎన్నికల్లో బీజేపీ బలపడేందుకు ఒక అవకాశంగా మారడంతో పాటు ఆప్‌కాక్రోచ్ జనతా పార్టీ సంబంధాలను బహిర్గతం చేయడానికి ఉపయోగపడుతుంది. ఇక కర్ణాటకలో కూడా పేపర్ లీక్ వివాదం ఉంది. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇప్పుడు ప్రధాన్ రాజీనామాను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్‌పై బీజేపీ విమర్శలు ఎక్కు పెడుతుంది. ఇప్పటికే కర్ణాటక కాంగ్రెస్‌లో గ్రూపు తగదాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో కాంగ్రెస్ విద్యాశాఖ మంత్రి, ప్రభుత్వాన్ని బీజేపీ టార్గెట్ చేస్తే, ఎన్నికల నాటికి ఒక బలమైన స్కెచ్ వేయచ్చని బిజెపి భావిస్తోంది. ఇన్నాళ్లు ప్రతిపక్షాలు కేంద్రం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. ప్రజాస్వామ్యంగా ఉండటం లేదు నియంతగా పాలిస్తుందని బీజేపీని విమర్శించేవి. కేంద్రమంత్రి రాజీనామా తర్వాత తన క్యారెక్టర్ మార్చుకున్నట్లు సంకేతాలిచ్చింది. ఉద్యమాలు, యువత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లుగా ప్రజల్లో ఒక ఇమేజ్ బిల్డ్ చేసుకోవడానికి ఈ రాజీనామాను ఉపగియోగిస్తోంది. ఇదే సమయంలో ఎంతో కొంత బీజేపీపై ప్రజల్లో సానుభూతి కూడా పెరుగొచ్చు. ఇదే వచ్చే ఎన్నికల్లో లాభంగా మారొచ్చని లెక్కలేసుకుంటోంది. డీలిమిటేషన్, ఎఫ్‌సిఆర్ఎ బిల్లుల కోసమే ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. వీటితోపాటే కేంద్రం ప్రభుత్వం కీలకంగా భావిస్తున్న పలు బిల్లులను ఈ వర్షాకాల సమావేశాల్లోనే పార్లమెంట్‌లో పెట్టాలని భావిస్తోంది. ఇలాంటి సమయంలో యువత ఆందోళనలు, విపక్షాల నిరసనలు అవసరమా అని బీజేపీ భావించి ఉంటుంది. డీలిమిటేషన్ బిల్లును ఈ సమావేశాల్లోనే తీసుకురాబోతోంది. దీంతోపాటు విదేశీ విరాళాల (సవరణ) బిల్లు కూడా తీసుకురాబోంది. ఏప్రిల్ నెలలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ఎన్డీయే సర్కార్ తీసుకువచ్చింది. ఆ సమయంలో సంఖ్యా బలం లేకపోవడంతో బిల్లు వీగిపోయింది. ఇప్పుడు మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా టీఎంసీ రెబల్ ఎంపీలు, శివసేన ఉద్ధవ్ ఠాక్రే ఎంపీలు ఏక్‌నాథ్ షిండే గ్రూపులో చేరడం, ఎన్సీపీ శరద్ పవార్ గ్రూపు కూడా ఎన్డీయేలో చేరేందుకు సిద్ధం కావడం బీజేపీకి కలిసి వస్తోంది. ఇదే కాకుండా సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు కూడా దీనికి మద్దతుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఇక కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా డీఎంకే కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చేందుకు సముఖంగా ఉందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సభలో బిల్లుకు 2/3 వంతు మెజారిటీ వస్తోంది. బిల్లు ఈజీగా పాస్ అవుతుంది.

# చిటికెలో మేకప్



వయసుతో సంబంధం లేకుండా మహిళలంతా ముఖానికి తక్కువగా అయినా మేకప్ ఉండాలని అనుకుంటున్నారు. అదీ సహజంగా కనిపించాలని భావిస్తున్నారు. ఇలాంటి వారికోసమే ఈ చిట్కాలు.

మేకప్ వేయడానికి ముందు చర్మాన్ని దానికి అనువుగా మార్చుకోవాలి. చర్మం నిర్జీవంగా ఉంటే ఎబ్బెట్టుగా ఉంటుంది. తేమను అందించాలి. ఇందుకోసం రెండు ఐసు ముక్కల్ని తీసుకుని చర్మంపై రుద్దాలి. ఐదు నిమిషాలు ఇలా చేసి.. ఆపై ముఖానికి మాయిశ్చరైజర్ రాయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తాజాగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది. ✦ ముఖంపై ప్యాచ్‌లూ, గీతలూ, మచ్చలూ కనిపించ కూడదంటే పౌడర్ ఆధారిత కన్సీలర్లు, మ్యాటిఫైయింగ్ సౌందర్య ఉత్పత్తులకు దూరంగా ఉండండి. బదులుగా ద్రవరూపంలో ఉన్న వాటిని ఎంచుకోండి. కన్సీలర్, ప్రైమర్‌లని వేసేందుకు తడి స్పాంజిని వినియోగించడం వల్ల చర్మంపై సరిగ్గా పరుచుకుంటాయి. ✦ గ్లాసీ మేకప్, నేచురల్ లుక్‌ని కోరుకునేవారు ఫౌండేషన్, కన్సీలర్, ప్రైమర్ వంటి రెండు మూడు రకాలన్నీ కలిపి ఒక్కటిగా ఉన్న మేకప్ ఉత్పత్తులు దొరుకుతున్నాయి. వాటిల్లో నాణ్యమైన రకాన్ని ఎంచుకోండి. ✦ నీటి ఆధారిగ మస్కారా, కాజల్ వంటివి ముఖాన్ని ఎక్కువ సేపు తాజాగా ఉంచుతాయి. ఇషాడో వేయకపోయినా కళ్లకు కటుక మాత్రం తప్పనిసరిగా పెట్టడం మరిచిపోవద్దు. పెదాలకు కలర్‌ఫుల్ మాయిశ్చరైజర్ కలిసి ఉన్న లిప్‌గ్లాస్‌ని ఎంచుకోండి పెదాలు పాడవ్వవు. అందంగానూ కనిపిస్తాయి.

గుదిబండలా మారిన సిలబస్, ఇండోర్ గేమ్స్ వంటివి పిల్లలను ఎండకు దూరం చేస్తున్నాయి దీనివల్ల కలుగుతున్న విటమిన్ లోపాన్ని సప్లిమెంట్ల ద్వారా సరిచేయడం మంచిది కాదంటోంది లండన్‌లోని క్వీన్‌మేరీ యూనివర్సిటీ చేసిన ఓ అధ్యయనం. ఆ వివరాలేంటంటే..

# విటమిన్ 'డి' కోసం..



విటమిన్ డి లోపంతో బాధపడే 13 ఏళ్లలోపు పాఠశాల విద్యార్థులను ఈ అధ్యయనం కోసం ఎంచుకున్నారు. మూడేళ్లపాటు ఆ పిల్లలకు వారానికొకసారి ఈ సప్లిమెంట్ అందించి పరిశీలించగా దానివల్ల ప్రయోజనం ఏమీ కనిపించలేదట. అలాగే ఎముకలూ బలహీనంగానే ఉండటం గుర్తించారు. అధ్యయనం ద్వారా సహజసిద్ధంగా అందే డి విటమిన్ మాత్రమే కాల్షియం పోషణకు ఉపయోగపడుతుందని, అలాకాకుండా దాన్ని సప్లిమెంట్లు అందిస్తే అనుకున్న ప్రయోజనం దక్కదని తేలింది. రోజూ ఉదయపు ఎండలో వ్యాయామ లేదా పరుగు, జంపింగ్, క్రికెట్, బ్యాడ్మింటన్ వంటి క్రీడలు ఆడించాలి. అలాగే సైకిల్ తొక్కడంవల్ల కూడా 'డి ' విటమిన్ వారికి సహజ సిద్ధంగా అందు తుంది. రోజూ ఉదయం అరగటం సేపు పిల్లలను ఆరుబట ఉండేలా చేస్తే ఎముకలు బలోపేతమవుతాయి. కండరాలు శక్తిమంతంగా మారతాయి. రోజూ ఆహారంలో డి విటమిన్ పుష్కలంగా ఉండే ఫ్యాటీఫిష్, లివర్ ఆయిల్,గుడ్లు, పాల ఉత్పత్తులు, పుట్టగొడుగులు, ఆకుకూర, తాజా కూరగాయలు, పండ్లు వంటివి ఉండేలా చూడాలి. దీంతోపాటు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచాలి. రాత్రి నిర్ణీత సమయానికి నిద్ర, ఉదయం లేవడం, అలాగే శరీరానికి కావాల్సినంత నీటిని తీసుకోవడం నేర్పాలి. ఎముకల బలాన్ని హరించే చక్కెర ఎక్కువగా ఉండే శీతల పానీయాలు, మైదాతో చేసే స్నాక్స్ వల్ల కలిగే అనారోగ్యాలు గురించి అవగాహన పెంచితే చాలు. పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారు.



# మనసున మనసై.. !

ఆలుమగల మధ్య అను బంధానికి ప్రత్యేకమైన నిబంధ నలేమీ ఉండవు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, పొరబాట్లు సరిదిద్దుకుంటూ, ఒకరికొకరు చేయూత నిచ్చుకుంటూ సాగాలి. అప్పుడే ఆ బంధం కలకాలం నిలుస్తుంది. మీరే నేర్పించండి.. మీరు చిన్నప్పటి నుంచి తక్కువ ఖర్చు, పొదుపు చేసే కుటుంబం నుంచి వచ్చి ఉండొచ్చు. ఎదుటి వాళ్లలో నిర్లక్ష్యం, దుబారా కనిపించొచ్చు. మీరు పెరిగిన వాతావరణంలోని పద్ధతులు ఒకలా ఉండొచ్చు. మీ భాగస్వామి ఆ పనుల్ని మరోలా చేయొచ్చు. అలాగని మీరే కరెక్టనీ, వారిని ఎత్తిచూపడమే పనిగా పెట్టుకుంటున్నారా? ఇలా చేస్తే అవతలివారు మారడం సంగతి అలా ఉంచితే, మీ వల్ల వారు బాధపడే ప్రమాదం ఉంది. మీకు నచ్చినట్లు చేయాలంటే నెమ్మదిగా చెప్పి అలవాటు చేయించడమే సరైన పని. అలానే ప్రతిపనిలోనూ భాగస్వామ్యం చేయడం వల్ల ఈ సమస్యను అధిగమించొచ్చు.

**మనసు విప్పి మాట్లాడండి...** కాపురంలో కలతలు సహజమే. అలాగని రోజూ గొడవపడు తుంటే ఎవరూ సంతోషంగా ఉండలేరు. కలతలకు కారణం దాపరికాలు, నిజాయతీ లేకపోవడం, అబద్ధాలు..వంటివే కాదు.. సరైన సమయం ఇవ్వకపోవడం అని కూడా గుర్తించండి. అది మరిన్ని సమస్యలకు దారితీసి మీ బంధాన్ని చీల్చే యొచ్చు. దీన్ని పోగొట్టు కోవాలంటే భాగ స్వామితో మనసువిప్పి మాట్లాడ డమే పరిష్కారం. అప్పటికీ అది సాధ్యం కాకపోతే నిపుణుల సాయం తీసుకోండి. కలిసి కౌన్సెలింగ్‌కి వెళ్లండి. మీ భాగస్వామిపై ప్రేమనువ్యక్తం చేసే తీరు ఒకలా ఉండొచ్చు. అవతలివారు మీపై చూపించే అప్యాయత మరోలా ఉండొచ్చు. కానీ అది తమ అంచనాలకు తగ్గట్లు లేనప్పుడు తీవ్రంగా కుంగిపోతారు. తమ ఉద్వేగాలతో ఎదుటివాళ్ల కాళ్లకు బంధం వేయాలనుకుంటారు. ఇది క్రమంగా మీ మధ్య అనుబంధానికి పెనుప్రమాదంగా మారొచ్చు. అలాంటప్పుడు కలిసి కూర్చుని మాట్లాడుకోండి. మా ఆలోచనల్ని స్పష్టంగా చెప్పగలిగితే సమస్య సద్దుమణిగిపోతుంది.

# ఆదిత్య హృదయం

**రామ రావణ** యుద్ధం భీకరంగా జరుగుతోంది. రాముడు రావణుడి శిరస్సులు ఖండిస్తుండగా ఓ తల కిందపడగానే ఆ స్థానంలో మరో తల మొలుస్తోంది. అప్పుడిక ఆదిత్య హృదయం జపించి విల్లెక్కుపెట్టి బాణాలు వదిలాడు. రావణుడు పడిపోయాడు. రామరావణ యుద్ధ సన్నివేశమిది. అరునాచలంలో శేషాద్రి స్వామి అవదూత దీన్ని గురించి ఓ నిగూఢ అర్థం తెలియజేశారు. కామక్రోధాలు రాక్ష సుల వంటివి. రాక్షసులు నిశాచరులు. చీకటిలోనే కామ క్రోధాలు విజృంభిస్తాయి. వ్యక్తిలో అలాంటి గుణాలు ఉన్నంత వరకు ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియా లను లోబరచుకోవడం సాధ్యం కాదు. జ్ఞానజ్యోతి కాంతులను వెదజల్లినప్పుడే అజ్ఞానాంధకారం తొలగి పోతుంది. కామక్రోధాలూ, రాక్షసత్వం నశిస్తాయి. అటుపై ఇంద్రియాలు విషయ తపన లేక అణగారిపోతాయి. రావణుడు కామక్రోధాలు మూర్తీభవించిన నిండు విగ్రహం. నిశాచరుల నియంత. అతడి పది తలలూ జ్ఞానేంద్రియ, కర్మేంద్రియాలకు నిదర్శనం. శ్రీ రామ చంద్రుడు తలలన్నింటినీ ఛేదించినా రావణుడు జీవించే ఉన్నా డంటే అతడిలో కామ క్రోధాలు నశించ లేదని అర్థం.



ఆదిత్యహృదయ పఠనంతో ఆ ప్రదేశమంతా వెలుగు నిండి పోయింది. అంధకారం అంతరించిపోయింది. కామక్రోధాలు అదృశ్యమయ్యాయి. అని విపులీకరించారు అవదూత స్వామి. ఆదిత్య హృదయా నికి అసాధ్య మైంది ఏదీ లేదన్నారు మహర్షులు.



# కంద దోశ

మినప్పిండి, బియ్య పిండి దోశలు సాధారణం. ఎప్పుడూ అదే అంటే విసుగొస్తుందని రవ్వ దోశ, టొమాటో దోశ. అంటూ చాలా రకాలు చేయడం తెలిసిందే. అంతకంటే ఇంకొంచెం ప్రత్యేకంగా ఉండాలని..కంద దోశ వేసుకొంటారు కొందరు. ఈ దుంపలో దురద గుణాలుంటాయిగా అనుకుంటున్నారు. మరేం ఫరవాలేదు. కొంచెం మందంగా ఉండే ఈ దుంపను చక్కగా పీల్ చేసి ఉప్పునీళ్లలో నానబెట్టాలి. కొంచెం సేపు గనుక అలా ఉంచామంటే. ఇక ఏ ఇబ్బందీ ఉండదు. ఇంతకీ దీంతో దోశ ఎలా చేయాలంటే.. దుంపను నీళ్ల లోంచి తీసి ఇంకోసారి కడిగి, ముక్కలుగా తరగాలి. మూడు గంటలు నానబెట్టిన పెసరపప్పులో నీళ్ల వంపేసి.. మిక్సీ జార్‌లో వేయాలి. దానికి కంద ముక్కలు అంగుళం సైజు అల్లం ముక్క ఉప్పు, పచ్చిమిర్చి ముక్కలు కొన్ని నీళ్లు జోడించి గ్రైండ్ చేస్తే పిండి సిద్ధమైపోతుంది. ఈ మిశ్రమానికి కాస్త బియ్యప్పిండి జోడిస్తే దోశలు మరింత క్రిస్పీగా వస్తాయి. పల్లీ చట్నీతో హ్యాపీగా తరుగు వేసి..దిబ్బరొట్టె కూడా చేసుకోవచ్చు. ఈ వెరైటీ దోశ మీకూ నచ్చు తుంది. ఒకసారి ప్రయత్నించి చూడండి.



# ఉప్పు తగ్గించాలంటే ..

**ఏ వంటకాల్లోనైనా సరే ఉప్పు, కారం సరిగ్గా ఉంటేనే దాని రుచి పెరుగుతుంది. మన జిహ్వాకూ రుచిస్తుంది. అయితే కొంతమంది వీటి డోసు పెంచి వాడుతుంటారు. ఈ క్రమంలో ఉప్పు మితి మీరితే మాత్రం బిపి, హైపర్‌టెన్షన్, మూత్ర పిండాలకు సంబం ధించిన సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. అందుకే ఉప్పును తగ్గించుకు నేందుకు కొన్ని చిట్కా లను, ప్రత్యామ్నాయ మార్గా లను పాటించాలి. అవేంటో తెలుసుకుందామా..**

జామ పండు, పచ్చి మామిడి కాయ, మొక్కజొన్న వంటి వాటిపై ఉప్పు చల్లుకొని తినడం చాలామందికి అలవాటు. అయితే ఇలాగే తినాలని ఇష్టపడే వారు ఉప్పుకు బదులుగా నిమ్మ పొడి, ఆమ్‌చూర్ పొడి వాము, మిరియాల పొడి, ఒరెగానో.. వంటివి ఉపయోగించుకోవచ్చు. తద్వారా ఉప్పును తగ్గించుకోవచ్చు. కూరలు వండు కునేటప్పుడు చాలా మంది ముందే కారంతో పాటు ఉప్పు కూడా వేసేస్తుంటారు. కానీ కూర పూర్తిగా ఉడికిన తర్వాత.. దానిపై నుంచి కాస్త ఉప్పు చల్లినా రుచికి సరిగ్గా సరిపోతుందంటున్నారు నిపుణులు.

**సాస్‌లు, నిల్వ పచ్చళ్లు..** మొదలైన వాటిలో ఉప్పు మోతాదుకు మించి ఉంటుంది. ఇలాంటివి అధికంగా తీసుకుంటే ఆరోగ్యానికి హానికరం. కాబట్టి ఇలాంటి పదార్థాలు తీసుకోవడం బాగా తగ్గించాలి.

**పెరుగు, సలాడ్స్, పండ్లు..** వంటి వాటిలో కూడా ఉప్పు చల్లుకొని తినడం కంటే నేరుగా తినడమే మంచిది. తద్వారా వాటిలోని రుచి తెలుస్తుంది. అలాగే ఉప్పునూ తగ్గించుకున్న వాళ్లమవుతాం. ఉప్పు ఎక్కువ తీసుకోవడం వల్ల శరీరంలో నీటి స్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా ముఖం, పొట్ట, ఇతర శరీర భాగాలు ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. అందుకే ఉప్పు మోతాదు క్రమంగా తగ్గించుకోవాలి.



చాలామందికి డైనింగ్ టేబుల్పై ఉప్పు డబ్బా ఉంచడం అలవాటు. అలాగే కొంతమంది తినేటప్పుడు ఉప్పు డబ్బాను తమ వెంటే ఉంచుకుంటారు. ఇలా కూడా ఎక్కువ ఉప్పు తీసుకునే అవకాశం ఉంటుంది. కాబట్టి ఈ అలవాటును మానుకోవడం వల్ల ఉప్పు వినియోగాన్ని తగ్గించుకోవచ్చు. ఒకవేళ ఇప్పటికే బిపి, హైపర్ టెన్షన్, గుండె సంబంధిత సమస్యలు.. ఉన్నట్లయితే రోజుకు ఎంత ఉప్పు తీసుకోవాలో వైద్యులను అడిగి తెలుసుకోండి. వారు మీ ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి ఎంత మోతాదులో తీసుకోవచ్చో సూచిస్తారు.

# తెర

# బోనమెత్తిన కామాక్షి


టాలీవుడ్ సీనియర్ ప్రొడ్యూసర్ అండ్ డైరెక్టర్ ఎం.ఎస్. రాజు లైనప్ నుంచి వస్తున్న లేటెస్ట్ డివైన్ మిస్టిక్ థ్రిల్లర్ అగధ . శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్ పతాకంపై అజయ్ కేఆర్ సమర్పణలో కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రవణ్ రెడ్డి, కామాక్షి భాస్కర్ల ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్ట్ 14, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రాబోతున్న నేపథ్యంలో.. మేకర్స్ తమ ప్రచార కార్యక్రమాలను అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ చిత్ర కథ కొంతమేర అమ్మవారి మహత్యం, ఆధ్యాత్మిక అంశాల చుట్టూ తిరగనుంది. ఈ క్రమంలో చిత్రయూనిట్ హైదరాబాద్‌లోని ఆధ్యాత్మిక క్షేత్రం బల్కంపేట ఎల్లమ్మపోచమ్మ దేవాలయాన్ని సందర్శించింది. కథానాయిక కామాక్షి భాస్కర్ల సంప్రదాయ అలంకరణలో అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. అనంతరం దర్శకుడు ఎం.ఎస్. రాజు, హీరో శ్రవణ్ రెడ్డి, నిర్మాత కాశీ విశాలాక్షి బలుసు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సుబ్బరాజు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార జాతరకు శ్రీకారం చుట్టారు.





# కృష్ణ తెలుగు సినిమా గుండెకాయ

తెలుగు సినీ పరిశ్రమకు నందమూరి తారకరామారావు, అక్కినేని నాగేశ్వరరావు రెండు కళ్ల లాంటి వారైతే, సూపర్ స్టార్ కృష్ణ తెలుగు సినిమాకు గుండెకాయ అని సీనియర్ నటుడు వీకే నరేష్ వ్యాఖ్యానించారు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, స్వర్గీయ రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా పరిచయమవుతున్న శ్రీనివాస మంగాపురం చిత్ర ప్రమోషన్లలో భాగంగా నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నరేష్ ఈ వ్యాఖ్యలు చేశారు. జయకృష్ణను చిన్నప్పటి నుంచి చూస్తున్నానని, ఘట్టమనేని లెగసీని భారంగా భావించకుండా ఒక బాధ్యతగా స్వీకరిస్తున్నాడని నరేష్ కొనియాడారు. సొంత గుర్తింపు కోసం జయకృష్ణ పడుతున్న తపన ప్రశంసనీయమన్నారు. కృష్ణ గారు తేనె మనసులుతో ప్రారంభించి, తొలి కలర్ ఫిల్మ్, ఫస్ట్ సినిమా స్కోప్, ఫస్ట్ 70 సినిమాలతో టాలీవుడ్‌లో సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. అప్పట్లోనే మోసగాళ్లకు మోసగాడు చిత్రంతో పాన్‌ఇండియా స్థాయిలోనే కాకుండా రష్యా వరకు వెళ్లి పాన్‌ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చారని తెలిపారు.



# లేడీ కాప్ ఆఫీసర్?

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం స్పిరిట్. టిసిరీస్,భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ ప్యాన్‌ఇండియా కాప్ డ్రామాపై ప్రపంచవ్యాప్తంగా అపారమైన అంచనాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. ఈ సినిమాలో పవర్‌ఫుల్ లేడీ పోలీస్ ఆఫీసర్ పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్‌ను సంప్రదించినట్లు సమాచారం. మల్లీశ్వరి (2004), అల్లరి పిడుగు (2005) చిత్రాల తర్వాత దాదాపు 21 సంవత్సరాల సుదీర్ఘ విరామం అనంతరం కత్రినా కైఫ్ మళ్లీ తెలుగు తెరపై కనిపించడం ఖాయం. కథను కీలక మలుపు తిప్పే పోలీస్ ఆఫీసర్ పాత్ర కావడంతో ఈ కామియో రోల్‌పై కత్రినా కూడా సానుకూలంగా ఉన్నట్లు టాక్. ఇప్పటికే ఈ సినిమా 40 శాతం షూటింగ్‌ను పూర్తి చేసుకుంది. చిత్రంలో ప్రభాస్ పాత్రతో పాటు, ఫ్లాష్‌బ్యాక్‌లో ఆయన కనిపించే పక్కా వైల్డ్ అండ్ మాస్ అవతార్ సినిమాకే ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. యానిమల్ ఫేమ్ త్రిప్తి దిమ్రి కథానాయికగా నటిస్తుండగా, సందీప్ వంగా మార్క్ వినూత్నమైన కథాంశం ప్రేక్షకులను థ్రిల్ చేయనుంది. సందీప్ రెడ్డి వంగా మేకింగ్, ప్రభాస్ ఇంటెన్స్ పోలీస్ అవతార్‌కి తోడు కత్రినా కైఫ్ వంటి స్టార్ ఎంట్రీ తోడైతే స్పిరిట్ బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తుందని మూవీ టీం ధీమా వ్యక్తంచేస్తోంది.



# కహానీ 3కి యామీ గౌతమ్




బాలీవుడ్‌లో సరికొత్త బెంచ్‌మార్క్ క్రియేట్ చేసిన మోస్ట్ సక్సెస్ ఫుల్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజ్ కహానీ. విద్యా బాలన్ ప్రధాన పాత్రలో వచ్చిన కహానీ, కహానీ 2 చిత్రాలు బాక్సాఫీస్ వద్ద రికార్డు కలెక్షన్లు సాధించడమే కాకుండా, గ్రిప్పింగ్ స్టోరీటెల్లింగ్, ఊహించని ట్విస్టులతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఇప్పుడు ఈ హిట్ ఫ్రాంచైజ్‌లో మూడో భాగం కహానీ 3 రూపుదిద్దుకోబోతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు జోరందుకున్నాయి. తొలి రెండు భాగాలను అద్భుతంగా తెరకెక్కించిన దిగ్గజ దర్శకుడు సుజోయ్ ఘోష్ ఈ మూడో భాగానికి కూడా దర్శకత్వం వహించనున్నారు. తొలి రెండు భాగాల్లో విద్యా బాలన్ నటన విమర్శకుల ప్రశంసలందుకుంది. అయితే ఈ కహానీ 3లో ఆమె కనిపించకపోవడం అభిమానులను కొంత నిరాశకు గురిచేసినప్పటికీ.. ఆమె స్థానంలో నేషనల్ అవార్డు గ్రహీత, నటి యామీ గౌతమ్ ఎంట్రీ ఇస్తుండటం సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది.



# సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే చేసిన కథ

వైవిధ్యమైన పాత్రలతో మెప్పించే కథానాయకుడు సుమంత్ హీరోగా, ప్రముఖ ఓటీటీ సంస్థ ఈటీవీ విన్ నిర్మాణంలో తెరకెక్కిన సస్పెన్స్ ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్ న్యూటన్స్ థర్డ్ లా. రాజేశ్ కర్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కె. హరీశ్ నిర్మించారు. జగపతిబాబు, శ్రీనివాస్ అవసరాల, రవివర్మ తదితరులు కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్ వేడుకను నిర్వహించగా, టాలెంటెడ్ హీరో అడివి శేష్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ఆనంతరం మాట్లాడుతూ ఈ సినిమా ట్రైలర్ చాలా బాగుంది. దర్శకుడు రాజేష్ నాకు ఎప్పటినుంచో మంచి స్నేహితుడు. ఈ సినిమా ఖచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను అని తెలిపారు. గతంలో నేను నటించిన మళ్ళీ రావా చిత్రం తర్వాత సింగిల్ సిట్టింగ్‌లోనే ఓకే చేసిన కథ ఇది. ఈ సినిమాలో ప్రతి పాత్రకూ, స్క్రీన్ ప్లేకి కథను ఊహించని మలుపులు తిప్పే ప్రాధాన్యత ఉంది. అందుకే ఈ కథ వినగానే ఒప్పేసుకున్నాను అని హీరో సుమంత్ చెప్పారు. దర్శకుడు రాజేష్ కర్ణ మాట్లాడుతూ ఈ థ్రిల్లర్ ప్రేక్షకులకు హై ఇస్తుంది. ముఖ్యంగా ఇంటర్వెల్ లో పైసా వసూల్ ఫీలింగ్, క్లైమాక్స్‌లో మైండ్ బ్లోయింగ్ ట్విస్టులు ఉంటాయన్నారు. నిర్మాత కే. హరీష్ మాట్లాడుతూ పరిమిత బడ్జెట్‌లో అద్భుతమైన చిత్రాలు తీయడానికి అడివి శేష్ తనకు స్ఫూర్తి అన్నారు. ఈటీవీ విన్ సాయి కృష్ణ భరణి మాట్లాడుతూ ఈటీవీ విన్ ప్రయాణంలో మరో వైవిధ్యమైన ప్రయత్నమిదని, ఉషా కిరణ్ మూవీస్ తరహాలోనే కొత్త ప్రతిభను, సరికొత్త కంటెంట్‌ను ప్రోత్సహిస్తూ ఈ చిత్రాన్ని జూలై 31న ప్రేక్షకుల ముందుకు తెస్తున్నామని తెలిపారు. జగపతిబాబు, సుమంత్‌లతో కలిసి పని చేయడం గొప్ప అనుభవమని నేహా చెప్పగా, ఈ సినిమాకు సంగీతం అందించడం సంతోషంగా ఉందని, చిత్రం మంచి విజయం సాధించాలని సింజిత్ కోరారు.




# హైవోల్టేజ్ యాక్షన్ సీన్స్..

రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ, టాలెంటెడ్ డైరెక్టర్ రవి కిరణ్ కోలా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం రౌడీ జనార్దన. దిల్ రాజు సమర్పణలో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ ప్యాన్‌ఇండియా రూర్ల్ యాక్షన్ డ్రామా ప్రారంభం నుంచే అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఈ సినిమాకి సంబంధించి ఫిల్మ్‌నగర్ వర్గాల్లో ఒక ఆసక్తికరమైన వార్త చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రంలో సెకండ్ హాఫ్ కథకు ప్రధాన బలమని, ముఖ్యంగా విజయ్ దేవరకొండ పాత్రపై వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ సినిమాకే మెయిన్ హైలైట్‌గా నిలవనుందని సమాచారం. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ కథలో విజయ్ దేవరకొండ పాత్ర చుట్టూ అల్లిన ఫ్లాష్‌బ్యాక్ సీన్స్ ఫుల్ యాక్షన్ ఎలిమెంట్స్‌తో పాటు మైండ్ బ్లాకింగ్ ఎమోషన్స్‌తో సాగుతాయట. విజయ్ మార్క్ రఫ్ అండ్ రస్టిక్ అవతార్, విజువల్ వండర్‌గా రాబోయే యాక్షన్ సీన్స్ థియేటర్లలో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తాయని టాక్. ఈ ప్రాజెక్ట్‌లో యాంగ్రీ మేన్ రాజశేఖర్ ఒక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో ఆయన పాత్రతో పాటు మేకోవర్, లుక్ ఇంతకుముందెన్నడూ చూడని విధంగా చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని సమాచారం. విజయ్ దేవరకొండకి జోడీగా నేషనల్ అవార్డ్ విన్నింగ్ యాక్ట్రెస్ కీర్తి సురేష్ నటిస్తుండటంతో కాంబినేషన్ పరంగానూ సినిమా పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. బలమైన డ్రామా కాంబినేషన్‌లో వస్తున్న ఈ రౌడీ జనార్దన బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి రికార్డులు సృష్టిస్తుందో చూడాలి.



# మెగాఫోన్

టాలీవుడ్‌లో హీరోలే దర్శకులుగా అవతారం ఎత్తే యాక్టర్ కమ్ డైరెక్టర్ ట్రెండ్ రోజురోజుకూ ఊపందుకుంటోంది. ఇప్పటికే విశ్వక్ సేన్, కిరణ్ అబ్బవరం, రామ్ పోతినేని వంటి హీరోలు మెగాఫోన్ పట్టి సరికొత్త ప్రాజెక్టలతో సంచలనం సృష్టించగా.. ఇప్పుడు అదే బాటలో మరో నైట్రో స్టార్ పయనించేందుకు రెడీ అయ్యారు. తన నటన, ఫిట్‌నెస్‌తో అభిమానులను అలరించే సుధీర్ బాబు త్వరలోనే డైరెక్టర్ చైర్‌లో కూర్చోబోతున్నారనే వార్త ఫిలిం నగర్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నటుడిగానే కాకుండా ప్రొడ్యూసర్‌గానూ తన మార్క్ చూపించిన సుధీర్ బాబు, గత కొంతకాలంగా ఒక వైవిధ్యమైన స్క్రిప్ట్‌పై పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ వినూత్న కథను వేరే ఏ దర్శకుడి చేతిలో పెట్టకుండా, తన అనుభవంతో తానే స్వయంగా తెరకెక్కిస్తేనే సంపూర్ణ న్యాయం జరుగుతుందని భావించి ఈ నిర్ణయం తీసుకున్నాని తెలుస్తోంది.



# జైలర్‌తో పోటీకి దిగుతారా!

అమరన్ ఫేమ్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వంలో ధనుష్ హీరోగా, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల ముఖ్య పాత్రల్లో రూపుదిద్దుకుంటున్న చిత్రం ఓం. మొదట టీజర్, ప్రమోషనల్ పోస్టుల్లో అక్టోబర్ 16న థియేటర్లలోకి వస్తున్నట్లు స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, తాజాగా విడుదల చేసిన ఫస్ట్ సింగిల్ ప్రమోషనల్ పోస్టర్‌లో మాత్రం రిలీజ్ డేట్‌ను మేకర్స్ పొందుపరచలేదు. దీంతో రజినీకాంత్ జైలర్ 2 క్రేజ్ దృష్ట్యా ధనుష్ సినిమా రిలీజ్ డేట్ వాయిదా పడుతోందా లేక సోలోగా వచ్చేందుకు కొత్త తేదీని వెతుక్కుంటున్నారా? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఈ కన్ఫ్యూజన్ ఒకవైపు ఉంటే.. సినిమా నుంచి వస్తున్న మొదటి పాటపై అంచనాలు భారీగా ఉన్నాయి. ట్రెండింగ్ మ్యూజిక్ సెన్సేషన్ సాయి అభ్యంకార్ స్వరాలు సమకూర్చిన ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్‌ను జూలై 28న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. జైలర్ 2తో ధనుష్ పోటీకి దిగుతారా లేక పక్కకు తప్పుకొని సోలో రిలీజ్ ప్లాన్ చేస్తారా అనేది త్వరలోనే రాబోయే ప్రమోషనల్ కంటెంట్‌తో స్పష్టత రానుంది.



# త్వరలో రజనీకాంత్ బయోపిక్..

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో తిరుగులేని సూపర్‌స్టార్‌గా వెలుగొందుతున్న నటుడు రజనీకాంత్ ఒక సంచలన నిర్ణయం తీసుకున్నట్లు ఫిలిం నగర్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. సాధారణ బస్ కండక్టర్ స్థాయి నుంచి ఇండియన్ సినిమా అగ్రకథానాయకుడిగా ఎదిగిన తన సుదీర్ఘ జీవిత ప్రయాణాన్ని, ఎదుర్కొన్న ఒడిదొడుకులను అభిమానులతో పంచుకోవడానికి ఆయన సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన స్వయంగా తన ఆత్మకథ రాసే పనిలో నిమగ్నమయ్యారని, తన వ్యక్తిగత అనుభవాలన్నింటినీ ఈ పుస్తకంలో పొందుపరచనున్నారని సమాచారం. ఇక కేవలం ఆత్మకథ రాయడమే కాకుండా, ఈ పుస్తకం ఆధారంగా ఒక భారీ బయోపిక్ సినిమాగా తెరకెక్కించే దిశగా కూడా ఆలోచనలు జరుగుతున్నాయి.

దీనిపై రజనీ తన అత్యంత సన్నిహితులతో చర్చలు జరిపి నట్లు వార్తలు వస్తున్నాయి. రజనీకాంత్ పాత్రలో ఏ హీరో నటిస్తే బాగుంటుందనే దానిపై సోషల్ మీడియాలో అప్పుడే చర్చ మొదలైంది.

# కామన్వెల్త్ గేమ్స్‌లో తొలి స్వర్ణం



## వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చానుకు గోల్డ్

**గ్లాస్గో,జులై 26:** గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఆదివారం జరిగిన మహిళల 48 కిలోల విభాగంలో సత్తా చాటిన మీరాబాయి అగ్రస్థానంలో పసిడి వెలుగులు విరజిమ్మింది. ఆసియా క్రీడలే తన అసలైన లక్ష్యమని, కామన్వెల్త్‌లో వందశాతం ప్రయత్నిస్తానో లేదోనని చెప్పిన ఆమె అందరి అంచనాలు అందుకుంటూ ఈ టోర్నీలో వరసగా మూడోసారి గోల్డ్‌మెడల్‌తో మెరిసింది. కామన్‌వెల్త్ క్రీడల్లో వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. 2018, 2022లో పసిడి పతకం కొల్లగొట్టిన మీరాబాయి గ్లాస్గోలోనూ పట్టువదల్లేదు. ఫైనల్లో బరువులు ఎత్తిన భారత స్టార్ ఈ ఎడిషన్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించింది. ఇదివరకు 82 కిలోలతో కామన్వెల్త్‌లో రికార్డు నెలకొల్పిన మీరాబాయి క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో తొలి ప్రయత్నంలో విఫలమైంది. రెండోసారి తడబడకుండా 82 కిలోలు, మూడో ప్రయత్నంలో 85 కిలోలు ఎత్తి సరికొత్త రికార్డు సాధించింది. అనంతరం 105 కిలోలను సైతం అవలీలగా ఎత్తిన మీరాబాయి పసిడి పతకంతో మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. తద్వారా భారత్ పతకాల సంఖ్య మూడుకు చేరింది.మీరా కంటే ముందు వెయిట్‌లిఫ్టింగ్‌లోనే చనంబమ్ రిషికాంత సింగ్ రజతంతో మెరిశాడు. పురుషుల 60 కిలోల విభాగంలో సత్తా చాటిన అతడు రెండోస్థానంతో సరిపెట్టుకున్నాడు. కామన్వెల్డ్ రికార్డు నెలకొల్పిన రిషికాంత సింగ్ పసిడి వేటలో వెనకబడి వెండి వెలుగులు విరజిమ్మాడు. మలేషియా వెయిట్‌లిఫ్టర్ మొహమద్ అనిక్ బిన్ కస్డాన్ స్వర్ణం ఎగరేసుకుపోయాడు. రిషికాంత్, మొహమూద్‌లు ఇద్దరూ విజయవంతంగా 121 కిలోలు ఎత్తడం ఈ క్రీడల చరిత్రలో ఇదే మొదటిసారి.





## జింబాబ్వేపై హ్యాట్రిక్ విక్టరీ

### క్లీన్‌స్వీప్ చేసిన భారత్

**న్యూఢిల్లీ:** హరారే వేదికగా జరిగిన చివరి టి20 పోరులో భారత్ అద్భుత విజయం సాధించింది. జింబాబ్వేను 35 పరుగుల తేడాతో చిత్తు చేసి 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. బ్యాటింగ్, బౌలర్ల క్రమశిక్షణతో కూడిన ప్రదర్శనతో టీమిండియా ఈ పర్యటనను క్లీన్ స్వీప్‌తో ఘనంగా ముగించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు వైభవ్ సూర్యవంశీ ఆరంభాన్ని అందించాడు. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే 49 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్సర్ల సహాయంతో 81 పరుగులు చేసి జట్టుకు స్కోరు అందించాడు. ఇషాన్ కిషన్ (29), శ్రేయస్ అయ్యర్ (27) తమ వంతు సహకారం అందించగా, ఆఖరి ఓవర్లలో రింకూ సింగ్ (25) వేగంగా ఆడటంతో నిర్ణీత 20 ఓవర్లలో భారత్ 5 వికెట్ల నష్టానికి 192 పరుగుల భారీ స్కోరు సాధించింది.

ఇక 193 పరుగుల క్లిష్టమైన లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వేకు తొలి బంతికే గట్టి షాక్ తగిలింది. భారత పేసర్ మయాంక్ యాదవ్ మొదటి బంతికే ఓపెనర్ బ్రయాన్ బెన్నెట్‌ను అవుట్ చేసి ప్రత్యర్థిని ఒత్తిడిలోకి నెట్టాడు. జింబాబ్వే బ్యాటర్లు వరుసగా వికెట్లు కోల్పోవడంతో కోలుకోలేకపోయారు. భారత బౌలర్లు క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ జింబాబ్వేను ఎక్కడా కోలుకోనివ్వలేదు. మయాంక్ యాదవ్, యష్ ఠాకూర్, రవి బిష్ణోయ్ వరుస వికెట్లతో విరుచుకుపడ్డారు. జింబాబ్వే బ్యాటర్లలో ర్యాన్ బర్ల్, వెస్లీ మధ్వేరే కాసేపు పోరాడినా జట్టును విజయం వైపు నడిపించలేకపోయారు. నిర్ణీత 20 ఓవర్లలో జింబాబ్వే 7 వికెట్లు కోల్పోయి 157 పరుగులకే పరిమితమైంది.

## హాకీ ఫైవ్స్ ఆసియా..

# ఛాంపియన్‌గా భారత్

### 3-1 తేడాతో పాకిస్థాన్ చిత్తు



**న్యూఢిల్లీ:** మస్కట్ వేదికగా ఉత్కంఠభరితంగా జరిగిన ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్ పోటీల్లో భారత సబ్ జూనియర్ పురుషుల జట్టు తమ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను 3-1 తేడాతో ఓడించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం జరిగిన ఈ టోర్నమంట్‌లో రోమిత్ పాల్(5వ నిమిషం), కెప్టెన్ కేతన్ కుష్వాహా(12వ నిమిషం), షారుఖ్ అలీ(13వ నిమిషం) చేసిన 3 గోల్స్‌తో భారత్ ఆసియా ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయంతో భారత పురుషుల జట్టు ఎలైట్ పూల్ పట్టికలో అగ్రస్థానానికి చేరుకుంది. ఖచ్చితమైన పాస్‌లు, క్రమశిక్షణతో కూడిన వ్యూహాల పుణ్యమా అని ఫైనల్‌లో భారత్ ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. తొలి అర్ధభాగంలో పాకిస్థాన్ గోల్ కీపర్‌ను ఓడించి రోమిత్ పాల్ తొలి గోల్ చేయడంతో విరామ సమయానికి భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగం ఆరంభంలోనే కెప్టెన్ కేతన్ కుష్వాహా (12వ నిమిషం) గోల్ చేసి భారత్‌ను పటిష్టమైన స్థితిలో నిలబెట్టాడు. ఆ వెంటనే షారుఖ్ అలీ మరో గోల్ చేసి స్కోరును 3-0కి చేర్చాడు. మహమ్మద్ ఉస్మాన్ (16వ నిమిషం) ద్వారా పాకిస్థాన్ ఆధిక్యాన్ని తగ్గించినప్పటికీ చివరి నిమిషాల్లో భారత డిఫెన్స్ విభాగం పటిష్టంగా నిలబడి మరిన్ని గోల్స్ జరగకుండా అడ్డుకుంది. ఫైనల్‌కు చేరడం ద్వారా భారత్, పాకిస్తాన్ దేశాలు రెండూ తొలి ఎఫ్ఐహెచ్ యూత్ హాకీ ఫైవ్స్ ప్రపంచ కప్‌కు అర్హత సాధించాయి.



## కామన్‌వెల్త్.. వెయిట్‌లిఫ్టింగ్‌లో

# రిషికాంతకు రజతం

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్-2026 పురుషుల 60 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో, స్నాచ్‌లో భారత్ వెయిట్‌లిఫ్టర్ రికార్డు బ్రేకింగ్ ప్రదర్శన కనబరిచాడు. ఓవరాల్‌గా రెండో స్థానంలో నిలిచిన భారత క్రీడాకారుడు రిషికాంత సింగ్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. గ్లాస్గోలో ఆదివారం జరిగిన ఈ పోటీలో రిషికాంత తన తొలి స్నాచ్ ప్రయత్నంలో 116 కేజీలు ఎత్తి, ఆత్మవిశ్వాసంతో ప్రారంభించాడు. తదుపరి రెండవ ప్రయత్నంలో 119 కేజీలకు మెరుగుపడ్డాడు. ఆతర్వాత అతడు తన మూడవ ప్రయత్నంలో 121 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి, గత యేడాది కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్‌లలో నెలకొల్పిన తన 120 కిలోల అత్యుత్తమ రికార్డును అధిగమించి కొత్త జాతీయ రికార్డును నెలకొల్పాడు. ఈ ప్రయత్నం కామన్వెల్త్ గేమ్స్ స్నాచ్‌లో కూడా కొత్త రికార్డును నెలకొల్పింది. మలేషియాకు చెందిన బిన్ కాస్డాన్ మొహమద్ అనిక్ తన చివరి స్నాచ్ ప్రయత్నంలో రిషికాంత 121 కేజీల బరువును సమం చేసి, క్లీన్ అండ్ జర్క్‌లో ఉత్కంఠభరితమైన పోరుకు రంగం సిద్ధం చేశాడు. క్లీన్ అండ్ జర్క్‌లో అగ్రస్థానంతో బరిలోకి దిగిన రిషికాంత, తన తొలి ప్రయత్నంలో 145 కేజీలు ఎత్తగలిగాడు. కానీ, మిగిలిన రెండు లిఫ్టులలో 148 కేజీలు, 151 కేజీలు ఎత్తడంలో విఫలమయ్యాడు. అతను మొత్తం 266 కేజీలతో ముగించాడు. ఈలోగా, కాస్డాన్ క్లీన్ అండ్ జర్క్‌లో 145 కేజీలు, 149 కేజీలు మరియు 152 కేజీలను విజయవంతంగా ఎత్తి, మొత్తం 273 కేజీల గేమ్స్ రికార్డును నమోదు చేసి, స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నాడు.

## బాక్సింగ్‌లో రికార్డు సృష్టించిన నిశాంత్



**న్యూఢిల్లీ:** భారత బాక్సర్ నిశాంత్ దేవ్ మరో సంచలన ప్రదర్శన చేశాడు. తొలి రౌండ్‌లోనే సీజర్ డియాజ్‌ను ఓడించి తన అజేయ ప్రొఫెషనల్ రికార్డును కొనసాగించాడు. ఆంథోనీ జాషువా వర్సెస్ క్రిస్టియన్ ప్రెంగా ఈవెంట్ పోరులో, సూపర్ వెల్టర్‌వెయిట్ ఫైటర్, డియాజ్‌ను మూడుసార్లు కింద పడేసిన తర్వాత, మొదటి రౌండ్‌లో కేవలం 2:56 నిమిషాలలోనే టెక్నికల్ నాకౌట్ విజయాన్ని సాధించాడు. ఆరంభ గంట మోగినప్పటి నుంచే దేవ్ పట్టు సాధించి, తన ప్రత్యర్థిని వెంటవెంటనే రెండుసార్లు నేలకూల్చాడు. ఆ తర్వాత నిశాంత ఓపికగా ఉండి, మరో అవకాశం కోసం వేచి చూసి, రౌండ్ చివర్లో ఒక పదునైన లెఫ్ట్ అప్పర్‌కట్‌తో ప్రత్యర్థిని మూడోసారి కిందపడగొట్టాడు. డియాజ్ తిరిగి లేచి నిలబడగలిగినప్పటికీ, అతను పోటీని కొనసాగించలేని స్థితిలో ఉన్నాడని రెఫరీ తీర్పునిచ్చి, మొదటి రౌండ్‌లో కేవలం 4 సెకన్లు మిగిలి ఉండగానే పోటీని నిలిపివేశారు. ఈ విజయంతో దేవ్ ప్రొఫెషనల్ రికార్డు 70కి మెరుగుపడగా, అందులోని ఐదు విజయాలు నాకౌట్ ద్వారా వచ్చాయి. ఇది భారతదేశపు అత్యంత ప్రతిభావంతులైన బాక్సింగ్ క్రీడాకారులలో ఒకరిగా అతని ఖ్యాతిని మరింత బలపరిచింది. ఈ అద్భుతమైన విజయంతో, 24 ఏళ్ల యువకుడు తన ప్రొఫెషనల్ కెరీర్‌లో అద్భుతమైన ఆరంభాన్ని కొనసాగిస్తూ, సూపర్ వెల్టర్‌వెయిట్ విభాగంలో ఉన్నత ర్యాంకు ప్రత్యర్థులను సవాలు చేసేందుకు మరో అడుగు ముందుకు వేశాడు. బాక్సింగ్‌లోని అత్యున్నత టైటిళ్ల కోసం అతను ప్రయత్నిస్తున్న తరుణంలో, అతని తాజా మొదటి రౌండ్ స్టాపేజ్ విజయం అతని స్థాయిని మరింత పెంచుతుందని భావిస్తున్నారు.




**వాణిజ్యం**

## ఉపాధి, నైపుణ్యాభివృద్ధికి

# రూ. లక్ష కోట్లు

### 3.5 కోట్ల ఉద్యోగాలే లక్ష్యం: నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ,జులై 26:** కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కింద రూ.1 లక్ష కోట్లను కేటాయించి దేశవ్యాప్తంగా 3.5 కోట్ల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రభుత్వ ప్రధాన కార్యాచరణలో కీలకమని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ నియామక కార్యక్రమాల ద్వారా ఇప్పటికే 12 లక్షలకు పైగా నియామక పత్రాలను అభ్యర్థులకు అందించినట్లు తెలిపారు.పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజనకు రూ.1 లక్ష కోట్ల నిధులు కేటాయించామని, దీని ద్వారా 3.5 కోట్ల ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని సీతారామన్ చెప్పారు. ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన కింద ఇప్పటి వరకు 1.6 కోట్లకు పైగా యువతకు 200కు పైగా కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించినట్లు వెల్లడించారు. వెయ్యి పారిశ్రామిక శిక్షణా సంస్థలు ఆధునీకరణ కోసం రూ.60,000 కోట్లను కేటాయించి వృత్తి విద్యను బలోపేతం చేయడంతో పాటు యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరచనున్నట్లు చెప్పారు. యువతకు దేశంలోని టాప్ 500 కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కలిస్తున్నామని. వ్యవస్థాపకతను ప్రోత్సహించేదిశగా ప్రభుత్వం పలు పథకాల ద్వారా 12 కోట్లకు పైగా కొత్త పారిశ్రామికవేత్తలకు రుణాలు అందించి, కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు లేదా ఇప్పటికే ఉన్న వ్యాపారాలను విస్తరించేందుకు సహకరిస్తోందని సీతారామన్ పేర్కొన్నారు.కృత్రిమ మేధ (ఏఐ) విప్లవం కేవలం మహా నగరాలకే పరిమితంకాకూడదని ప్రభుత్వం భావిస్తోందనిఆమె చెప్పారు. ఇప్పటికే 27ఏఐప్రయోగశాలలు రెండు, మూడో శ్రేణినగరాల్లో ఏర్పాటు చేశామని, మరో 543ఏఐ ల్యాబ్‌ల ఏర్పాటుకు ఆమోదం లభించిందని వెల్లడించారు.







Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.